SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 02
July-2024, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జూలై 2024
వెల రూ. 20/-
పుటలు - 56



తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థాన మహోత్సవం
(16-07-2024)



13-06-2024 న శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనార్థమై తిరుమలకు సకుటుంబ సమేతంగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర నూతన ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ **నారా చంద్రబాబునాయుడు** దంపతులు, వారి కుమారుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు (హెచ్.ఆర్.(విద్యాశాఖ), ఐ.టి. ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, ఆర్‌టిజి) గౌ॥ శ్రీ **నారా లోకేష్** దంపతులు వారి కుమారుడు, ఇతర ప్రముఖులు మరియు అధికారులు. దర్శనానంతరం రంగనాయకులమండపంలో ముఖ్యమంత్రి దంపతులకు శేషవస్త్రంతో వేదాశీర్వచనం చేస్తున్న వేదపండితులు. అనంతరం వారికి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందిస్తున్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., మరియు శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.,



# గీతాశ్లోకార్థసారం

శ్లో : అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః
అనాశినోఽ ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-18వ శ్లోకం)

ప్రతిపదార్థం: నిత్యస్య=నిత్యుడును; అనాశినః=నాశనము లేనివాడును; అప్రమేయస్య= ప్రత్యక్షాది ప్రమాణములచే తెలిసికొనబడనివాడునగు; శరీరిణః= దేహియైన ఆత్మయొక్క; ఇమే దేహాః= ఈ శరీరములు; అన్తవన్తః=వినాశము కలవిగా; ఉక్తాః= చెప్పబడినవి; తస్మాత్= ఆ కారణమువలన; భారత= ఓ అర్జునా!; యుధ్యస్వ= యుద్ధము చేయుము.

భావం: ఓ అర్జునా! నిత్యుడును, నాశరహితుడును, అప్రమేయుడును ఐన దేహి (ఆత్మ) యొక్క ఈ దేహములు నాశవంతములుగ చెప్పబడినవి. (ఆత్మయో శాశ్వతుడు). కాబట్టి (ఆత్మనుగూర్చికాని, దేహమునుగూర్చికాని శోకమును వదలి) నీవు యుద్ధము చేయుము.

---

## గురుప్రసాదమిచ్చిన గురుదైవము శ్రీవేంకటేశ్వరుడు!!

జ్ఞానయజ్ఞ మీ- గతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే- నడపె మా గురుఁడు

అలరి దేహ మనేటి- యాగశాలలోన
బలువై యజ్ఞానపు- పశువు బంధించి,
కలసి వైరాగ్యపు- కత్తులఁ గోసికోసి
వెలయ జ్ఞానాగ్నిలో- వేలిచె మా గురుఁడు

మొక్కుచు వైష్ణవులనే - ముని సభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థ - సోమపానము నించి,
చక్కగా సంకీర్తన- సామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సే-యించెఁబో మా గురుఁడు.

తదీయ గురుప్రసాద- దపురోడాశ మిచ్చి
కొదదీర ద్వయ మను- కుండలంబులు వెట్టి,
యెదలో శ్రీవేంకటేశు- నిటు ప్రత్యక్షము చేసె
ఇదివో స్వరూపదక్ష- యిచ్చెను మా గురుఁడు.

(అధ్యాత్మ సంకీర్తన - 2-148)



జ్ఞానయజ్ఞము ఈ చెప్పబోవురీతిగా మోక్షమునకు ఉపాయమౌతోంది. ఈ యజ్ఞమునకు సంబంధించిన వివిధకార్యాలు మా ఆచార్యుడు నిన్ననే నిర్వహించాడు.



శరీరమనే యజ్ఞశాలలో బలమైన (పెద్ద) అజ్ఞానమనే పశువును బంధించి, వైరాగ్యమనే కత్తులతో కోసి, జ్ఞానమనే అగ్నిలో మా గురుడు వేల్చినాడు.

నమస్కారోపచారాలు గావిస్తూ పరమభాగవతులైన వైష్ణవులనే మునులసభను జేర్చి, ఆనందిస్తూ మాకందరికీ శ్రీపాదతీర్థం అనే సోమపానమునందించి, రమణీయంగా సంకీర్తనమనే సామగానము నొనర్చి వేదవిహితమైన పద్ధతితో మా ఆచార్యుడు జ్ఞానయజ్ఞము చేయించాడు.

మరియు మా గురుడు తనకు సంబంధించిన గురుప్రసాదమనే హుతశేషమునిచ్చి కొఱత దీరునట్లుగా 'ద్వయము' అనే కుండలాలు పెట్టాడు. హృదయంలో శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షం గావించాడు. ఇదిగో మాకు స్వరూపదీక్షను ఇచ్చాడు అంటూ జ్ఞానగురువుయొక్క గొప్పతనాన్ని అన్నమయ్య పై సంకీర్తనలో వర్ణించాడు.

- కీ.శే. డా॥ సముద్రాల లక్ష్మణయ్య.



## తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివార్ల పవిత్రోత్సవములు

| తేదీలు | వారము | ఉత్సవములు | |
|---|---|---|---|
| 17-07-2024 | బుధ | --- | అంకురార్పణ |
| 18-07-2024 | గురు | పంచమూర్తులకు స్నపన తిరుమంజనం | పవిత్రమండలపూజ, హోమములు |
| 19-07-2024 | శుక్ర | గ్రంధి పవిత్ర సమర్పణ, వ్రతచరి | పవిత్ర ప్రతిష్ఠ, వ్రతచరి |
| 20-07-2024 | శని | పవిత్ర సమర్పణ, పవిత్రోత్సవ సమాప్తి | పంచమూర్తుల వీధి ఉత్సవము |

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 జూలై, 2024 సంచిక : 02



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| నిత్యైశ్వర్యోభవ | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 07 |
| సాక్షాత్కారం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 09 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| చాతుర్మాస్యం | శ్రీ సంపత్ బాలాజి | 12 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 14 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 15 |
| స్వామిమలై | లావణ్య శ్రీవరం | 16 |
| కర్తవ్యం | శ్రీ కొందూరి కాశీవిశ్వేశ్వరరావు | 18 |
| గురువందనం | శ్రీ టి.ఎల్.ఉమామహేశ్వరరావు | 19 |
| అనుగ్రహం | శ్రీమతి కొల్లి విజయలక్ష్మి | 21 |
| అతిథిదేవోభవ | డా॥ మైలవరపు లలితకుమారి | 22 |
| భద్రం | శ్రీ కె.వీరాస్వామి | 24 |
| 108 దివ్యదేశాలు-తిరుచ్చెంపొన్‌శెయ్ కోయిల్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 28 |
| రథయాత్ర | డా॥యస్.పద్మావతి | 31 |
| యామునాచార్యులు | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 34 |
| సాధన | శ్రీ జె. నరసింహారావు | 37 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 38 |
| సిద్ధేంద్రయోగి | శ్రీ యస్. తులసీరామ్ | 40 |
| బంగారుస్వామి | శ్రీమతి పి.పద్మజా రామకృష్ణ | 42 |
| బుద్ధి వచ్చింది | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 43 |
| నిదానమే ప్రధానం (భాస్కరశతకం) | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| మల్లిసిరి | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన - కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 47 |
| దైవదూషణ మహాపాపం (చిత్రకథ) | కథ : శ్రీమతి వావిలాల నాగవల్లి<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| నీతిగా బతకాలి (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| శ్రీకృష్ణామృతం | 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : తిరుమల శ్రీవారి ఆణివరఆస్థాన మహోత్సవం
వెనుకచిత్రం : శ్రీ వేదవ్యాసమహర్షి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# ఆదర్శగురువు

**'గిరయో గురవస్తేభ్యోఽ ప్యుర్వీ గుర్వీ తతోఽపి జగదండమ్।**
**తస్మాదప్యతి గురవః ప్రలయేఽ ప్యచలా మహాత్మానః॥**

పర్వతాలు బరువైనవి. వాటికంటే భూమి బరువైనది. దానికంటె బ్రహ్మాండము బరువైనది. ఇవన్నీ ప్రళయకాలంలో నశిస్తాయి. ప్రళయంలోకూడా చలించని గురుత్వము కలవారే మహాత్ములు.

గురుకృప లేకుంటే విద్యార్థి ముందుకు సాగలేడు. విద్యాభ్యాసం పూర్తవ్వాలంటే గురువుయొక్క ఉపదేశం ముఖ్యం. విద్యార్థియొక్క జ్ఞానదాహం తీరాలంటే గురువువల్లమాత్రమే సాధ్యం. అటువంటి గురువును వెతుక్కుంటూ వెళ్ళడమే విద్యార్థియొక్క ప్రథమకర్తవ్యం. గురువుకూడా తనవద్దకు వచ్చిన విద్యార్థికి జ్ఞానభాండారాన్ని ధారపోయాలి. ఈ దానం సత్పాత్రులకు మాత్రమే లభ్యం. అన్ని దానాల కన్నా విద్యాదానం అమూల్యమైనది.

గురువు అన్న వెంటనే మనందరి మనస్సులలో ఒకవిధమైన ఉదాత్తభావన కలుగుతుంది. ఎందుకంటే పెద్దలు చెప్పినట్లు గురువు మన తల్లిదండ్రులవలె పరమపూజ్యులు. గురువుయొక్క స్థానం అత్యంత ఉన్నతమైనది. విద్యార్థి జ్ఞానార్జన చేయాలంటే గురువు చాలా అవసరం.

గురువు లేకుంటే విద్యార్థి గుడ్డివాడవుతాడు. ఎలాగైతే గుడ్డివాడు ముందుకు సాగాలంటే ఒక ఆసరా ముఖ్యమో, అలాగే విద్యార్థికి గురువుయొక్క మార్గదర్శనం ముఖ్యం. గురువు "తమసోమా జ్యోతిర్గమయ". గురువు విద్యార్థికి తండ్రివంటివాడు. ఈ ప్రపంచంలో జన్మించడానికి విద్యార్థికి తండ్రి కారణమైతే, గురువు విద్యార్థికి జ్ఞానాన్నిచ్చి అతడి రాబోయే జీవితానికి మార్గదర్శనం చేస్తాడు. జ్ఞానమంటే ఉత్తపుస్తకజ్ఞానం కాదు. అది సంపూర్ణజ్ఞానం. మానవుడు మానవత్వంనుండి దైవత్వానికి ఎదగడానికి ఇదే ముఖ్యమైన సాధనం.

మానవుడు కొన్ని పరిస్థితుల్లో తన నీచకృత్యాలతో రాక్షసగుణం కలిగినవ్యక్తిలాగా మారిపోతున్నాడు. 'మొక్కైవంగనిది మానై వంగదు' అన్నట్లుగా పుట్టినప్పటినుండే మనలో సద్భావనలు అంకురించాలి. అవి పదేపదే మనలో మారుమ్రోగుతూ ఉండాలి. ఈనాటి బాలలే రేపటిపౌరులు; కనుక పిల్లలకు చిన్నవయస్సునుండే మంచి విద్యాభ్యాసం దొరకాలంటే సుశిక్షితుడైన గురువు కావాలి. సుశిక్షితగురువులే దేశపు ఆస్తి. ఇటువంటి అమూల్యమైన ఆస్తిని పోషించడం దేశంలోని ప్రతిఒక్క వ్యక్తి కర్తవ్యం.

ప్రతి గురువుకూడా తన కర్తవ్యాన్ని అత్యంతనిష్ఠతో పాటించాలి. ఎందుకంటే ఒక గురువుయొక్క నడతయే అతడిని అనుసరించే విద్యార్థులయొక్క నడత అవుతుంది. అంతేకాక అతడిమాటలే అందరి మాటలవుతాయి. అతడి నడవడిక, మాటలు కాస్త తారుమారైనాకూడా దానివల్ల అపారమైన నష్టం జరుగుతుంది. గురువు ఒక కదిలే గ్రంథాలయంవంటివాడు. తన నడవడిక, జ్ఞానములతో ఒక అయస్కాంతంలా విద్యార్థిని తనవైపుకు తిప్పుకోవాలి. విద్యాలయమే దేవాలయం. విద్యాలయంలో నిత్యం జరిగే కార్యకలాపాలే పూజలు. పూజే సరిగ్గా జరగాలి. ఇందుకు అందరి సహకారం కావాలి. సహకారం ఉంటే సాధ్యం కానిది ఏమున్నది? సహకారంలో మూడు విధాలు ఉన్నాయి. అవి మనసా వాచా మరియు కర్మణా చేసే సహకారములు. ప్రతిఒక్క విధము తనదైనఫలితాన్ని ఇస్తుంది. పై తెల్పినట్లు అందరూ గురువుల బాటలో పయనించి ఆదర్శప్రాయులౌతారని ఆశిద్దాం.

**జూలై 16, 2024న శ్రీవారి ఆణివరఆస్థానం & శ్రీవారి పుష్పపల్లకిసేవ సందర్భంగా...**

# నిత్యైశ్వర్యో భవ

**- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు**

సాధారణంగా ప్రతిసంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయనపుణ్యకాలంలో కర్కాటకసంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరిరోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివరఆస్థానం అనిపేరు.

పూర్వం మహంతులు దేవస్థానపరిపాలనను స్వీక రించిన రోజు అయిన ఈ ఆణివరఆస్థానం పర్వదినంనాటి నుండి తి.తి.దే.వారి ఆదాయవ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. తి.తి.దే. ధర్మకర్తలమండలి ఏర్పడిన తరువాత వార్షిక ఆదాయలెక్కలను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చారు.

ఈ ఉత్సవంరోజున ఉదయం బంగారువాకిలి ముందు గల ఘంటామండపంలో సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరు లతో కూడిన శ్రీమలయప్పస్వామివారు గరుత్మంతునికి అభి ముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరోపీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతోపాటు ఆనందనిలయం లోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో "పరివట్టం"(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి **'నిత్యైశ్వర్యో భవ'** అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్దజీయ్యర్‌స్వామివారికి, చిన్నజీయ్యర్‌స్వామివారికి, తి.తి.దే. తరఫున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపుచెవి గుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపుచెవిగుత్తిని శ్రీవారి పాదాలచెంత ఉంచుతారు.

ఈ విధంగా సాలకట్ల ఆణివరఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి తిరుమలలో ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

సాయంత్రం శ్రీదేవి, భూదేవిసమేత శ్రీమలయప్ప స్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్ప పల్లకీపై తిరుమల పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.







పల్లకి అనగా పురాతనకాలంలో మనుషుల ప్రయాణానికి వాడే సాధనం. దీనికి చక్రాలుండవు. ఇద్దరు లేదా నలుగురు మనుషులు మోస్తారు. డోలిక, తిరుచ, దోల, పల్యంకము, పల్యంకిక, పల్లకి, మేనా అనే ఇతర పేర్లున్నాయి.

వీటికి ఇంధనం అవసరం లేదు. మంచిరోడ్లు అవసరం లేదు. కలుషితవాతావరణం ఉండదు. ప్రమాదాలుకూడా చాలా తక్కువ. భారతదేశంలోని పల్లకీలు ఎంతోమంది విదేశీ యాత్రికులను ఆకర్షించాయి. ఎటువంటి వాతావరణంలోనైనా, ఎగుడు దిగుడునేలమీదకూడా వీరు సాఫీగా సాగిపోతారు. ఇవి మోసేటప్పుడు వీరికి శ్రమ తెలియకుండా ఉండటానికి బృందగానంకూడా చేసేవారు. విజయ నగరసామ్రాజ్యకాలంలో ఆడవాళ్ళుకూడా అంతఃపురం లోపల బోయీలుగా పనిచేసేవారు.

ఇప్పటికీ పురావస్తుప్రదర్శనశాలల్లో రంగు రంగుల పల్లకీలను సందర్శించవచ్చు. కొన్ని దేవా లయాలు, మఠాల్లో వారి పీఠాధిపతులు, మఠాధి పతులు వాడిన పల్లకీలను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఇంతటి ప్రాచీనచరిత్రగల పల్లకి నేడు కలియుగదైవమైన తిరుమల వేంకటేశునికి ఏడాదిలో ఒకమారు వాహనమై పుష్పపల్లకిరూపంలో భక్తుల హృదయమందిరాలలో కొలువవుతుంది. అటువంటి పుష్పపల్లకి వివరాల లోకి వెళితే...

వెంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం ఈ విశ్వంలోనే లేదు. శ్రీవేంకటేశ్వరుని మించిన దైవమూ లేదు. శ్రీయామునాచార్య సూచనప్రకారం, శ్రీతిరుమలనంబి తిరుమలలోనే కొంతకాలం పుష్పార్చన చేశారు. తర్వాత శ్రీ రామానుజాచార్య ఆదేశాన్ని అనుసరించి అనంతా ళ్వారుగా సుప్రసిద్ధులైన శ్రీఅనంతసూరి తిరుమలలో పుష్పవనాన్ని ఏర్పాటుచేశారు. తులసీవనంతోపాటు సుగంధపరిమళపుష్పాలను ఇచ్చే మొక్కలతో అలరారే వనాన్ని వృద్ధిచేసి స్వామివారికి పుష్పసేవ చేశా రాయన. తరిగొండ వెంగమాంబ, ఎందరో రాజులు, రాణులు ఆ తర్వాత తిరుమలలో శాశ్వతవనం ఏర్పరచి ఆ వనంలో విరిసిన పూలతో స్వామి వారిని అర్చించారు. చారిత్రకాధారాలను పరిశీలిస్తే తిరుమలలో ఎన్నో పుష్పవనాలు ఉన్నాయని తెలుస్తోంది.

స్వామివారిని భక్తులు పుష్పాలతో ఆరాధించేందుకు వీలు కల్పించే పథకాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవేశపెట్టింది. నిత్యపుష్పకైంకర్యానికి ఈ పుష్పాలు వినియోగిస్తారు. వీటిలో గులాబీ, గన్నేరు, మొగలి, మరువం, కురివేరు, వట్టివేరు, దవనం, జాజి, మల్లి, కనకాంబరం, తులసితోబాటు సుగంధపుష్పాలను ఇచ్చే మొక్కలు, స్వామివారికి ప్రీతికరమైన పుష్పాల మొక్కలతో వనాన్ని ఏర్పాటుచేశారు. ఈ వనాలలోని పుష్పాలు వైకుంఠఏకాదశి, ఉగాది, పుష్పపల్లకి, బ్రహ్మో త్సవాలు, పుష్పయాగం తదితర ప్రత్యేకసందర్భాల్లో వాడతారు.

అలా స్వామివారి ఆణివరఆస్థానం రోజున పుష్పపల్లకిని వివిధ రకాలైన అరుదైనపుష్పాలతో అలంకరిస్తారు. బెంగళూరు, చెన్నై, మైసూరు వంటి తదితర ప్రాంతాలనుంచి వచ్చిన నిపుణులు పుష్పపల్లకిని అద్భుతంగా తయారుచేస్తారు. అటువంటి శోభాయమానమైన పుష్ప పల్లకిలో స్వామిని కనులారా తిలకించి, సేవించి తరిద్దాం.. వేంకటేశుని వంటి దైవము లేరని కొనియాడుదాం..



**10-07-2024 నుండి 12-07-2024 వరకు**
**శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి**
**సాక్షాత్కారవైభవోత్సవాల సందర్భంగా...**

# సాక్షాత్కారం

- శ్రీ యం.వి.యస్.రామశేషు

భక్తులు భగవంతుని సగుణ, నిర్గుణరూపాల్లో రెండు విధాలుగా ఉపాసిస్తారు. నిర్గుణోపాసన మహాతపస్సంపన్నులైన మహాయోగులకు మాత్రమే సాధ్యం. వ్యాసవాల్మీకాదులు, ప్రహ్లాదనారదులు, హనుమంత సుగ్రీవులు, అక్రూర కుచేలాదులు భగవానుని సగుణంగానే ఉపాసించారు. నవవిధభక్తిరీతులలో సగుణంగా ఆరాధించడం సగుణోపాసనక్రిందికే వస్తుంది.

## దైవసాక్షాత్కారం

"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః।
జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీం గనా॥"

జ్ఞాన, బల, కీర్తి, ఐశ్వర్య, సౌందర్య, వైరాగ్యముల నిధానమే భగవంతుడని విష్ణుపురాణంలో చెప్పబడింది. ఇన్ని విభూతులు గల భగవంతుని దర్శించాలంటే గురువు కావాలి.

"గుకారో అంధకారస్య రుకారోస్తన్నిరోధకస్య।
అంధకారస్య వినాశిత్వా గురురిత్యభిధీయతే॥"

భగవంతుని చూపగలిగేవాడే గురువు. గురుశుశ్రూషతో పరమాత్మ సాక్షాత్కారమును స్వయంగా అనుభవించగలిగినవాడే ఉత్తముడు. మాంసనేత్రములకు కనపడని రూపమే భగవంతుడు. మనసు ఎప్పుడు తాదాత్మ్యతను చెందుతుందో, అందువలన కలిగే అనిర్వచనీయమైన అనుభూతియే దైవసాక్షాత్కారం.

పంచమవేదమైన మహాభారతమును, అష్టాదశ పురాణములను, ఉపపురాణములను జాతికందించిన గురువు వ్యాసభగవానుడు. రచనానంతరం సరస్వతీనదీతీరమున వ్యాకులమనస్కుడై కూర్చున్నాడు. ఆ పరమయోగికికూడా మనోవ్యాకులత కలిగిందట.. తన మనోవేదనకు కారణమేమిటో ఆయనకు అవగతం కాలేదు. ఆ సమయంలో నారదమహర్షి ఆయనదగ్గరకు వచ్చాడు. అప్పుడు వ్యాసమహర్షి తన మానసిక వ్యాకులతకు కారణమేమిటని నారదుని ప్రశ్నించాడు. వేదోద్ధరణము గావించావు, అష్టాదశపురాణాలను, ఉపపురాణాలను, పంచమవేదమైన మహాభారతమును జాతికి అందించిన ఘనుడవు. కానీ ఈ కావ్యములలో ఎక్కడా భగవానుని గుణలీలగానం చేయలేదు. అందుకే నీకు దైవానుగ్రహం కలుగలేదు. భగవానుని లీలను గురించి చెప్పే శ్రీమద్భాగవతమును వెలయించి నీ మనోవ్యాకులతను తీర్చుకోమన్న నారదమహర్షిమాటలను శిరసావహించి, భాగవతులకథలను, భగవంతుని అవతార విశేషములను, శ్రీకృష్ణలీలావిశేషములను రచించిన మహాపురుషుడు. మహాభారతమున శ్రీకృష్ణుడు అర్జుననకుపదేశించిన భగవద్గీత గొప్ప ఉపాసన, పారాయణ గ్రంథం. భగవద్గీత చదివితే మానవుడు మనశ్శాంతిని పొందుతాడు. అది పరమాత్మ జీవులకు అందించిన అమృతభాండాగారం కదా! అందువల్ల భాగవతమహామృతపానంవలనగాని దైవసాక్షాత్కారం కలగదని గురువుగా నారదుడు వ్యాసునికి ఉపదేశించాడు. అది గురువాక్కు గొప్ప మాహాత్మ్యం. ఏ యుగములోనైనా భగవంతుని దర్శింపచేయగలిగినవాడు గురువే కదా! గురువును ఆశ్రయించినవాడు దైవసాక్షాత్కారమునకు తగిన అర్హతను పొందుతాడు. మోహాంధతనుండి దూరమై ఐశ్వర్యభోగములను, ఆరు గుణములు కలిగిన వెలుగును దర్శింపగలుగుతాడు. ఆ కాంతియే దైవసాక్షాత్కారం. కలియుగంలో భగవంతుడు ఎక్కడినుంచో రాడు. మానవరూపంలో ఉండి పదుగురికి మంచి చేసి మార్గదర్శనం చేసేవాడే నిజమైన భగవత్స్వరూపుడు. అదే దైవసాక్షాత్కారం.



## ఆత్మసాక్షాత్కారం

వైదికసంప్రదాయం పరమాత్మతోగల అనుబంధాన్ని గుర్తించటమే మానవ జీవితచరితార్థతను తెలియపరుస్తుంది. భగవంతుని త్రికరణశుద్ధిగా సేవించడమే భక్తికి నిదర్శనం. ఆ భక్తిసేవలో నేను నాది అనేది వదులుకోవాలి. నేను భగవంతుని పూజిస్తున్నాను, పువ్వులు సేకరిస్తున్నాను, అన్ని పనులు నేనే చేస్తున్నాను అనే అహంకారం మానవుడికి ఉంది.

"అహం బ్రహ్మాస్మి" నాదేమీ లేదు అంతా భగవంతుడే. సమస్తసృష్టి పరమాత్మే అనే సత్యాన్ని తెలుసుకోవడమే ఆత్మ సాక్షాత్కారం. పరమాత్మలో లయంకావటమే ఆత్మసాక్షాత్కారం. నేను కేవలం నిమిత్తమాత్రుడిని. ఈ శరీరం నాది కాదు. ఈ బుద్ధి నాది కాదు. అంతా భగవానుడి సంకల్పమే. అందుచేతనే నేను ఈ కార్యాలను చేస్తున్నాను అని అనుకోవటమే ఆత్మసాక్షాత్కారం. శరీరం అశాశ్వతమైనది. ఆత్మ ఒక్కటే శాశ్వతమైనది.

నైనం ఛిన్దంతి శస్త్రాణి నైనం దహతి పావకః।
న చైనం క్లేదయ న్త్యాపోన శోషయతి మారుతః॥ (2-23)

ఆత్మను ఆయుధాలు నరకలేవు. అగ్ని కాల్చలేదు. నీరు తడపలేదు. గాలి ఎండపెట్టలేదు. అది నిత్యమైనది. ఖండించ రానిది, తడవనిది, ఎండనిది, సర్వవ్యాప్తం. శాశ్వతం, చలన రహితమైనది. ఆత్మజ్ఞానేంద్రియాలకు గోచరించదు. మనసుకు అందదు. వికారాలకు గురి కాదు. అటువంటి ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవలసిందిగా (అర్జునునిద్వారా) జీవులకు బోధించాడు శ్రీకృష్ణపరమాత్మ.



వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥
(2-22)

మానవుడు చినిగిపోయిన పాతవస్త్రమును విడిచిపెట్టి క్రొత్తవస్త్రములను ధరించినట్లుగా ఆత్మ కృశించి శిథిలమైన దేహమును విడిచిపెట్టి మరొక క్రొత్తశరీరంలోనికి ప్రవేశిస్తుంది. మానవజీవనచక్రం యథాతథంగా తిరుగుతూనే ఉంటుంది. శరీరమునకే కానీ ఆత్మకు నాశనం లేదు. చరాచరసృష్టిలో శాశ్వతంగా ఉన్నది ఆత్మ ఒక్కటే. అదే పరమాత్మ అని తెలుసు కోవటమే ఆత్మసాక్షాత్కారసిద్ధి.

దైవసాక్షాత్కారఆత్మసాక్షాత్కారముల వైవిధ్యమును తెలుసుకున్న మానవుడు సాక్షాత్కరింపచేసుకునేవి తిరుపతి శ్రీనివాసమంగాపురంలో ప్రతిఏటా జరిగే సాక్షాత్కారవైభవోత్స వములు. ఈ సాక్షాత్కారవైభవోత్సవములు శ్రీనివాసమంగా పురంలో కొలువై ఉన్న శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి ఆషాఢ శుద్ధషష్ఠినుండి ప్రారంభమై మూడురోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. శ్రీనివాసుడే స్వయంగా వీటికి ముహూర్తాన్ని నిర్ణయించినట్లు చారిత్రకాధారాలు చెప్తున్నాయి.

స్వామి సాక్షాత్కరించి తానుగా చెప్పిన ఉత్సవాలు కనుక వీటికి "సాక్షాత్కార వైభవోత్సవములు" అను పేరు వచ్చింది. ఇవి మూడురోజులపాటు నిర్వహించబడతాయి. వీటిని స్వామికి జరిగే వార్షికోత్సవబ్రహ్మోత్సవాలతో సమానంగా, వైభవంగా నిర్వహిస్తారు. మొదటిరోజు స్వామికి తిరుమంజనస్నపనసేవ నిర్వహింపబడుతుంది. ఆ తర్వాత అర్చన, ఆరాధన, వాహన సేవలు ఊరేగింపులతో వైభవంగా జరుపబడతాయి. వివాహములు ఆలస్యమైనవారు ఈ శ్రీనివాసమంగాపురంలో గల కల్యాణవేంకటేశ్వరుని దర్శించి సేవించి కల్యాణోత్సవాన్ని జరిపిస్తే వివాహానికిగల ఆటంకాలు, గ్రహబాధలు తొలగిపోయి వివాహం త్వరగా జరుగుతుందని భక్తుల నమ్మకం. కల్యాణమైన తరువాత సాయంత్రంవేళల్లో స్వామిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ స్వామి సాక్షాత్కారవైభవసేవల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని దర్శించి సేవించి తరించి పునీతులవుతారు.



ఎవరినీ ఏడిపించకు. అది నిన్ను వెన్నంటి వేటాడుతుంది

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక విశేషార్థం..**

తృతీయాశ్వాసం ప్రారంభం...

## చక్రరాజ దిగ్విజయం

సూతమహామునీ! మహావిష్ణువు పంచాయుధాలలో ఒకటైన సుదర్శనాయుధం వేంకటాద్రికి అన్నివైపులలో తిష్ఠవేసిన చోరుల్ని సంహరించిందని లోగడ చెప్పారు. ఆ స్వామి వీరోచితవిహారాన్ని వినాలని మా కోరిక. తమరు అనుగ్రహించాలి అన్నారు. అప్పుడు సూతుడు సంతోషంతో–

'మునులార! మహావిష్ణువు పంచాయుధాలలో సుదర్శనాయుధానికి సాటి మరేది లేదు. ఆ సుదర్శనచక్రవిహారాన్ని వర్ణించే శక్తి నాకసలు లేదు. అయినా, మీరడిగారు కనుక నాకు తెలిసినరీతిలో చెబుతాను.'

స్థితికారకుడైన విష్ణువే సామాన్యముని గణాన్ని బాధించే లోకకంటకుల పని పట్టమని సుదర్శనుని ఆదేశించారు. స్వామి ఆనతి శిరసావహించి సుదర్శనుడు రాజవేషంతో కదిలాడు. వేయిభుజాల వాడయ్యాడు. రత్నభూషణాదులు ధరించాడు. ఎర్రటి రంగుల వస్త్రాలను తొడుక్కున్నాడు. ప్రళయవేల వేలాగ్నిలా భయంకరాకారుడయ్యాడు. అతనికి సహాయంగా కుముద, జ్వాలాముఖులు సైన్యంతో సకలాయుధాలతో చతురంగబలాదులతో కదిలారు. సుదర్శనుడు రథమెక్కి శేషాచలం ప్రధానకేంద్రంగా సాధువులను హింసిస్తున్న చోరుల్ని వెదకి వెదకి పట్టుకొని శత్రుశేషం ఏమాత్రం లేకుండా చేశాడు. ఈ ప్రాంతంలో ప్రజలకు చోరబాధలేకుండా చేశాడు. తమ ప్రాంతంలో దొంగల వీరవిహారం అణగడంతో అక్కడి ప్రాంతంవారు సుదర్శనుని సందర్శించారు.

ఓ మహారాజా! ఈ ప్రాంతంలో అడిగే వారు ఎవరూ లేరని చోరులు స్థావరం ఏర్పాటు చేసుకొన్నారు. అమాయకులు అసహాయులైనవారిని సాధువులను వేధించారు. మీ రాకతో మీ రణవ్యూహంతో వారు బెంబేలెత్తిపోయారు. చివరకు మాకు వారి పీడ విరగడయింది.

అయినా మహారాజా! మీరెవరో మాకు తెలియదు. మీ అసలు నివాసమేదో తెలియదు. ఎక్కడనుండో వచ్చి మా బతుకుల్ని కాపాడారు. అడక్కుండానే మా ఆర్తిని తీర్చిన పుణ్యాత్ములు. మీరు ఇక్కడ ఉండండి. ఇదే మా ప్రార్థన అని చేతులు జోడించారు.

సుదర్శనరాజు సామాన్యప్రజల, సాధువుల సంప్రార్థనను శాంతంగా విని–

'నేనిక్కడనే ఉండడం వీలుగాని పని. అయినా ఇక్కడున్నవారిలో ఒకరిని రాజుగా నిర్ణయిస్తాను. ఆ వ్యక్తి మిమ్మల్ని సదా కాపాడతాడు. ఈ ప్రాంతానికి రక్షకుడై ఉంటాడు అని ఆశ్వాసించి అలాగే ఒకరిని అధికారిగా చేసి ఆ అధికారి విధులను స్పష్టం చేసి ముందుకు కదిలాడు.

వివిధప్రాంతాలనుండి తిరుమల వేంకటాద్రి చేరుకొనేమార్గాలలో ప్రజారక్షణార్థం తగినవారికి ఆధిపత్యం ఇచ్చి విధులను కేటాయించాడు. జయభేరి మోగించి అక్కడి చోరులను గడగడలాడించాడు. తదనంతరం ఆగ్నేయంవైపు కదిలాడు. అక్కడకూడా దుష్టులైన చోరుల్ని, దుండగుల్ని, విప్రులను బాధించే మూర్ఖుల్ని, పాపాత్ముల్ని గుర్తించి వారిని కకావికలు చేశాడు. సైన్యబలంతో వారిని శవాలుగా చేసి ఆ శవాలపై పయనం సాగిస్తూ తనకు సాయంగా వచ్చిన విద్యాధరగణంతో సమరం కొనసాగించాడు. అయినా సమరం ఆగలేదు. చివరకు సుదర్శనమహారాజుధాటికి ఎదురునిలువలేని వీరులు అశక్తులై తమ దొరలదగ్గరికి వెళ్లి సర్వమూ విశదం చేశారు. వారి ఆవేదనను, ఆక్రోశాన్ని గుర్తించిన దొరలు తామే రణానికి కదలిన గంధర్వగణంవారిని ఓడించింది.

*(ఇంకా ఉంది)*

జూలై 17, 2024న చాతుర్మాస్యవ్రతారంభం సందర్భంగా...

గృహలక్ష్మి

# చాతుర్మాస్యం

- శ్రీ సంపత్ బాలాజి

చాతుర్మాస్యం భక్తులకు అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో వచ్చే ఆషాఢ శుద్ధఏకాదశిని శయనైకాదశి అంటారు. ఆ రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తికశుద్ధఏకాదశి (ఉత్థానఏకాదశి) రోజున మేల్కొంటాడు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. ఈ



కాలంలో యతులు ఎటువంటి ప్రయాణాలు తలపెట్టక ఒకేచోట ఉండి అనుష్ఠానం చేస్తారు. చాతుర్మాస్యవ్రతం ప్రాచీనకాలంనుండి హిందూదేశంలో మునీశ్వరులు పాటిస్తూ వస్తున్న వ్రతం. చాతుర్మాస్యవ్రతం అంటే నాలుగు నెలలకాలం అనుష్ఠించవలసిన వ్రతమని అర్థం. కొందరు రెండు నెలలకాలమే ఈ వ్రతాన్ని పాటించి అర్ధచాతుర్మాస్యం అనేపేరుతో చేస్తారు. ఈ వ్రతాచరణకు స్త్రీ, పురుషభేదంకానీ, జాతిభేదంకానీ లేదు. వితంతువులు, యోగినులు మొదలైన వారెవరైనా చేయవచ్చు. ఈ వ్రతాన్ని ఆషాఢశుద్ధఏకాదశినాడుగానీ, కాకపోతే ఆషాఢ శుద్ధపూర్ణిమనుండి విధిగా ఆచరించాలని చెప్తారు.

ఎంతో పవిత్రత సంతరించుకున్న ఈ చాతుర్మాస్యంలో ప్రధానమైనది ఆషాఢమాసం.

మన తెలుగునెలల్లో ఆషాఢమాసానికి ఓ ప్రాధాన్యత ఉంది. పూర్వాషాఢ నక్షత్రంతో కూడిన పౌర్ణమిఉన్న నెలయే ఆషాఢమాసం. ఇది తెలుగుసంవత్సరంలో నాల్గవ మాసం. దీనిని శూన్యమాసమనికూడా అంటారు. వర్షఋతువుకూడా ఈ మాసంలోనే ప్రారంభమవుతుంది. పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/ పూర్వాషాఢనక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెల.. ఉత్తరాయణపుణ్యకాలం పూర్తై సూర్యుడు మిథునరాశినుంచి కర్కాటకరాశిలోనికి ప్రవేశిస్తాడు. దాంతో దక్షిణాయనం మొదలవుతుంది. ఆషాఢశుద్ధపౌర్ణమిరోజును గురుపౌర్ణమిగా వ్యవహరిస్తారు. ఈ మాసంలో చేసే స్నానం, దానం, జపం, పారాయణలు విశేషఫలితాల్నిస్తాయి. ఆషాఢంలోచేసే సముద్రస్నానాలు ఎంతో ముక్తిదాయకాలు.

ఆషాఢమాసంలో పాదరక్షలు, గొడుగు, ఉప్పు దానం చేయడం శుభకరం. ఆషాఢమాసంలోనే దక్షిణాయనం ప్రారంభమవుతుంది. కర్కాటకంలోనికి సూర్యుడు ప్రవేశించడంతోనే దక్షిణాయనం ఆరంభమవుతుంది. అంటే సూర్యుడు ఈ రాశిలో ప్రవేశించినప్పటినుండి తిరిగి మకరరాశిలో ప్రవేశించేవరకు దక్షిణాయనం అంటారు. ఈ అయనంలో సూర్యుడు భూమధ్యరేఖకు దక్షిణంగా సంచరిస్తాడు. దక్షిణాయనం పితృదేవతలకు ప్రీతికరమనికూడా చెప్పబడింది. వేదంప్రకారం చూసినా 'అన్నం బహుకుర్వీత' అంటోంది.. వ్యవసాయదారుని కృషికి అండగా భగవంతుని అనుగ్రహం తోడై వర్షరూపంగా ఎక్కువ పరిమాణంలో ధాన్యం పండి జనులకు ఆకలిబాధ లేకుండా ఉండాలని పరమార్థం.

హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే వ్రతం చాతుర్మాస్యవ్రతం. చాతుర్మాస్యం నాలుగు నెలలు సనాతనధర్మానికి సంబంధించిన పనులు చేయమన్నారు పెద్దలు. భగవంతుని పూజించడం, ధ్యానించడం సర్వశుభప్రదమని భావిస్తారు. ఈ కాలంలో ఏ పని ప్రారంభించినా మంచిఫలితం పొందవచ్చునని శాస్త్రవచనం. దీనిని నాలుగు నెలలపాటు ఆచరిస్తారు.



ఒంటరితనం నీకు జీవితమంటే ఏంటో నేర్పిస్తుంది

అనాదిగా మునులు, ఋషులు ఈ వ్రతాన్ని ఆచరిస్తున్నట్టు చారిత్రకాధారాలు చెబుతున్నాయి. యుగయుగాలుగా చాతుర్మాస్యాన్ని ఆచరిస్తున్నట్టు భవిష్య, స్కాందపురాణాలలోని కథనాలవల్ల అవగతమవుతుంది. పూర్వకాలంలో మనకు వర్ష, హేమంత, వసంత అనే మూడు ఋతువులు మాత్రమే ఉండేవి. ఈ ఋతువులలో వర్షఋతువుతోనే సంవత్సరం ప్రారంభమయ్యేది. ఆ కారణంగా సంవత్సరానికి "వర్షం" అనేపేరు వచ్చింది. సంవత్సరానికి మూడు ఋతువులున్న ఆ కాలంలో ఒక్కోఋతువు ప్రారంభంలో ఒక్కోయజ్ఞం చేస్తుండేవారు. ఆషాఢ పూర్ణిమనుండి వరుణప్రఘాసయజ్ఞం, కార్తికపూర్ణిమనుండి సాకమేధయజ్ఞం, ఫాల్గుణపూర్ణిమనుండి వైశ్వదేవయజ్ఞం చేసేవారు. ఈ క్రమంలో ఆనాటి ఆషాఢంలో చేసే యజ్ఞమే అనంతర కాలంలో చాతుర్మాస్యవ్రతంగా మారి ఆచరణలోకి వచ్చింది.

చాతుర్మాస్యవ్రతం పాటించేవారు ఆహారనియమాలలో భాగంగా శ్రావణమాసంలో ఆకుకూరలు, వంకాయలు; భాద్రపదమాసంలో పెరుగు, పులిసిన ఆహారపదార్థాలు; ఆశ్వీయుజ మాసంలో పాలు, పాలఉత్పత్తులు; కార్తికమాసంలో పప్పు పదార్థాలను విధిగా విసర్జించాలి. వాటిని ఆహారంగా స్వీకరించకూడదు.

ఈ ఆహారనియమాలన్నీ వాత, పిత్త, శ్లేష్మసంబంధ రోగాలనుంచి కాపాడుకోవటానికి బాగా ఉపకరిస్తాయి. ఇలా ఏవిధంగా చూసినా చాతుర్మాస్యవ్రతదీక్ష అనేది మానవాళి ఆరోగ్యపరిరక్షణకు ఉపకరించే ఉత్తమవ్రతదీక్ష అని పురాణ వాఙ్మయం వివరిస్తోంది. చాతుర్మాస్యాన్ని అన్ని ఆశ్రమాల (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస) వారు పాటించవచ్చు. కుల, వర్ణనియమాలుకానీ, లింగవివక్షకానీ లేదు. చాతుర్మాస్య వ్రతం ఆచరిస్తున్నవారు ఆహారనియమాలు పాటిస్తూ, ఆధ్యాత్మిక చింతనతో ఈ నాలుగు నెలలూ గడపాలి. వైరాగ్యాన్ని అలవరచుకునేందుకు ఎక్కువగా సన్యాసులు, వృద్ధులు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతం ఆచరించేవారు ఈ నాలుగు నెలలు తాను నివసించే గ్రామం ఎల్లలు దాటరాదు.

వ్రతం ఆచరించేకాలంలో వేకువజామునే స్నానం చేయాలి. బ్రహ్మచర్యం, ఒంటిపూటభోజనం, మంచంపై కాకుండా నేలపై నిద్రించడం, అహింస పాటించడంవంటివి చెయ్యాలి. ఇష్టదేవతలకు చెందిన దివ్యమంత్రాన్ని అనంతంగా జపించాలి.

యోగసాధన చేయడం శ్రేయస్కరం. దానధర్మాది క్రతువులను ఆచరించాలి. ఈ వ్రతవైశిష్ట్యాన్ని గురించి సాక్షాత్తు పరమశివుడు, పార్వతీమాతకు వివరించగా, పార్వతీమాత వ్రతాన్ని ఆచరించి ఈశ్వరానుగ్రహం పొందిందని పురాణాలు చెబుతున్నాయి.

అలాగే శయనఏకాదశిరోజునుంచే ముత్తయిదువులు చాతుర్మాస్య గోపద్మవ్రతంకూడా ఆచరిస్తారు. చాతుర్మాస్యంలో శుభకార్యాలు చేయడం చాలా అశుభం. నూతనపనుల ప్రారంభోత్సవాలు, వివాహవేడుకలు, నిశ్చితార్థం, పిల్లలకు నామకరణంవంటివి చేయకూడదు.



తులసిచెట్టుకు క్రమం తప్పకుండా నీరుపోయాలి. చాతుర్మాస్యదీక్షలో ఈ నియమాలను పాటిస్తే పేదరికంనుంచి బయటపడతారు. సుఖశాంతులు కలుగుతాయి. ఇదే చాతుర్మాస్య వ్రతపరమార్థం.

# సందేహాలు సమాధానాలు



- శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర)గరుత్మంతుని గరుడాళ్వార్ అంటారు కానీ ఆంజనేయుని ఆళ్వార్ అని ఎందుకు పిలవరు?**

**జ)** వైష్ణవమున విష్ణుభక్తులని, వైష్ణవమత ప్రచారకులని, ఆళ్వార్లని పిలుస్తారు. వైష్ణవమతమున పన్నిద్దరాళ్వారులున్నారు. వారిలో గరుత్మంతుడు లేడు. కానీ వారు గరుడుణ్ణికూడా గరుడాళ్వారని సంబోధిస్తారు. గరుత్మంతుడు విష్ణుభక్తుడు అయినప్పటికీ మహావిష్ణువు సేవకుడు మాత్రమే. ఐతే విష్ణువు వాహనం గరుత్మంతుడు. అందువల్ల గౌరవవాచకంతో గరుత్మంతుని ఆళ్వార్ అని పిలుస్తారు. కానీ, ఆంజనేయ స్వామి అలా కాదు. ఆయనను స్వామి అని భగవంతుడితో సమానంగా సంబోధిస్తారు. ఆంజనేయుడు రుద్రాంశసంభూతుడు. గరుత్మంతుడు అలా కాదు. అందువలన ఆంజనేయుని స్వామిగానే సంబోధిస్తారు. శ్రీరామచంద్రుని దాస్యభక్తితో సేవించిన హనుమంతునికి ఆలయాలున్నాయి. ఆంజనేయస్వామిని స్వామి అని భక్తితో భగవంతునితో సమానంగా సేవిస్తారు. అయితే బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే హనుమంతవాహనంగా స్వామిని హనుమంతునిపై ఊరేగించడం ఒక ఆనవాయితి. అయినా ఆయన భగవంతునిగా పూజలందుకుంటున్నాడు. దానికి కారణం శ్రీరామచంద్రుడు హనుమంతుని సేవించి, ఆరాధించిపూజిస్తే తనను సేవించినట్లేనని పలికాడు. అందువలన ఆంజనేయుడు భగవంతునిగా, స్వామిగా పూజలు అందుకుంటున్నాడు.

**ప్ర)నాగులపుట్టకు చుట్టూ దారం ఎందుకు చుడతారు?**

**జ)** నాగులపుట్టచుట్టూ దారాన్ని చుట్టే ఆచారం ఉత్తరహిందుస్థానంలోని పల్లెల్లో కనిపిస్తుంది. ఈ ప్రాంతంలోని శ్రామికులు, రైతుకూలీలు మొదలైనవారు సంతానం కోసం, వారి ఆరోగ్యంకోసం నాగేంద్రుని పూజించి పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూతా వారు పోస్తారు. (వారు అంటే బిందెతో నీరుపోయటం). ఆ తర్వాత తెలుపు, పసుపు, ఎరుపు లేదా మూడు రంగులతో కలసినదారాన్ని మూడు, ఐదు, తొమ్మిది, పదకొండువరుసలుగ చుడతారు. ఆ తర్వాత మిగిలిన దారాన్ని వదిలి వేస్తారు. అరటిపండు, చలిమిడి, చిమ్మిలి వంటి వాటిని నాగేంద్రుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇది సంతానం కలగటం ఆలస్యం అయినవారు సంతానం కోసం, వారిక్షేమంకోసం ఈ విధంగా నాగేంద్రుని పుట్టకు పూజలు చేస్తారు. ఈ సంప్రదాయం నేటికి మనకు ఉత్తరప్రాంతంలోని కొన్నిప్రదేశాల్లో కనిపిస్తుంది. సంతానం కోసం నాగేంద్రుని పూజించే ఆచారం అన్నిప్రాంతాల్లో ఉంది. కానీ ప్రాంతాలను బట్టి కొంత భేదం కనిపిస్తున్నది.

**ప్ర) అపాత్రదానం అని దేనిని అంటారు?**

**జ)** ఎవరికైనా దానం చేసేటప్పుడు ఆ వ్యక్తి తానిచ్చేదానాన్ని స్వీకరించడానికి తగినవాడా? కాదా? అని ఆలోచించి దానం చేయాలి. అది తెలుసుకోకుండా దానంచేస్తే తీసుకున్నవ్యక్తి తగినవాడు కాకపోతే అది అపాత్ర ప్రదానమవుతుంది.

**ప్ర) రావిచెట్టుకు, వేపచెట్టుకు కలిపి ఎందుకు పూజచేస్తారు? పెళ్ళిచేస్తారు?**

**జ)** రావిచెట్టును అశ్వత్థవృక్షమని, బోధి వృక్షమని అంటారు. దేవాలయాల్లో ఈ రెండుచెట్లు మనకు దర్శనమిస్తాయి. రావిచెట్టును నారాయణస్వరూపమని, వేపచెట్టును లక్ష్మీస్వరూపంగా భావించి పూజలు చేస్తారు. దాదాపుగా ఈ రెండు చెట్లు కలిసే ఉంటాయి. వీటిని లక్ష్మీనారాయణులుగా భావించి పెళ్లిళ్లుకూడా చేస్తారు. ఈ జంటవృక్షాలకు వివాహం చేస్తే వివాహం కానివారికి త్వరగా వివాహం జరుగుతుందని ఒక నమ్మకం. వివాహమైనవారు దీనికి ప్రదక్షిణచేసి పూజచేస్తే ఆ దంపతులు అన్యోన్యంగా ఉంటారని, త్వరగా సంతానం కలుగుతుందన్ననమ్మకంతో ఈ విధంగా చేస్తారు.

**ప్ర) సప్త వ్యసనాలు అంటే ఏమిటి?**

**జ)** సప్త వ్యసనాలు అంటే ఏడు చెడ్డ అలవాట్లని అర్థం. ఈ వ్యసనాలబారిన పడిన మనిషి పతనమవుతాడని శాస్త్రం చెబుతోంది. అవి- పరస్త్రీవ్యామోహం, జూదం, వేట, మద్యపానం, కఠినంగా మాట్లాడటం, పరులను శిక్షించటం, వృథాగా ధనాన్ని వ్యయపరచటం అనే ఈ ఏడునూ సప్త వ్యసనాలు అని శాస్త్రవాక్కు.

**ప్ర)గురువు అంటే ఎవరు?**

**జ)** గురు శబ్దభవమే గురువు. జ్ఞానాన్ని ప్రసాదించేవాడు. "గు" కారం అంటే చీకటికి ప్రతీక. "రు" కారం అంటే వెలుగుకు చిహ్నం. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగులను ప్రసాదించేవారు గురువులు. అంతటి మహనీయులైన గురువులకు నమస్కారం.



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

తిరుమంగైఆళ్వారులు భగవంతునిచే అనుగ్రహింప బడుదురు గాక!

సత్త్వోత్తరే చరమపర్వణి సక్తచిత్తే
శాంతే సదా మధురపూర్వకవాఙ్మునీంద్రే,
నాథ ప్రసన్న హృదయాంబుజ నందసూనో
గోవిందరాజ విజయీ భవ! కుందదంత.

(సత్త్వభూయిష్ఠమగు చరమపర్వమున అనగా, ఆచార్య నిష్ఠయందు ఆసక్తమానసుడును పరమశాంతస్వభావుడును అగు మధురకవియాళ్వారుల విషయమున ప్రసన్నమగు హృదయాబ్జము గలవాడా! అస్మనాథా! నందకుమారా! కుంద సుందరదంతా! ఓ గోవిందరాజా! జయశీలుడవు కమ్ము.)

శ్రీమధురకవియాళ్వారులు భగవంతునిచే అనుగ్రహింపబడుదురు గాక!

భక్తప్రపన్నకులనాయక భాష్యకార
సంకల్పకల్పతరు దివ్యఫలామలాత్మన్,
శ్రీశేషశైల కటకాశ్రిత శేషశాయిన్
శ్రీగోవిందరాజ విజయీ భవ విశ్వమూర్తే!

(భక్తప్రపన్నకులనాయకుడగు శ్రీభాష్యకారులయొక్క సంకల్పమనెడి కల్పవృక్షమునకు దివ్యఫలరూపమగు అమలాత్మా! శేషాద్రి కటకము నాశ్రయించినవాడా! శేషశాయీ! విశ్వమూర్తీ! గోవిందరాజా! జయశీలుడవగుదువు గాక!)

దేవ ప్రసీద కరుణాకర భక్తవర్గే
సేనాపతి ప్రణిహితాఖిలలోకభార,
శ్రీవాసదివ్యనగరాధిప రాజరాజ
గోవిందరాజ విజయీ భవ వేదవేద్య.

(దయాసాగరా! భక్తవర్గమునందలి 'సేనాపతి'యందు ఉంచిన సకలలోక రక్షణభారము గలవాడా! ప్రసన్నుడవగుము. శ్రీపదపురీదివ్యనగరాధిపా! రాజరాజా! నిఖిలనిగమవేద్యా! గోవిందరాజా! దేవా! జయశీలుడవగుదువు గాక!)

శ్రీసేనాపతి ఆళ్వారులు భగవంతునిచే అనుగ్రహింప బడుదురు గాక!

శ్రీమచ్ఛఠారి కరుణాశ్రితదేవగాన
పారజ్ఞ నాథమునిసన్నుత పుణ్యకీర్తే,
గోబ్రాహ్మణప్రియగురో శ్రితపారిజాత
గోవిందరాజ జగతాం కురు మంగళాని.

(శ్రీనమ్మాళ్వారుల అనుగ్రహమునకు పాత్రుడై, దేవగానపారంగతుడైన శ్రీమన్నాథమునుల చేత స్తుతింపబడిన పవిత్రకీర్తి గలవాడా! గోవులకు, బ్రాహ్మణులకును ప్రియము చేకూర్చువాడా! లోకగురూ! ఆశ్రితమందారా! గోవిందరాజా! జగములకు శుభము నొడగూర్చుము.)

శ్రీమన్నాథమునులు భగవంతునిచే అనుగ్రహింపబడు దురు గాక!

ప్రబంధగాయకులకును ఈ శ్లోకమే.

*(ఇంకా ఉంది)*

జూలై 30, 2024న ఆడికృత్తిక సందర్భంగా...

# స్వామిమలై

– లావణ్య శ్రీవరం

స్వామిమలై సుబ్రహ్మణ్యస్వామి వెలసిఉన్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం. ఇది తమిళనాడులో ఉన్న తంజావూరుజిల్లాలో కుంభ కోణం సమీపంలో ఎనిమిది కి.మీ.ల దూరంలో ఉంది. ఇక్కడ సుబ్రహ్మణ్యస్వామి కొలువై ఉన్నాడు. శ్రీసుబ్రహ్మణ్యస్వామివారి ఆరు ప్రసిద్ధక్షేత్రాలలో ఇది ఐదవది. ఇక్కడ సుబ్రహ్మణ్యస్వామి శివుడికి ప్రణవమంత్రం అర్థాన్ని తెలియజేశాడు. ఇక్కడ సుబ్రహ్మణ్య స్వామిని 'స్వామినాథస్వామి' పేరుతో కొలుస్తారు. స్వామినాథ అంటే గురుస్వరూపం.

ఈ క్షేత్రం అరవై మెట్లు ఉన్న ఒక కొండమీద ఉంది. ఈ అరవై మెట్లు మన అరవైసంవత్సరాల వయసుకు సంకేతం. కొండపైన సుబ్రహ్మణ్యుని ఆలయం వెలుపల విఘ్నేశ్వరస్వామి వారి మందిరం ఉంది. ఎవరైనా సుబ్రహ్మణ్యస్వామివారియొక్క ఆర్జితసేవలు చేసుకోవాలంటే విఘ్నేశ్వరుని ముందు సంకల్పం చెప్పుకొని లోపలికి వెళతారు. కొండక్రింద మీనాక్షి, సుందరేశ్వరుల మందిరాలున్నాయి.

## స్థలపురాణం

పూర్వం ఒకనాడు బ్రహ్మదేవుడు కైలాసంవైపు వెళుతూ ఉండగా సుబ్రహ్మణ్యుడు బ్రహ్మదేవుణ్ణి ఆపి "బ్రహ్మమనగా ఏమి?, ప్రణవమునకు అర్థం తెలుసా?!" అని అడిగాడు.



"బ్రహ్మమనగా నేనే" అన్నారు చతుర్ముఖబ్రహ్మ. మీరు నాలుగు ముఖములతో వేదములు చెబుతున్నారు. కానీ, బ్రహ్మం అర్థం కాలేదు అని బ్రహ్మదేవుణ్ణి చెఱసాలలో బంధించాడు సుబ్రహ్మణ్యుడు. వెంటనే పరమ శివుడు వచ్చి నాయనా! బ్రహ్మ గారికి జ్ఞానంలో కించిత్ దోషం ఉండి ఉండొచ్చు. అంతమాత్రాన వారిని శిక్షించరాదు అని చెప్పగా సుబ్రహ్మణ్య స్వామి వెంటనే బ్రహ్మ దేవుణ్ణి విడిచిపెట్టేశాడు. అంతట సుబ్రహ్మణ్యుడు పరమశివునితో "తండ్రీ! నేను బ్రహ్మగారిని బంధించి పెద్ద తప్పు చేశాను. నేను మీ పుత్రుడను అయినంతమాత్రాన సృష్టికర్తను బంధించ వచ్చునా? నేను వారిని బంధించి అవమానించాను. నేను ఇలా చేసి ఉండకూడదు. ఏది ఏమైనా నావల్ల మహాపరాధం జరిగింది. కాబట్టి దీనికి ప్రాయశ్చిత్తంగా నేను సర్పరూపం దాల్చి భూలోకంలో ఉంటాను" అని చెప్పి సర్పరూపం దాల్చి భూలోకం చేరాడు సుబ్రహ్మణ్యుడు. అలా స్వామి సర్పరూపంతో ఉండగా కొందరు ఆకతాయిలు, పిల్లలు వచ్చి ఆ సర్పాన్ని (సుబ్రహ్మణ్యుణ్ణి) రాళ్ళతో కొట్టసాగారు. అప్పుడు పార్వతీదేవి షష్ఠీవ్రతం చేయించింది. దాంతో సుబ్రహ్మణ్యుడికి సర్పరూపం పోయి తేజోమయుడైన సుబ్రహ్మణ్యుని రూపం వచ్చింది అని ఒక కథనం.

## స్వామిమలై పేరులోని అంతరార్థం

స్వామిమలై అంటే దేవుని కొండ అని అర్థం. మొదట్లో 'స్వామి' అనే పదం సుబ్రహ్మణ్యుడికే వర్తింపజేసి చెప్పేవారు. ఎందుకంటే 'స్వామి' అంటే గురుస్వరూపం అని చెప్పుకున్నాం కదా!. తనతండ్రి పరమశివునికే ప్రణవార్థం బోధించి తాను ఇక్కడ గురుస్వరూపం పొందాడు సుబ్రహ్మణ్యుడు. అలా పుత్రునితో ప్రణవార్థం చెప్పించుకొని తనయుని తెలివితేటలు చూసి శివుడు మురిసిపోయిన పవిత్రప్రదేశం ఈ క్షేత్రమే. గొప్ప తపోనిధి, సప్తర్షులలో ఒకరు అయిన అగస్త్యమహర్షికి ద్రవిడ వ్యాకరణం బోధించి సుబ్రహ్మణ్యుడు ఆ మహర్షికికూడా గురువయ్యిందికూడా ఈ క్షేత్రంలోనే.


పరాయివారినీడలో ఎదగాలని ఎప్పుడూ అనుకోకు

అట్టి గురుస్వరూపమయిన సుబ్రహ్మణ్యుడు వెలసిన కొండ కాబట్టి ఈ క్షేత్రాన్ని 'స్వామిమలై' అన్నారు. పరమశివుడు పుత్రునినుండి ప్రణవార్థం చెప్పించుకోడానికి మరో కారణంకూడా చెప్పబడింది.



భృగుమహర్షి గొప్ప తపస్సంపన్నుడు. భృగుమహర్షి ఒకమారు తపస్సు ప్రారంభించే ముందు తన తపస్సునెవరైనా భంగంచేస్తే వారు వారికి అప్పటివరకు ఉన్న జ్ఞానాన్ని కోల్పోవునట్లు వరం పొంది తపస్సు ప్రారంభించాడు. మహర్షిగారి తపోనిష్ఠ అధికమై తీవ్రరూపం దాల్చి అన్నిలోకాల్లోనూ తాపం పెరిగింది. దాంతో దేవతలందరూ శివుణ్ణి వేడుకున్నారు. అప్పుడు శివుడు తపోదీక్షలో ఉన్న భృగుమహర్షివద్దకు వెళ్ళి మహర్షినుండి ఆ తపోజ్వాలను ఆపడంకోసం తన అరచేతిని మహర్షి శిరస్సుపైన పెట్టాడు. అలా మహర్షితలపై చెయ్యి పెట్టగానే అప్పటివరకు శివునిలో ఉన్న జ్ఞానమంతా పోయింది. దానివల్ల అప్పట్నుంచి శివుడు జ్ఞానశూన్యుడయ్యాడు. అందువల్ల బాలసుబ్రహ్మణ్యుడు బ్రహ్మగారిని బంధించిన సందర్భంలో సుబ్రహ్మణ్యుడితో మాట్లాడి బ్రహ్మగారిని విడిపింపజేసి పిమ్మట తన పుత్రునికే తాను శిష్యుడై ప్రణవార్థాన్ని తెలుసుకున్నాడు. పోయిన జ్ఞానాన్ని అలా తిరిగి పొందాడు శివుడు. అలా తన తండ్రియైన శివునికి ప్రణవార్థాన్ని బోధించిన ఆ మహాపుణ్యక్షేత్రంలో సుబ్రహ్మణ్యుడు వెలిశాడు. భక్తుల కోర్కెలు తీరుస్తూ నిత్యం సేవలందుకొంటున్నాడు.

## ఆలయంలోని ఆర్జితసేవలు

స్వామిమలై ఆలయంలో స్వామికి జరిగే అన్నిసేవల్లో స్వామి అభిషేకం చెప్పుకోదగినది. స్వామికి ప్రతిరోజూ అభిషేకం చేస్తారు. ప్రాతఃసమయంలో ఒక అభిషేకం చేస్తారు. తరువాత పదకొండుగంటల సమయంలో మళ్ళీ ఒక అభిషేకం చేస్తారు. స్వామివారికి అలంకారాలేమీ లేకుండా చిన్నకౌపీనం మాత్రం ఉంచి వేదమంత్రాలు చదువుతూ పంచామృతాలతో అభిషేకం చేస్తారు. ఈ అభిషేకదర్శనంకోసం వెయ్యిరూపాయల టిక్కెట్టు తీసుకోవాలి. సుబ్రహ్మణ్యస్వామివారి అభిషేకం చూడడమంటే అమ్మవారి అయ్యవారి అభిషేకం ఒకేసారి చూసినట్లన్నమాట. అందులోనూ ఇక్కడ స్వామినాథస్వామి అలంకరణలేమీ లేకుండా చిన్న కౌపీనంతో నిలబడి, చేతిలో శక్తిఆయుధం పట్టుకొని చిన్నపిల్లాడిలా ముద్దుగా కనబడతాడు. ఎంతో కన్నులపండువుగా జరుగుతూ భక్తుల్ని తన్మయుల్ని చేస్తుంది ఈ అభిషేకం.

ఇలా ఎన్నో నిత్యసేవలు, నివేదనలు జరుగుతాయి. ఇంకా ఉత్సవాలూ జరుగుతాయి. ఇన్ని విశేషాలున్న ఈ క్షేత్రం వీలునుబట్టి ప్రతి ఒక్కరూ దర్శించవలసిన మహాపుణ్యక్షేత్రం. ఎన్నో పౌరాణిక, ఆధ్యాత్మికవిశేషాలున్న మహా మహిమాన్విత పుణ్యక్షేత్రం స్వామిమలై క్షేత్రం. జ్ఞానప్రదాతయైన స్వామినాథస్వామిని దర్శిద్దాం. జ్ఞానవంతులుగా, ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవిద్దాం.

## తిరుమల శ్రీవారి గురువారపుసేవ



**ప్రతి గురువారం రెండవఅర్చన సమయంలో ముందుగా మూలమూర్తికి ఆభరణాలు, తిరునామం సడలింపు చేయబడి రెండవ అర్చనానంతరం 'అన్నకూటోత్సవం' అనబడే 'తిరుప్పావడ' నైవేద్యం జరుగుతుంది. బంగారువాకిలి బయట శ్రీస్వామివారికి ఎదురుగా పెద్ద పులిహోరరాశిని అమర్చి నేరుగా స్వామివారికి నివేదిస్తారు. దీంతో పాటు పెద్ద పెద్ద జిలేబీలు, మురుకులుకూడా పెడతారు. ఈ సేవ పూర్తైనతర్వాత శ్రీవారి నేత్ర దర్శనం కల్పిస్తారు. ఆ రోజు సాయంత్రం పూలంగిసేవకూడా శోభాయమానంగా జరుగుతుంది.**

భగవద్గీత సందేశం

# కర్తవ్యం

- శ్రీ కొండూరి కాశీవిశ్వేశ్వరరావు,
92909 69633

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి (2-27)

అర్జునా! మానవులంతా పుట్టుకతోనే మరణాన్ని వెంట బెట్టుకొని వస్తారు. అలాంటి మరణంగురించి నువ్వు శోకించకు. ఎదురుగా ఉన్న శత్రువులు నీ బంధువులని దుఃఖించకు. మనం యుద్ధభూమికి వచ్చింది ధర్మబద్ధంగా యుద్ధం చేయటానికే. ఇప్పుడు యుద్ధం చేయటమే నీయొక్క కర్తవ్యం అని కృష్ణుడు చెప్తున్నాడు.

ప్రతిఫలాపేక్షలేకుండా నీ పనులను నీవు వెంటనే చేయాలి. అప్పుడే నీకు మోక్షయోగం ఆ క్షణమే సిద్ధిస్తుంది. జన్మించినవారందరూ కష్టనష్టాలను ఎదుర్కొంటారు. సుఖ దుఃఖాలుకూడా అనుభవిస్తారు. మళ్లీ మనకు ఈ మానవజన్మ ఎందుకు? అని మోక్షాన్నే కోరుకుంటారు. ఎందుకనగా, ఈ భూమిపై జన్మించిన తరువాత ప్రతినిత్యం యుద్ధం చేయక తప్పదు. అది ధర్మయుద్ధమా? లేక అధర్మయుద్ధమా? అనే విషయాలు మనం సంపాదించుకున్న జ్ఞానంపై ఆధారపడి ఉంటాయి.



అర్జునా! నీవు భయభ్రాంతులను పొందక తక్షణమే అస్త్రాలను సంధించుమని శ్రీకృష్ణుడు పలికిన అమృతవాక్కులు మన జీవితంలోని సమస్యలను పరిష్కరించటానికి, రాగద్వేషాలను అధిగమించటానికి కర్మలు తప్పక చేయవలసిందే అన్నది దీనియొక్క అర్థం.

అమూల్యమైన కాలాన్ని వృథాచేయటం, అసలు ఎలాంటికర్మలు (పనులు) చేయకుండా ఉండటంకూడా మహా పాపమే! మానవజన్మకు కర్మలు చేయటంద్వారానే సార్థకత లభిస్తుంది. సంకల్పసిద్ధితో చేపట్టిన కార్యాలు మంచివైతే సత్ ఫలితాలు లభిస్తాయి. లేదంటే ఏదోఒకకర్మ చేయమన్నారు కదా అని దుర్మార్గపు, అధర్మపుకర్మలు చేయటంవలన వాటియొక్క ప్రతికూలఫలితాలు, శిక్షలుకూడా అనుభవించక తప్పదు. అలాంటిసమయంలోనే ఎంతటి అహంకారులకైనా జ్ఞానోదయం సిద్ధిస్తుంది.

కర్మలు చేయకుండా ఉన్నట్లైతే జ్ఞానవిచక్షణ తెలియదు. అజ్ఞానంతో చేసిన పనులతోకూడా జ్ఞానం వస్తుంది. జ్ఞాన సముపార్జన లేకుండా మోక్షం సిద్ధించదు అన్నది అక్షరసత్యం. జ్ఞానంకొరకై ప్రతీ క్షణం, అనునిత్యం కర్తవ్యపాలన చేయటం అనివార్యం.

బాధ్యతలను విస్మరించేవారికి మోక్షం లభించదు. కేవలం వైరాగ్యయోగమనే నావతో జీవితభవసాగరాన్ని దాటటం దుర్లభం. మన నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక క్లిష్టసమస్యలకు సైతం పరిష్కారాలు సులభమైనరీతిలో శ్రీభగవద్గీతయందు తప్పనిసరిగా లభిస్తాయి. అందుకనే శ్రీభగవద్గీతను వ్యక్తిత్వవికాస గ్రంథంగా పేర్కొన్నారు.

జ్ఞానాన్ని పొందటానికి శ్రద్ధ, క్రమశిక్షణ, సాధన కూడా చాలా అవసరం. అలాగే మనం ఆర్జించిన జ్ఞాన సంపదను పరుల మేలుకొరకు వితరణ చేయాలి. మనం ఎంతటి జ్ఞానులమైనా, దానిని సమాజశ్రేయస్సుకొరకు పంచనినాడు అది వ్యర్థమే. అభ్యసించిన విద్య, జ్ఞానవిజ్ఞానాలను తోటివారికి బోధించనివారు అడవిలో మ్రానుగా జన్మిస్తారు.

కీర్తి, సంపదలకొరకు ఎంత తాపత్రయపడినా సత్కార్యాలు చేయని జీవితం ముమ్మాటికీ వ్యర్థమే. భక్తిభావనతో శ్రీకృష్ణుని శరణుకోరి, నారాయణసేవ చేయటంద్వారా మోక్షసిద్ధి కల్గుతుంది. జయాపజయాలు బేరీజువేస్తూ కాలయాపన చేయక, శత్రువులనుకూడా ఎదుర్కోవాలి.

మీ మనస్సులను (శ్రీకృష్ణునికి) కార్యాచరణలో నిమగ్నమవనివ్వండి. అన్నిచింతలకూ మూలం మన చిత్తమే. మాయామర్మాలను కనిపెట్టి, మనస్సును జయించాలి. రాగ, ద్వేష, భయభ్రాంతులను విడిచి నన్ను ధ్యానిస్తే మీకు అష్టైశ్వర్యాలు ప్రాప్తి స్తాయి అని కృష్ణవాక్కు.

ధర్మాన్ని చెప్పటం ఎంత ముఖ్యమో, ధర్మాన్ని ఆచ రించటం, పరిరక్షించటంకూడా మన కర్తవ్యాలే అని తెలుసు కోవటం మన జీవితపరమార్థం.

జూలై 21, 2024న గురుపౌర్ణమి సందర్భంగా...

# గురు వందనం

-శ్రీ టి.ఎల్.ఉమామహేశ్వరరావు,
9000 776923

ఆషాఢపౌర్ణమి, గురుపౌర్ణమిగా భారతీయ జనజీవన స్రవంతి ప్రతిసంవత్సరం భక్తిప్రపత్తులతో వేదవ్యాసునకు నివాళులర్పి స్తుంటుంది. ఆషాఢపౌర్ణమే గురుపౌర్ణమి. గురుపౌర్ణమే వ్యాసపౌర్ణమి. వేదవిభజిత విజ్ఞానసంపత్తిని, భారత భాగవతాది పురాణఇతిహాసవాఙ్మయాన్ని జాతికి అందించి జాతిని జాగృతం చేసిన మహానుభావుడు. పరంపరానుగతంగా వేదవిద్యను వ్యాప్తి చేయడానికి అనువైనవ్యవస్థను సంకల్పించి, సమకూర్చిన వేదనారాయణునకు మన సాష్టాంగ దండప్రణామాలు.

గురువులకు గురువు వేదవ్యాసమహర్షి. అనితరసాధ్య మైన అనంత వేదవిజ్ఞాన అఖండరాశిని విడదీసి, దేవభాషను సంస్కరించి, భావాలను అందు పొందుపరిచి బ్రహ్మసూత్రాలను వ్రాసి, భావితరాలవారికి వేదమును, ఋగ్వేదము, యజుర్వే దము, సామవేదము, అథర్వణవేదము అను నాలుగు వేదములుగా ఆవిష్కరించి, అందించిన అవతార పురుషుడు. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, జ్యోతిషము, నిరుక్తము, కల్పములనే వేదాంగ ములను పరిష్కరించి, ప్రభవించి, భాషను సంస్కరించి సంస్కృతమును ఆవిష్కరించి దేవనాగరిలిపితో ప్రామాణికం చేసి, భావితరాలకు తన ప్రజ్ఞఫలితాలను పెంచి పంచిన జ్ఞానప్రదాత. అతిక్లిష్టములైన బ్రహ్మసూత్రములు, కారికలు, వ్యాఖ్యలు వ్రాసి ఆదిశంకరులకు మార్గదర్శకులైన మేధావి.

మహాభారతఇతిహాసాన్ని జయము అనుపేరుతో లక్షా ధికశ్లోకరాశితో జ్ఞానవిజ్ఞానసర్వస్వంగా ఆవిష్కరించిన సనాతన చరిత్రకారుడు. దానిని పంచమవేదంగా మలిచిన మహనీ యుడు. సామాన్య ప్రజానీకానికి పామరపండితజనానికి ధర్మ సూక్ష్మములను కథలుగాథలుగా 18పురాణాలు, మరెన్నో ఉప పురాణాలు సంకలనంచేసి ప్రాదుర్భావంచేసిన పరమపుణ్య పురుషుడు. కృష్ణాలీలామృతాన్ని భాగవతమహాపురాణంగా గ్రంథంచేసి శృంగార, భక్తి, జ్ఞాన, వైరాగ్య, పురాణేతిహాసంగా ప్రసాదించిన పురాణపురుషుడు. భగవద్గీత, విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని జాతికి పరమప్రసాదంగా అందించిన అజరామర కీర్తికిరీటి వేదవ్యాసుడు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గములను జయించిన జితేంద్రియుడు.

నారాయణాంశతో ఉద్భవించిన కారణజన్ముడు వ్యాసుడు. వైవస్వతమన్వంతరంలో 28వద్వాపరయుగమందు కృష్ణద్వైపాయనుడుగా పుట్టి ఆదిగురువుగా గుర్తింపబడి బ్రహ్మర్షిగా తరతరాలుగా, యుగయుగాలుగా వందనములు అందుకుంటున్నాడు.

వందే శంభు ముమాపతిం,
సురగురుం, వందే జగత్కారణం,
వందే భక్తజనాశ్రయం చ,
వరదం వందే శివం శంకరం॥

పంచభూతతత్వంతో విశ్వమంతా వ్యాపించిన శివుడు, శుభకరుడు, భక్తులకోర్కెలను కాదనకుండా కరుణించే కారుణ్యమూర్తి, ఉమాపతి, సురాసురులకు గురువు, భక్తులపాలిట పెన్నిధి అయిన ఉమాపతికి నమస్కారం. శివుడు ఆదిగురువు. "ఓం నమః శివాయ" పంచాక్షరిమూలమంత్రం సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహాలనే పంచ స్థితులను సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానములనబడే పంచ ముఖములు గలవాడు. పంచాక్షరిమంత్ర సాకార ప్రణవస్వరూపమయినవాడు, వైదిక దక్షిణామ్నాయ, పశ్చిమామ్నాయ, ఉత్తరామ్నాయ, ఉర్యామ్నాయ అను సప్తకోటిమంత్రరాశికి కర్త, భర్త అయిన ఆదిగురువు శంకరునకు నమస్కారం. అందుకే అక్షరాభ్యాసమందు ఓంప్రథమంగా "ఓం నమః శివాయ" అని పిల్లలచే దిద్దిస్తాం.

శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే।
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి సన్నిధిం క్రియాత్॥

చదువులతల్లి సరస్వతీదేవికి గురువందనం. పంచ ముఖి, ప్రణవస్వరూపిణి, వేదమాత, అక్షరసంధాయిని అయిన గాయత్రీవేదమాతకు గురువందనములు. కష్టపడి కని, పాలిచ్చి పెంచి, 'అ'కారమునుండి 'హ'కారమువరకు శిశువుతో పలికించే మాతృమూర్తికి, పెంచి పాలించి విద్యాభ్యాసములను చేకూర్చే తండ్రికి, వానికి విద్యనేర్పే అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు,

ఆచార్యులకు గురువందనం. మాతృదేవో భవ! పితృదేవో భవ! ఆచార్యదేవో భవ! మరెందరో మహానుభావులు, ఆచార్యులు, అవధూతలు, యోగులు, యోగిపుంగవులు, గురువులు, గురు తుల్యులు అందరికీ మన సహస్రాధిక సాష్టాంగప్రణామములు.

**శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం।**
**నమామి భగవత్పారం శంకరం లోకశంకరం.**

శృతులు, స్మృతులవ్యాఖ్యాత బ్రహ్మసూత్రభాష్యకారుడు, అద్వైతసిద్ధాంతకర్త, కరుణామయుడు, సాక్షాత్ శంకరావతార పురుషుడు కారణజన్ముడైన భగవత్పాదులు ఆదిశంకరులకు నమస్కారం.

ఆదిగురువైన ఆదిశంకరులు గురుపరంపరలో ఆది గురువు. ఆదిశంకరులు తన బహుముఖప్రజ్ఞతో, పాటవాలతో, మేధాశక్తిసంపన్నతలు, శారీరక మీమాంసాభాష్యం, 10ఉపనిషద్ భాష్యములు. గీతాభాష్యము, ప్రస్థానత్రయము అను ప్రమాణ గ్రంథాలను ఇతరత్రా శతాధిక మహాగ్రంథాలను రచించి, ఆసేతుహిమాచలపర్యంతం పాదచారియై మూడుసార్లు పర్య టించి, అద్వైతసిద్ధాంత ప్రతిపాదనలను సుస్థాపితం చేసి, అనేక క్షేత్రములయందు ఆగమశాస్త్రానుసారం అర్చన, పూజావిధి విధానాలను నిర్దేశించి, శాంతిస్థాపనచేసి, ఆలయములందు



పంచాయతనపూజావిధానంతో మతాంతర సామరస్యతను స్థాపించి, పూరి, శృంగేరి, ద్వారక, బదరీదేవాలయాల్లో మఠాలను స్థాపించి, సర్వజ్ఞపీఠాధిరోహణం చేసి సశరీరంగా కైలాసప్రాప్తి చెందిన శంకరభగవత్పాదులు జగద్గురువులు ఆదిజగత్‌గురువులు.

**కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్।**
**ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలం॥**

సర్వోత్కృష్టమైన మంత్రము శ్రీరామః రామ రామ మధురాతిమధురంగా, యుగయుగాలుగా మనుష్యకోటికి మోక్షదాయకమైన రామాయణ ఇతిహాసమహాకావ్యాన్ని జాతికి అందించిన కావ్యకోకిల, ప్రప్రథమ ఆనంద సుస్వర సుశ్లోక కవీంద్రుడు వాల్మీకిమహర్షికి పాదాభివందనం.

**గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణాం**
**నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః**

అత్రిమహర్షి, పతివ్రతాసాధ్వి అనసూయదంపతుల సత్సంతానం, త్రిమూర్తిస్వరూపం, అన్నివిద్యలకు ఆది పురుషుడు, జగద్గురువు మన మానసిక, దేహసంబంధిత సకల జాడ్యములకు పరమౌషధమైన పవిత్రమూర్తి దక్షిణామూర్తికి వందనములు.

**మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే।**
**సర్వలోకశరణ్యాయ సాధురూపాయ మంగళమ్॥**

మానవులకేగాదు, దైవాంశసంభూతులకు, కారణజన్ము లకుగూడా గురుశిక్షణ అవసరం. గుర్వనుగ్రహం గురుసేవా శుశ్రూషలచే మాత్రం పొందదగినది. మనవంతు కర్తవ్యంగా నిత్యము గురువులను గౌరవిస్తూ, గురు ఉపదేశాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ, నిత్యము విష్ణుసహస్రనామపారాయణం చేస్తూ, పలువురితో చేయిస్తూ, పరమగురువుల అనుగ్రహానికి అంకితమవుదాం.

**సదా బ్రహ్మ గురుం స్మరామి.**
**సదా బ్రహ్మ గురుం భజామి**
**సదా బ్రహ్మ గురుం వదామి**
**సదా బ్రహ్మ గురుం నమామి.**
**సమస్త లోకాన్ సుఖినో భవంతు**
**సర్వేజనాః సుఖినో భవంతు.**

వ్యక్తిత్వవికాసం

# అనుగ్రహం

- శ్రీమతి కొల్లి విజయలక్ష్మి,
96762 44685

సమస్త ప్రాణికోటియందు ఆత్మరూపంలో సర్వేశ్వరుడైన శ్రీహరి సదా వెలుగొందుతుంటాడు. విశుద్ధం, విశిష్టం, విజ్ఞానవంతమైన బుద్ధితోనే ఆ పరమాత్మను తెలియ సాధ్యమవుతుంది. ఆ పరమేశుడు నిరంతరం సేవింపదగినవాడు. పూజనీయుడుకూడ. భక్తులయందు వాత్సల్యంతో ఎల్లప్పుడూ అనుగ్రహభావంతోనే ఉంటాడు. మంచిమనస్సు, మధురవచస్సు, మహితమేధస్సుల సమన్వయమూర్తియైన బుద్ధితో ఆత్మారాముడై వింతలు సలుపు పరమాత్మకథాగానాన్ని వీనులవిందుగ, కాంక్షలుదీర ఆస్వాదించే జీవులు ధన్యులు. సర్వోపగతుడైన స్వామియందు మదిని నిల్పడం, నిరంతరం ఆ దైవచింతనారతుడు కావడం, శ్రద్ధాళువై మెలగడమే భక్తుల ప్రత్యేకత. కర్మలు భవబంధకారణాలే అయినా వానిని ఈశ్వరార్పణం గావిస్తే అవి తమ అస్తిత్వపు ఉనికిని కోల్పోతాయి. పరమాత్మ తృప్తిని పొందుతాడు. పరమాత్మ అనుగ్రహం అలవోకగ లభిస్తుంది.

జ్ఞానం, శక్తి, బలం, ఐశ్వర్యం, వీర్యం, తేజస్సులనే షడ్గుణైశ్వర్యసంపన్నుడు భగవానుడు. భక్తుడు భక్తితో భగవంతుని తెలియాలని ఎంత ఆరాటపడతాడో, అట్లే సర్వాంతర్యామియైన స్వామియు భక్తుల భక్తిమాధుర్యానికై పరితపిస్తాడు. ఈ ఆత్మ పరమాత్మల బాంధవ్యం సనాతనమైంది. నిత్యనూతనమైంది కూడా. సాధుజనసంరక్షణ, దుష్టదానవశిక్షణ, ధర్మ సంస్థాపనలే పరమాత్మ అవతారలక్ష్యాలు కావు. భాగవతుల పరిహారం, కష్టజీవులకు ఓదార్పు, కర్మధీరులకు ఊరడింపు, అభాగ్యులకు, అనాథలకు, అశాంతులకు తానే దిక్కని నిరూపించడంకూడా స్వామి అవతార బాధ్యతలే! ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులనే చతుర్విధభక్తులను భగవద్గీత ప్రస్తావించింది.



సుదాముడు మాలాకారుడు. సుదాముడిచ్చిన పూలహారాలను రామ కృష్ణులు ప్రీతితో అలంకరించుకొన్నారు. ఆ సుదామునిపై కరుణ గల్గింది. "నీవు కోరిన వరమిస్తాం కోరుకో" అన్నారు.

నీ పాదపద్మాలసేవ నాకు కావాలి. నీ భక్తులకు కమ్మని నేస్తం కావాలి. సర్వదా అపారమైన దయ ప్రాణులయందు కల్గిఉండాలి స్వామీ! అన్నాడు సుదాముడు.

కొమ్మకు, రెమ్మకు, తీగకు పూచేపూలు అమ్మఒడికో, చెలిముడికో, దేవునిగుడికో చేరతాయి. కంటికి అందం, కమనీయమైన సువాసనలతోపాటు కైవల్యసాధనకును ఆ పూలు సాధనాలే. అలాగే మానవజీవనం మాధవునకు అంకితం. మాధవభక్తుల సాంగత్యంలో మసలడం, సహజీవులపై దయా సానుభూతులతో ప్రవర్తించడం. భగవంతుడు మనకు వాక్కు, మనస్సు, కాయములనే త్రికరణాలను ప్రసాదించాడు. వానికి చైతన్యస్ఫూర్తినిచ్చాడు. మంచిని చేయాలి. మంచిని ఆలోచించాలి. మంచినే మాట్లాడాలి. పెదవులు అత్యంత ప్రమాదాలు. ప్రియమైన పలుకులకే నోరు తెరవాలి. సాయం చేయడానికే చేతులు. బుద్ధివికాసానికే మనస్సు. భాగవతులు మనకందించిన మార్గంలో పయనించడం, చిత్త శుద్ధితో, నిబద్ధతతో కర్తవ్యకర్మలను ఆచరించడం అందునా సాత్త్వికతతో ముందుకు సాగడం మనం చేయాలి. అప్పుడే భగవానుని అనుగ్రహానికి మనం పాత్రులం కాగలం. ఈ నిజాన్ని ఋజువుచేసే హరి భక్తుల కథలతో కాలం కరగిద్దాం. పరమార్థాన్ని సాధిద్దాం.

జూలై 15, 2024న శ్రీపెరియాళ్వార్‌శాత్తుమొఱ సందర్భంగా...

# అతిథిదేవోభవ

– డా॥ మైలవరపు
లలితకుమారి

"మాతృదేవో భవ పితృదేవో భవ
అతిథిదేవో భవ ఆచార్యదేవో భవ"

అన్నది వేదవచనం. తల్లి, తండ్రి, గురువు, అతిథి ఈ నలుగురు భగవంతుడితో సమానమని చెబుతారు. శ్రీకృష్ణదేవ రాయలచే రచింపబడిన ఆముక్తమాల్యదలో పెరియాళ్వార్‌గా ప్రసిద్ధిపొందిన విష్ణుచిత్తుడు భాగవతులకు చేసిన అతిథిసత్కారం గురించి అద్భుతంగా వర్ణించబడింది. ఏఏ కాలాల్లో ఏఏ భోజనాలతో అతిథుల ఆకలితీర్చాలో తెలిసినవాడు విష్ణు చిత్తుడు. ప్రబంధసాహిత్యంలో అతిథిపూజనం, వారి ఆకలి తీర్చటం, దేవతారాధన ప్రధానంగా వర్ణించబడింది. ఏ కాలానికి తగినట్లుగా ఆయా వంటకాలను వండి వడ్డించినట్లుగా వర్ణింపబడింది.

పాండ్యదేశమున శ్రీవిల్లిపుత్తూరు అను పట్టణముంది. ఆ పట్టణమున భట్టనాథుడను విప్రుడొకరున్నారు. నిరంతరం విష్ణునామస్మరణచే తరించినవాడు కనుక అందరూ ఆతణ్ణి విష్ణుచిత్తుడని, పెరియాళ్వారు అని పిలిచేవారు.

విష్ణుచిత్తుడు ఆ పట్టణానికి వచ్చే భగవద్భక్తులకు ఎదురేగి "వైష్ణవం వైష్ణవో దృష్ట్వా దండవత్ప్రణమేద్భువి" అనునట్లు వారికి సాష్టాంగనమస్కారం ఆచరించి, పాదప్రక్షాళనం చేసి, కొబ్బరిఆకులతో అల్లినచాపలపై కూర్చుండచేసి, విశాలమైన అరటిఆకులను పరిచి, వేడివేడి వరిఅన్నం, పప్పు అనేక శాకపాకములను వడ్డించి వేళ్ళసందులనుంచి కారునట్లుగా నెయ్యిపోసి, వక్కచెట్లమట్టలచే కుట్టబడిన దొన్నెలలో పాలు, పాయసం, పెరుగులను వారికి సమర్పించి, వారందరూ తృప్తిగా తినేదాకా సమీపముననే కూర్చుని వారి అలసట తీరునట్లుగా వీవనతో విసరుచు వడ్డించేవాడు. భోజనాలు ముగిసినతరువాత హస్త పాదప్రక్షాళనములు చేసి, తాంబూలమునిచ్చి దూరం నుండి వచ్చినవారి పాదములకు భక్తితో మర్దనలుచేసి వారి అలసటను తీర్చి, వారిని కుశల ప్రశ్నలువేసి, వారు పోయి వస్తామని చెప్పినప్పుడు వారికి తనకు తోచినరీతిన సంభావనాది సత్కా రములను చేసేవాడు. వారు తరలి వెళ్ళునప్పుడు వారిని ఊరి చివరదాకా సాగనంపి తిరిగి ఎప్పుడు వస్తారు? తప్పక రావాల్సిందిగా ప్రార్థించి దిగులుతో ఇంటికి తిరిగి వచ్చేవాడు. వేదవేదాంతాలను చదువకయే నిరంతర యోగక్రియ చేత ఒక మహాయోగివలె భాసిల్లేవాడు. ఈ అతిథిసేవనం ఆయనకు నిత్యకృత్యమైన కార్యం. దీనివల్ల స్వార్థం లేక పెద్ద వారిని, అతిథులను గౌరవించే విధానం నేటివారికి గోచరమవు తోంది.

గ్రీష్మఋతువునందు వచ్చే అతిథులకు ఆ ఋతువునకు తగినట్లుగా ముందుగా చందనంచే అతిథుల తాపం తీర్చి నులివెచ్చని తెల్లనిఅన్నం, తీయని చారులు, మజ్జిగపులుసులు, పలుచని అంబలి, ఇక్షురసం, లేతటెంకాయనీళ్లు, భక్ష్య విశేషములు, కదళి, మామిడిరసాదిఫలాలు, వట్టివేళ్లు మొదలగు సుగంధద్రవ్యాలు కలగలిపి చల్లబరిచిన పరిమళంతో నిండిన శీతలోదకములు, గ్రీష్మపుఎండయొక్క వడను పోగొట్టు ఊరవేసిన

### వైకుంఠపాళి
### :: 102 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మం | ద | 2 ర | ము | ■ | 3 భ | 4 ర | తు | డు |
| డో | ■ | తి | ■ | 5 గా | ■ | ఘు | ■ | ■ |
| 6 ద | రి | ■ | 7 వే | త్ర | ము | ■ | 8 వ | 9 రి |
| రి | ■ | 10 శ | ■ | ము | ■ | 11 చో | ■ | పు |
| ■ | 12 అ | బ | ల | ■ | 13 మా | రు | తి | ■ |
| 14 బృ | ■ | రి | ■ | 15 వే | ■ | లు | ■ | 16 నా |
| 17 హ | రి | ■ | 18 శు | కు | డు | ■ | 19 నా | ర |
| స్ప | ■ | 20 భ్ర | ■ | వ | ■ | 21 ప | ■ | దు |
| 22 తి | రు | మ | ల | ■ | 23 అ | గ | స్త్య | డు |


విలువ అనేది తెలుసుకోలేని వ్యక్తి దాన్ని ఎప్పటికీ సంపాదించలేడు

లేతమామిడిపిందెలు, పలుచని మజ్జిగతేటతో ఘనమైన భోజనాలను వడ్డించి అతిథులను తృప్తిపరచేవాడు.

వర్షాకాలంనందు నీటిబుగ్గవలెనిండిన ఆకసమునుండి సంతతధారగా వాన కురిసేరోజుల్లో తనభార్య కళ్ళల్లోకి పొగ చొరకుండునట్లుగా నీరు తీసిన కొబ్బరిబొండాలను ఎండబెట్టి వానితో పొయ్యిని వెలిగించి వరిఅన్నం, పప్పు, వండిన నాలుగైదు రకాల కూరలు, వడియాలు, వంకాయ, దోసకాయ వరుగులతో చేసిన వంటలు, నెయ్యిలో ముంచి తినునట్లుగా దొప్పల్లో నెయ్యిపోసేవాడు. అతిథులు కారములచే బాధనొంద కుండునట్లుగా చక్కనైన, రుచికరమైన విందుభోజనాలను తన ఇల్లాలిచే వండించి, తాను వడ్డించి అతిథులు సుష్ఠుగా తిని నంతనే తాను ఆనందమును పొంది "అతిథిదేవో భవ" అని అనుకొనేవాడు.

శీతాకాలంనందు పునుగుదావులనుపేరుగల ప్రత్యేక నూతనమైన వేడి వేడి అన్నమును, మిరియముల పొడుల తోడ నిండిన శాకముల భాండములు, చుయ్యిమనిచేసే శబ్దము



నశింపని అనేకరకాల కూరలను, జలుబును పోగొట్టు ఔషధంగా చురచురమనిపించే ఆవపిండితో చేయబడిన పచ్చళ్ళు, ఊర గాయలు వడ్డించేవాడు. శీతాకాలం కనుక వేడిగల నెయ్యి, సగం ఇగురునట్లుగా కాచిన వేడిపాలతో కడుపు నిండునట్లుగా తనివితీరా భోజనం పెట్టేవాడు.

ఆయాకాలాల్లో మాత్రమే కాక శనివారంనాడు పరదేశి వైష్ణవులు తమ అభ్యంగనం స్నానంకొరకు ఇప్పపిండి నూరి ఆ ముద్ద చేతపట్టుకొని దానిమీద అరటిపువ్వుదొన్నెలు పెట్టుకొని విష్ణుచిత్తునిఇంటిలో కూనలకు పోసి, మిగిలింది తాము పోసుకొని ధౌతవస్త్రాలను ధరించి భోజనానికి వచ్చేవారు.

విష్ణుచిత్తుని ఇంటియందు పగటిసమయమునందు మాత్రమే కాక అర్ధరాత్రివేళ వెళ్లినా విష్ణుకథలు చెప్పు కంఠ ధ్వనులు, దివ్యప్రబంధముల శబ్దాలే వినవస్తాయి. అప్పుడు కూడా అతనినోట లేదన్నమాట ఉండేది కాదు. కానీ కూరలు అధికంగా లేవు. అన్నంవేడిగాలేదు. భక్ష్యాలు మితంగా ఉన్నాయి కనుక నేను సౌష్ఠవమైన భోజనం పెట్టలేకపోతున్నాను. మీరు మా ఎడల దయచూపి ఈ ఉన్న పదార్థాలతో కడుపునిండుగా తినాలని దీనంగా ప్రార్థించేవాడు. అతనుపెట్టే భోజనాలకే కాక అతను చేసే ఉపచారాలచే అతిథులు పెట్టినదాన్ని తృప్తిగా భుజించేవారు.

ఈ విధంగా వైష్ణవశ్రేష్ఠుడైన ఆ విష్ణుచిత్తుడు అత్యంత జాగరూకతతో ఏ వేళయందైనా, ఏ సమయంనందైనా తీర్థ యాత్రలకు వెళ్లే భగవద్భక్తులకు, ఇంటికి వచ్చిన భాగవతులకు ఎవ్వరేమి అడిగినా లేదనక, అలసటనొందక వచ్చినవారి ఆకలిని తీర్చి తగు ఉపచారకృత్యాలను ఆచరించేవాడు. యోగీశ్వరుడైన ఆ విష్ణుచిత్తుడు న్యాయార్జితమైన విత్తంతో వైష్ణవు లందరికిని భోజనాదికములచే అర్చించి, అతిథిమర్యాదలను చేసి ఆనందించేవాడు. శ్రీవైష్ణవులకు అతిథిభోజనం విష్ణుపూజనంలో ఒకభాగం. కనుక సాక్షాత్తు ఆ విష్ణువే భాగవతుని రూపంలో తన ఇంటికి అతిథిగా వచ్చినాడని ఆనందంతో తరించేవాడు విష్ణుచిత్తుడు. అందుకే **"అతిథిదేవో భవ అభ్యాగతో స్వయం విష్ణుః"** అని అతిథిని సాక్షాత్ విష్ణుస్వరూపునిగా భావించి అర్చించి పూజించాలి అన్నది మన సనాతనధర్మం.

అదే నేటితరానికి మనం నేర్పవలసిన ధర్మం.

యువత

# భద్రం

–శ్రీ కె.వీరాస్వామి,98664 02327

గృహస్థులైన రాజులకు ఉపదేశింపదగిన 'ధర్మార్థ కామము'లను కుమార ప్రహ్లాదునికి బోధించి నీతికోవిదుని కావించుమని అసురపురోహితులైన శుక్రాచార్యుని పుత్రులు చండామార్కులను రప్పించి, నమస్కరించి ప్రహ్లాదకుమారుని వారికి అప్పగించి మా వంశమును ఉద్ధరించుమని హిరణ్యకశిపుడు వారిని వేడుకొన్నాడు.

గురుకుమారులు ప్రహ్లాదుని తీసుకొని వెళ్లి అసుర కుమారులతో చేర్చి అంచితభక్తితో పెక్కుశాస్త్రాలను బోధించారు. గురువులు ఏది బోధించినా ఆక్షేపించకుండా వేదవేదాంగములు, ఇతరశాస్త్రములను వైష్ణవభక్తితోసహా పరిపూర్ణంగా అభ్యసించాడు. హిరణ్యకశిపుడు తన కుమారునితో ప్రాణహాని ఉందని తెలిసి ఎన్నివిధాల హింసించినా ప్రహ్లాదుడు విష్ణుభక్తి వదలలేదు.

ఒకరోజు గురువులు చండామార్కులు గృహస్థకర్మానుష్ఠానానికి వెళ్లినసమయంలో తన సమానవయస్కులైన రాక్షస బాలురతో, 'బాలకులార! రండి! గురుబోధనాశాస్త్రాలు గ్రహింపనవసరం లేని సుధర్మవిషయాలను చెప్తాను. అవి మనకు నిరంతరభద్రత కల్పిస్తాయి.

అన్ని జన్మములకంటె ధర్మాచారం పాటించు మనుష్య జన్మ నూరు సంవత్సరాలకు పరిమితం. అందు సగభాగం యాభై సంవత్సరాలు అంధకారబంధురమైన రాత్రులందు నిద్రాది వ్యవహారాల్లో వ్యర్థమైపోతాయి. మిగిలిన యాభై సంవత్సరాల్లో ఇరవై సంవత్సరాలు బాల్యకిశోరాది వయోవిశేషాలతో గడచిపోతుంది. ఇక చివరి ముప్పై సంవత్సరాలు ఇంద్రియలాలనలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల్లో చిక్కి బంధాలను వదలించుకోలేక అసమర్థుడై, మధురతృష్ణకు లోబడి భృత్యము తస్కరించటం, వివిధవ్యాపారాల్లో ప్రాణహాని ఉన్నదని తెలిసి అంగీకరించి పదార్థాలు సంపాదిస్తూ కాలానుగుణంగా శీలవయోరూపకన్యలను, వినయవిద్యాలంకారులైన కుమారులను, భ్రాతులను, మమతల కాలవాలమైన తల్లిదండ్రులను ధన కనక వస్తు వాహన సుందరమైన బంధువులను, వంశ పరంపరాగతమైన ధనమును వదులుకోలేక, గృహస్థుడు నిజకుటుంబ పోషణ పారవశ్యంలో విరక్తిమార్గము తెలియక స్వపర అంధకారమార్గంలో చిక్కుకొంటున్నాడు.

కావున, కౌమారసమయంలో సుబుద్ధివలె, పరమ భాగవతులవలె ధర్మానుష్ఠతతో దుఃఖములయందు చేరక మోక్షానికి దారిచూపే హరిభజనయే ఉత్తమం. కొందరు గృహస్థులు వెఱ్ఱితనంతో సంసారంలో చిక్కువడి గర్భావస్థలలో ఈ దేహి పుడుతూ, చస్తూంటాడు. కావున చచ్చిపుట్టని త్రోవ కొరకై ఆదిదేవుడైన హరిని ఆశ్రయిద్దాం. కాని అసురులకు హరిని ప్రార్థించటం, రమ్యతరము, కష్టతరము కాదు అని మీకు తెలియజేస్తున్నాను.

సర్వభూతాత్మకుడైన హరి గల స్థానములు సర్వదిక్కుల యందు, చరాచర స్థూల, సూక్ష్మజీవులయందు, అంబువు, వాయువు, ఆకాశము, తేజము, రజస్తమోగుణములయందు హరి ఉన్నాడు. ఈశ్వరుడు, పరమాత్మ అనే శబ్దం కేవలం అను భవానందస్వరూపం. పరమాత్మ త్రిగుణాత్మకమైన దివ్యమాయ యందు దృశ్యుడు. దయాసహృదుడైన జనార్దనుని చరణాలను ఆశ్రయించిన అలభ్యంబేదియు లేదు. కావున పరమపురుషుడైన హరికి ఆత్మసమర్పణంచేసి జీవితాన్ని అతి భద్రంగా గడపాలి అని తన సహచర విద్యార్థులకు బోధించాడు.



108 దివ్యదేశాలు

# తిరుచ్చెంపొన్‌శెయ్ కోయిల్

## (శెంపొన్ అరంగర్ దేవాలయం)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

ఈ దివ్యదేశం తిరునాంగూర్ దివ్యదేశాల్లో నాలుగవదిగా పరిగణింపబడుతోంది. శీర్‌కాళి నుండి 10 కి.మీల దూరంలో తూర్పుదిక్కున అద్భుతమైన ప్రకృతి రామణీయకతతో, మహామండపంతో, అర్ధమండపంతో శోభిల్లుతోంది. శ్రీరంగం, తిరుమల, కాంచీ అనే మూడు దివ్యదేశాలలో వేంచేసి ఉన్న భగవంతుణ్ణి సేవిస్తే ఎటువంటి ఫలితం దక్కుతుందో అన్నింటినీకూడా కలిపి ఈ దివ్యదేశపు స్వామిని సేవిస్తేనే కలుగుతుందని, అలాగే దారిద్ర్యం, సమస్తదోషాలుకూడా తొలగుతాయని ఐతిహ్యం. ఈ దివ్యదేశపు స్వామి మూలమూర్తి దామోదరుడు, పేరరుళాళన్ అనే నామములతో తూర్పుదిక్కు చూస్తూ నిలుచున్నభంగిమలో కుడిచేతియందు అభయ ముద్రలో, ఎడమచేత గదను పట్టుకున్నరీతిలో శంఖం, చక్రం, పద్మం మొదలైన ఆయుధాలతో 12 (పన్నెండు) హస్తాలతో స్వామి దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. ఉత్సవమూర్తి హేమరంగన్, శెంపొన్‌అరంగర్ అనే తిరునామములతో శ్రీదేవి భూదేవి సమేతుడై కొలువుదీరి మనకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. అమ్మవారు అల్లిమామలర్ నాచ్చియార్ అనే తిరునామంతో ప్రత్యేకసన్నిధిలో వేంచేసి ఉండి అనుగ్రహిస్తున్నారు. ఈ స్థలంయొక్క తీర్థం నిత్యపుష్కరిణి కనకతీర్థం అని, అలాగే విమానం-వేదవిమానం, కనకవిమానం అని, ప్రత్యక్షం రుద్రుడికి, ధృడనేత్రమహర్షి, ఒక బ్రాహ్మణుడికి కూడా. తిరుమంగైఆళ్వారులచేత మంగళాశాసనం చేయబడినటువంటి భగవంతుడు పాంచరాత్ర ఆగమోక్తంగా పూజలు అందుకుంటున్నాడు.



## స్థలపురాణం

"రామరావణయోః యుద్ధం రామరావణయోరివ" అనే ఈ సూక్తిని అనుసరించి రావణుడితో మహత్‌యుద్ధం చేసిన రామభద్రుడు రావణాసురుని సంహరించి విజయాన్ని పొందాడు. తరువాత పట్టాభిషిక్తుడైనను బ్రాహ్మణుడైన రావణుణ్ణి సంహరించడంచేత తనకు బ్రహ్మహత్యాదోషం చుట్టుకుంటుందేమో అని భయపడి రామభద్రుడు ఆ దోషం తొలగించుకోవడానికై తీర్థయాత్రను చేయనారంభించాడు. అలాగే చేస్తూ ఉభయ కావేరీ మధ్యలో వేంచేసిఉన్న తమ కులధనమైన ఆ శ్రీరంగనాథుణ్ణి ఆరాధించినా కూడా అతని మనస్సు సంతోషపడలేదు. మళ్ళీ తీర్థయాత్రను ప్రారంభించి శెంపొన్‌అరంగర్ అనే ఈ దివ్యదేశానికి వచ్చి చేరాడు. అక్కడ కౌశికమహర్షి కుమారుడైన ధృడనేత్రుడు అనే అతనిదగ్గర తన మనస్థితిని చెప్పుకున్నాడు. ఆ మహర్షి కుమారుడు ఈ దివ్యదేశంలోనే అశ్వమేధయాగాన్ని చెయ్యమని చెప్పాడు. తరువాత బంగారంతో ఒక గోవుప్రతిమను



వేలసార్లు, మూడురోజులు అష్టాక్షరీమహా మంత్రాన్ని జపించి ఈ శెంపొన్ అరంగర్ స్వామివారి అనుగ్రహంతో సువర్ణ వస్తు ధన ధాన్య సంపదనంతటిని కూడా పొంది దారిద్ర్యాన్ని పోగొట్టుకున్నాడు. ఇలా భక్తులయందు ఇంతటి వాత్సల్యాన్ని కలిగి ఉన్నటువంటి ఈ స్వామి అందరికీ కూడా ఇహలోకసౌఖ్యాన్ని, అలాగే ఆయు రారోగ్య ఐశ్వర్యాలను మరియు పరమ పురుషార్థమైన మోక్షాన్ని ఇస్తాడు. అందు వల్లనే ఈ స్వామికి శెంపొన్ అరంగర్ అనే తిరునామం సార్థకమైనది అని స్థలపురాణం చెబుతోంది. ఇట్టి దేవదేవుణ్ణి మనంకూడా సేవించి సమస్త ఐశ్వర్యాలను పొందుదాం. సమస్త దోషాలను పోగొట్టుకొని, ఆ స్వామివారి దివ్యపాదారవిందాలను ఆశ్రయించి తరిద్దాం.

శెంపొన్‌శెయ నగరేతు నిత్య సరసీ స్వర్ణాఖ్య తీర్థాంచితే
శ్రీమాన్ పేరరుళాళ నాయక ఇతి స్వర్ణాఖ్య వైమానగః ।
ప్రాగాస్యస్థితి రల్లిమామలరితి ప్రాప్తోతి శేతే శ్రియం
రుద్రావేశిక దివ్యమంగళతనుః శ్రీమత్కలిఘ్నుస్తుతః ॥

తయారుచేసి ఆ గోవులోపల నాలుగు రోజులు ఉండి తపస్సుచేసి తరువాత ఆ బంగారుగోవును వేదవేదాంగాలను అభ్యసించిన ఒక బ్రాహ్మణుడికి దానం చేస్తే ఈ బ్రహ్మహత్యాదోషం తొలగిపోతుంది అని ఉపదేశించాడు. రామభద్రుడు పలువురు మహర్షులతో, పలువురు మునులతో ఈ అశ్వమేధయాగాన్ని చేశాడు. ధృఢనేత్రుడు చెప్పినరీతిగా తపస్సుచేసి ఆ బంగారు గోవును ఒక బ్రాహ్మణుడికి దానంచేసి తను బ్రహ్మహత్యాదోషం నుండి విముక్తి పొందాడు.

రామభద్రుడినుండి ఆ బంగారుగోవును పొందినటువంటి ఆ బ్రాహ్మణోత్తముడు దానితో అర్చామూర్తిగా ఉన్న దామోదరస్వామికి ఒక ఆలయాన్ని కట్టారు. ఆ తరువాతే ఆ దామోదర స్వామికి శెంపొన్ అరంగర్ అనే తిరునామం వచ్చింది. శెంపొన్ అనే శబ్దానికి ఒక అందమైన బంగారం అని అర్థం. ఆ తయారుచేసిన బంగారు గోవుతో శెంపొన్ అరంగర్ అనే పేరుతో స్వామి బంగారుమూర్తిగా అక్కడ వేంచేసి ఉన్నాడు.



## రెండవ స్థలపురాణం

కాంచీపురంలో అత్యంత దారిద్ర్యాన్ని అను భవిస్తున్న కాశ్యపుడు అనే బ్రాహ్మణుడు ఈ దివ్య దేశానికి వచ్చి ఒక మహర్షిసూచనతో ముప్పైరెండు


దేన్నైనా పరీక్షించొచ్చుగానీ మనిషి సహనాన్ని మాత్రం పరీక్షించకూడదు





## తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకమహోత్సవం

| తేదీలు | వారము | ఉత్సవములు |
|---|---|---|
| 16-07-2024 | మంగళ | జ్యేష్ఠాభిషేకం ప్రారంభం |
| 17-07-2024 | బుధ | కవచ ప్రతిష్ఠ |
| 18-07-2024 | గురు | కవచ సమర్పణ |

# శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

శ్రీనివాసుడు తిరుమలకొండమీదేకాక, కొండక్రిందకూడా సాక్షాత్కరించాడంట! వందేండ్లకిందటినుంచి వినపడుతున్న మాట ఇది!

తిరుపతికి పశ్చిమాన పదిమైళ్లదూరంలో ఉన్న ఒక పల్లెటూరు. ఆ ఊరు బయట, మొండిగోపురంతో, గోడలతో ఉసూరుమంటున్న శిథిలమైన ఆలయం. ఆ గుడిచుట్టూ ఉన్న గోడలరాళ్లు కాళ్లొచ్చి కదలిపోయినా, గోపురశిఖరం, బలిపీఠం, ధ్వజస్తంభం వానలకు నానుతూ, ఎండలకు ఎండుతూ శిథిలమై నిస్తాణంగా ఉంటూ మనసును మెలిపెట్టి పిండేస్తాయి. అయినా ఆ ప్రాంగణం నడుమభాగంలో శిలావేదికపై నిర్మింపబడ్డ ప్రధానమైన గుడి, గోడలపై శిలలు బీటలు వారినా, కొంచెం ఎగుడుదిగుళ్లైనా వింత వెలుగులీనుతూ అందంగానే కనపడుతుంది. వాకిళ్లే లేని ఆ గుడిమండపంలోనికి వెళ్లాలనీ, లోన గర్భగుళ్లో ఏముందో చూడాలన్న తపన ఆసక్తి ఉన్నా, ఎవరికీ గుండెధైర్యం చాలేది కాదు.

చిత్రాతిచిత్రం! 1900 ప్రాంతాన ఒక వెర్రిబాగులమ్మ అమాయకస్త్రీ, ఆకాశంనుండి ఊడిపడ్డట్టుగా ఆ గుడి ఆవరణలో ప్రత్యక్షమైంది. ఆమె ఎక్కడినుండి వచ్చిందో తెలియదు. ఏ ఊరో తెలియదు. ఏం పేరో ఎవరికీ తెలియదు. చెరగని చిరునవ్వుతో ఏభైఏండ్లు దాటిన యోగినిలాంటి స్త్రీ ఆమె. పేరే చెప్పని ఆ తల్లికి "తాయారమ్మ" అని ఆ ఊరివాళ్లే పేరు పెట్టుకొని పిలిచేవారు. ఆ రోజునుండి ఆ గుడిప్రాంగణంలోని ఆకులు, అలములు చెత్తా చెదారం తీసివేసి శుభ్రంచేసేది. ఊళ్లోకి వెళ్లి ఇల్లిల్లు తిరిగి బిచ్చం అడిగేది. గుళ్లో "శ్రీనివాసుడు ఉన్నాడు. నన్ను పూజ చెయ్యమన్నాడు. ఏదైనా ఇవ్వండి" అంటూ నవ్వుతూ అడిగేది- తాయారమ్మ, కాసులిస్తే వద్దనేది. కొంచెం చమురో, కాసిన్ని బియ్యమో, పప్పో, ఉప్పో పెట్టమని అడిగేది. ఇచ్చిన వాటిని ఆనందంగా తీసుకొని ఆ గుడిముంగిట్లో మూడురాళ్లపొయ్యిమీద కుండల్లో ఉడకేసేది.



ఆమె ఒక్కతే ఒంటరిగా గుళ్లో అడ్డదిడ్డంగా పెరిగినచెట్లను తీసివేసి, చెత్తను ఊడ్చుకుంటూ కారుచీకటిగా ఉన్న గర్భాలయంలోనికి వెళ్లింది. తాటిమట్టల్ని ముట్టించి ఆ వెలుతుర్లో లోపలికి పరికించి చూచింది. లోపల గర్భగుళ్లో నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని విగ్రహం! అలా చూచింది. పరమానందంతో పరవశించి రెండు చేతులెత్తి దండంపెట్టి సంబరపడింది. "శ్రీనివాసా! గోవిందా!" అంటూ ఆ నిలువెత్తుస్వామిని చేతికి అందినంతవరకు నీళ్లతో అభిషేకించింది. చమురుదీపం వెలిగించి, తాను ఉడకేసింది నివేదించింది. దానిలో కొంత అక్కడున్న పసులకాపర్లకు పెడుతూ, మిగిలింది ప్రసాదంగా తాను ఆరగించింది.

ఇదీ ఆనాటినుంచి తాయారమ్మ నిత్యకృత్యం. సుమారు నలభైఏండ్లపాటు ఆయమ్మకు ఆ గుడితో, ఆ ఊరితో విడదీయలేని అనుబంధం ఏర్పడింది. ఉన్నట్టుండి ఒకరోజు తాయారమ్మ ఇంటింటికి వెళ్లి ఇలా చెప్పింది!! "రేపట్నుంచి నేను రాను. ఒక స్వామి ఎక్కణ్ణుంచో వస్తాడంట! ఆయన శ్రీనివాసుణ్ణి మంత్రాలతో పూజిస్తాడంట! ఇప్పటినుంచి ఈ గుడి వైభవంగా వెలిగిపోతుందంట! ఇవన్నీ వేంకటేశ్వరుడే నాకు చెప్పి, నన్ను తుంబురుతీర్థం వెళ్లి తపస్సు చేసుకొమ్మన్నాడు. అందుకే రేపట్నుంచి నేను రాను"- అంటూ కనపడినవాళ్లకందరికీ చెప్పింది.

విచిత్రంగా ఆ మరునాడే కంచిక్షేత్రంనుండి ఒక అర్చకస్వామి వచ్చాడు. "నేను కంచిలో ఉంటాను. నా పేరు సుందరరాజస్వామి. మా తండ్రి రాఘవేంద్రాచార్యులు. ప్రతిరోజు రాత్రనక, పగలనక స్వప్నంలో శ్రీనివాసుడు కనపడి, "రా! నన్నుద్ధరించు, చీకట్లో ఉన్నాను. పుట్టల్లో, చెట్లల్లో ఉన్నాను. వెంటనే వచ్చి పూజించు" అన్నాడు. "స్వామీ! ఏ ఊళ్లో ఉన్నావు చెప్పు". అంటే పలకడు. అందువల్లే నేను తిరుపతియాత్రకు బయలుదేరి కనపడిన ఊరూ, పేటా, కోటా వెదుక్కుంటూ, ఎక్కడైనా శిథిలమైన శ్రీవేంకటేశ్వరుని ఆలయం కనపడుతుందేమోనని చూస్తూ వస్తున్నాను.

ఈనాటినిద్రలో "ఇదేనయ్యా! నేనుండే ఊరు. ఇదే ఈ గుళ్లోనే వందలఏండ్లనుంచి ఉన్నాను. నన్ను ఉద్ధరించి, శాస్త్రోక్తంగా పూజించు" అని గోవిందుడు ఆదేశించాడు'' అని ఈ విషయాన్ని అర్చకులు సుందరరాజస్వామి, ఆ గ్రామంలోని వాళ్లకు చెప్పాడు.

ఆ పల్లెజనం తాయారమ్మ చెప్పినమాట గుర్తు చేసుకొని పరమానందపడ్డారు. నరేనంటూ ఊరుఊరంతా కదలివచ్చారు.

గుడిఆవరణలోని చెట్లను, పుట్టలను తీసేశారు. ఆలయాన్ని వందలకొద్దీ బిందెలనీళ్లతో మండపాన్ని, గర్భాలయాన్ని కడిగి శుభ్రం చేశారు. గుడిప్రాంగణంలో ఆవుపేడతో కల్లాపుచల్లి చక్కగా ముగ్గులు తీర్చారు. పచ్చని అరటిస్తంభాలు, మామిడాకుతోరణాలు అలంకరించారు. ఒక్కగుడిలోమాత్రమే కాదు. ఆ ఊళ్లోని ప్రతిఇల్లూ మామిడాకులతో అలంకరించుకొన్నారు. ఊరు ఊరంతా వైభవంగా ఉత్సవవాతావరణం నెలకొంది.

సరిగ్గా అది 1940వ సంవత్సరం. విక్రమనామ సంవత్సరం ఆషాఢమాసం శుద్ధ సప్తమీ గురువారం ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కూడిన మంచిరోజు. అర్చకులు శ్రీసుందరరాజ స్వామికి కలలో సాక్షాత్కరించి, నిర్ణయించి చెప్పినట్లుగా ఆనాడు "శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవం" పేరుతో ఘనంగా వేడుక జరుపుకున్నారు.

మళ్లీ వందలసంవత్సరాలతర్వాత శాస్త్రోక్తంగా అర్చకులైన శ్రీసుందరరాజస్వామివారి చేతులమీదుగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి తొలిపూజ జరిగిన రోజున, ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ చేశారు. పిదప శ్రీవారిగర్భాలయంముంగిట సుప్రభాతం పఠిస్తూ వందల సంవత్సరాలపాటు యోగసమాధిలో ఉన్న శ్రీస్వామివారిని మేల్కొలి పారు. ఆ తర్వాత పురుషసూక్త శ్రీసూక్త భూనీళాసూక్తాల పఠనంతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారిమూలమూర్తికి అభిషేకద్రవ్యాలతో మంగళప్రదంగా అభిషేకం నిర్వహించారు. పిదప సన్నని బంగారు జరీఅంచు ఉన్న తెల్లనిపంచె, ఉత్తరీయాన్ని అలంకరించారు. నుదుట తెల్లని పచ్చ కర్పూరనామాలు తీర్చి దిద్దారు. వివిధరకాల పూలమాలలతో శ్రీస్వామివారి నిలువెత్తు మూర్తిని అందంగా, మనోహరంగా అలంకరించారు. ఆ తర్వాత సహస్రనామార్చన, ధూపదీపనైవేద్య, కర్పూరహారతులు ఘనంగా జరిగాయి.

తొలిసారిగా, 1940 జూలై 11వ తేదీ విక్రమనామ సంవత్సరం ఆషాఢశుద్ధసప్తమీ గురువారం ఉత్తరఫల్గునీ నక్షత్రంనాడు జరిగిన శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి సాక్షాత్కారవైభవోత్సవవేడుకల్లో ఆ గ్రామప్రజలేకాక, తిరుపతి, పెరుమాళ్లపల్లె, పేరూరు, తొండవాడ, చంద్రగిరి, నరసింగాపురం, మిట్టపాళెం మున్నగు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు. అందరిఇండ్లలోను పండుగలు చేసుకొన్నారు.

ఆనాటినుండి ఈ ఆలయం దినదిన ప్రవర్ధమానమౌతూ 1967 ఏప్రిల్ 26వ తేదీన తిరుమల తిరుపతి ఆలయాల ఆధ్వర్యంలోనికి వచ్చింది. ఈ ఆలయంలో 1980 జూలైనుండి మూడురోజులపాటు శ్రీకల్యాణవేంకటేశ్వరుని సాక్షాత్కార వైభవోత్సవాలు జరుగుతున్నాయి. ఆనాటినుండి నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూంది. వివాహం కావలసిన వారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుందని ప్రసిద్ధి ఉంది.

ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన శ్రీనివాసుడు ఈ ప్రాంతంలో ఉన్న అగస్త్యమహర్షిని దర్శించాడట! ఆ కల్యాణదంపతులు తొలినాళ్లలో అగస్త్యునికోరికపై ఆరునెలలు ఇక్కడఉన్నందువల్ల శ్రీస్వామివారు ఇక్కడ "**శ్రీకల్యాణవేంకటేశ్వరుడు**"గా పేరుపొందాడు.

1540 సం॥లో అచ్యుతరాయలు ఈ గ్రామాన్ని తాళ్లపాకవారికి మాన్యంగా ఇచ్చాడు. అప్పట్లో తాళ్లపాక అన్నమయ్య మనుమడు చిన్నన్న శ్రీకల్యాణవేంకటేశ్వరునిఆలయాన్ని ఉద్ధరిం చాడు. అందువల్లే ఆలయప్రవేశద్వారంలో ఇరువైపులా అన్నమయ్య, పెదతిరుమలయ్యల శిల్పాలు దర్శనమిస్తాయి.

అగస్త్యాది ఎందరో మహర్షుల తపోభూమిగా, జగత్కల్యాణదంపతులు శ్రీపద్మావతీ శ్రీనివాసులు నడయాడిన దివ్యస్థలంగా, కల్యాణపరంపరలను గుప్పించే ఆధ్యాత్మికక్షేత్రంగా అలరారుతున్న శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమలకు నడిచివెళ్లే "శ్రీవారిమెట్టు" మార్గంలో నెలవై ఉంది. ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుందాం! సర్వశుభాలను పొందుదాం!!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు!!











## తి.తి.దే. నూతన **కార్యనిర్వహణాధికారి** గారికి స్వాగతం! సుస్వాగతం!!



శ్రీ **జె.శ్యామలరావు**, ఐ.ఏ.ఎస్., గారు తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన కార్య నిర్వహణాధికారిగా నియమితులయ్యారు. వీరు మునుపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహించారు.

వీరు 16-06-2024న తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారిగా పదవీబాధ్యతలు స్వీకరించారు.

అనంతరం వారు తమ సతీమణితో కలసి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఆ తర్వాత తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., నూతన కార్యనిర్వహణాధికారి గారికి శ్రీవారి ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్., సి.వి. & ఎస్.ఓ. శ్రీ డి.నరసింహ కిషోర్, ఐ.పి.ఎస్., మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అదే రోజున తిరుమలలోని క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్సులను, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదభవనాన్ని ఆకస్మికంగా సందర్శించి, పర్యవేక్షించి భోజనం చేశారు. అక్కడున్న భక్తుల అభిప్రాయాలు తెలుసుకుని వాటికి అవసరమైన ఏర్పాట్లను చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

వీరు తిరుమల తిరుపతి దేవస్థానం వారి '**సప్తగిరి**' ఆధ్యాత్మిక మాసపత్రికకు గౌరవ సంపాదకులు. వీరికి హార్థిక శుభాకాంక్షలు.









# రథయాత్ర

- డా॥యస్.పద్మావతి,
96762 69300

పవిత్రయాత్రాస్థలం పూరీకి శ్రీక్షేత్రం, నీలాచలం అనే పేర్లున్నాయి. ఇది శ్రీజగన్నాథుని నివాసస్థానం. 8వశతాబ్దంలో దీనిని సందర్శించిన శంకరాచార్యులు ఇక్కడ గోవర్ధనమఠాన్ని స్థాపించారు.

కల్యాణమూర్తిదారు బ్రహ్మ జగన్నాథ స్వామికి జరిగే ఇరవైరెండుఉత్సవాల్లో రథయాత్ర ముఖ్యమైంది. దీనికే గుండిచయాత్ర అనిపేరు. ఆషాఢమాసం, శుక్లపక్షం, విదియ రోజున జగన్నాథుడు, చెల్లెలు సుభద్ర, అన్న బలభద్రస్వామి ముగ్గురుదేవుళ్ళు పెద్ద దేవాలయం వదలి గుండిచమందిరానికి మూడు రథాల్లో ప్రయాణం చేస్తారు. ఇందులో జగన్నాథుడు 'నందిఘోష' అను రథంలోనూ, బలభద్రుడు 'కాళధ్వజ' అను రథంలోనూ, సుభద్ర 'దేవదళనీ' అను రథంలోనూ పయనం సాగిస్తారు.

జగన్నాథుడు పీతాంబరధారి కాబట్టి నందిఘోషరథంలో పసుపుపచ్చనివస్త్రం శోభిస్తుంది. జగన్నాథుడిరథం ఇంద్రుడు ప్రసాదించిందని అంటారు. దీని ఎత్తు ముప్పైమూడుమూరల ఐదుజానెలు. ఎనిమిదివందల ముప్పైరెండుదూలాలతో తయారుచేస్తారు. పదహారుకళలకి ప్రతీకగా చక్రాలు పదహారు. గరుడుడు స్వయాన రథాన్ని రక్షిస్తుంటాడు. హనుమంతుడు ధ్వజాన్ని అలంకరిస్తాడు. దేవుని ఆయుధాలు శంఖం, చక్రం. రథాలంకరణ ఎరుపు, పచ్చనిరంగుల్లో ఉంటుంది. రథశీర్షభాగంలో దేవతాశక్తులు కల్యాణసుందరశక్తి విమల, విరాజలు తిష్ఠవేస్తారు.

హనుమంతుడు, రాముడు, లక్ష్మణుడు, నారాయణుడు, కృష్ణుడు, గోవర్ధనుడు, చింతామణి, రాఘవుడు, నరసింహుడు మొదలైన దేవతలు రథం నాలుగువైపులా ఉంటారు. శంఖం, బలాహక, శ్వేత, హరిదశ్వ అనే నాలుగుగుర్రాల రథానికి దారుకుడు సారథి. శంఖచూడ అన్న పేరుతో నాథుని రథం లాగటానికి రజ్జువు. రథానికి దేవి యోగమాయ. అయితే శక్తి విమలానందుడు, కుబేరుడు భట్టులు, నారదుడు, దేవళుడు, వ్యాసుడు, శుకుడు, పరాశరుడు, వశిష్టుడు, విశ్వామిత్రుడు, రుద్రుడు మొదలైన ఎనిమిది మంది ఋషులుకూడా రథారూఢులు. జయవిజయులు ద్వారపాలకులు. క్రియ, యోగ, ఆజ్ఞ, అనుజ్ఞ, ప్రజ్ఞ, మేథ, ప్రతిభలుగాగల ఈ రథం అధిష్ఠించిన దేవుడే నల్లనయ్య శ్రీజగన్నాథుడు.

బలభద్రుడి మరొకపేరు నీలాంబరుడు. కాబట్టి ఈయనధ్వజంపై నీలవస్త్రం శోభిస్తుంది. ఈ రథం దేవతలు తాళవనంలో ప్రసాదించిందంటారు. దీనిఎత్తు ముప్పైరెండుమూరల పదిజానెలు. ఏడువందలఅరవైమూడు కర్రదూలాలతో తయారుచేస్తారు. పద్నాలుగుమన్వంతరాలకు ప్రతీకగా పద్నాలుగుచక్రాలు. స్వయాన వాసుదేవుడు రథాన్ని రక్షిస్తుంటాడు. దేవుడికి ఆయుధాలు హలం. మూసలం; రథాలంకరణ ఎరుపు, నీలిరంగుల్లో ఉంటుంది. రథశీర్షభాగంలో అనంతనాగుడు తిష్ఠవేస్తాడు.

ప్రాణంబరి, గదాంతకరి, హరికరుడు, త్రైమూల్యుడు, వాసుదేవుడు, నాటంబరుడు, అఘోరుడు, త్రిపురారి, శివుడు మొదలైన దేవతలు రథం నాలుగువైపులా ఉంటారు. తీవ్రఘోరు దీర్ఘశ్రమ స్వర్ణనాభగుర్రాలరథానికి సారథి మాతలి. స్వయాన వాసుకి రథం లాగటానికి రజ్జువు. రథానికి దేవతలు బ్రహ్మ,







శివుడు అయితే భైరవుడు క్షేత్రపాలకుడు. మహాసిద్ధి, ఉలేమిభట్టులు. అంగిరుడు, పౌలస్త్యుడు, పులహుడు, అగస్త్యుడు, కృష్ణుడు, ముద్గలుడు, ఆత్రేయ, కశ్యపుడు మొదలైన ఎనిమిది మందిఋషులు రథారూఢులు; నందుడు, సునందుడు ద్వారపాలకులు. ఈ రథం అధిష్ఠించిన దేవుడే తెల్లనయ్య బలభద్రుడు.

సుభద్రాదేవి కొలువుదీరిన దేవళన రథంపై కృష్ణ (నల్లని) వస్త్రం శోభిస్తుంది. ఈ రథం దేవతలు ప్రసాదించిందని అంటారు. దీనిఎత్తు ముప్పైఒక్కమూరలు. దీన్ని ఐదు వందలతొంభైమూడు కర్రదూలాలతో తయారుచేస్తారు. సంవత్సరంలో పన్నెండు మాసాలకు ప్రతీకగా ఈ రథానికి చక్రాలు పన్నెండు ఉంటాయి. స్వయాన జయదుర్గ రథాన్ని రక్షిస్తూ ఉంటుంది. త్రిపురసుందరి ధ్వజాన్ని అలంకరిస్తుంది. దేవిఆయుధం పద్మ కాహ్లోదం. రథాలంకరణ కృష్ణలోహిత అంటే నలుపు, ఎరుపురంగుల్లో ఉంటుంది. రథశీర్ష భాగంలో దేవతాశక్తి భక్తిరసమేథ తిష్ఠవేస్తుంది. సుమేధాదేవి చామరం పడుతుంది.

విదుల, చాముండి, భద్రకాళి, హార చండిక, మంగళ వరాహి, కాత్యాయిని, జయదుర్గ, కాళి మొదలైన దేవతలు రథం నాలుగు వైపులా ఉంటారు. రోచిక, మోచిక, జిత, అపరాజిత నాలుగుగుర్రాల రథానికి సారథి అర్జునుడు. స్వర్ణచూడ అన్నపేరుతో నాగుడు రథంలాగడానికి రజ్జువు. రథానికి దేవిశ్రీ, భూ, మహాకరుడు భట్టు. భృగుడు, సుప్రభుడు, వజ్రుడు, శృంగి, ధ్రువుడు, భల్లూకుడు అనే ఆరుమంది ఋషులుకూడా రథారూఢులు. భువనేశ్వరి, చిత్రగంగ, యమున ద్వారపాలికలు. నాదాంబికపేరుతో ధ్వజంగల రథం అధిష్ఠించినదేవతే పచ్చనమ్మ సుభద్ర.

ఇలా అలంకరించబడ్డ రథాల్లో కూర్చున్నదేవుళ్ళు తొమ్మిదిరోజులు యాత్ర చేస్తారు. బలభద్రుడు ముందు తరువాత సుభద్రాదేవి, ఆ తర్వాత జగన్నాథస్వామి తమ రథాలకి వేంచేస్తారు. అందరికి ముందు నాలుగో దేవుడు దారు త్రికోణ స్తంభఆకారంలో ఎర్రనయ్య సుదర్శనుడు సుభద్రరథంలోనికి వచ్చి చేరుతాడు. ఆ తర్వాత పూరీరాజు (ప్రస్తుత వంశీయులు) స్వయంగా రథంపైన బంగారు చీపురుతో ఊడ్వగా, పన్నీరు అంతటా చల్లుతారు. దీనికి ఓ నేపథ్యముంది. అది–

పూరీనగరాన్ని ఇంద్రద్యుమ్నుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఇతడు మహావిష్ణువు భక్తుడు. ప్రతిరోజూ స్వామిని అత్యంతభక్తితో పూజిస్తూండేవాడు. ఓనాడు ఆ రాజుకు విష్ణువు కలలో కనిపించి, “ఓ రాజా! నీకు సముద్రంలో కొయ్యదుంగలు కన్పిస్తాయి. వాటిని శిల్పాలుగా చెక్కించు” అని చెప్పి మాయమైపోయాడు. మరునాడు రాజు సముద్రతీరానికి వెళ్ళి చూడగా, సముద్రంలో కొయ్యదుంగ కొట్టుకొనివస్తూ కనిపించింది. ఆ కొయ్యదుంగను రాజు బయటకు తెప్పించాడు. అప్పుడే విష్ణువు, విశ్వకర్మలు వృద్ధశిల్పకళాకారుల రూపాల్లో అక్కడికొచ్చారు. ఆ కొయ్యదుంగను విగ్రహాలుగా మలుస్తామని రాజుతో చెప్పారు.

విశ్వకర్మ మహారాజుతో “రాజా! మేము విగ్రహాలను మలిచేసమయంలో మాకు అంతరాయం కలిగించకూడదు” అని చెప్పారు. అందుకు సరేనన్నాడు రాజు. అలా పదిరోజులు గడిచిపోయాయి. రాజుకు ఆతృత ఎక్కువై ఆ మందిరంలోకి వెళ్ళగా, వారిరువురూ మాయమైపోయారు. విగ్రహాలు అప్పటికి సగంమాత్రమే చెక్కబడి ఉన్నాయి. అందుకు రాజు ఎంతో చింతించాడు. అలా వారు చెక్కిన కృష్ణ, బలరామ, సుభద్ర విగ్రహాలకు చేతులు లేవు. సగమే చెక్కబడిన విగ్రహాలు కదా మరి! అయినా అలాగే ప్రతిష్ఠించారు. అందుకే ఆ విగ్రహాలు మొండిచేతులతోనే దర్శనమిస్తూంటాయి. ఇప్పటికీ జగన్నాథరథంముందు ఆ రాజవంశీయులే చీపురుతో ఊడుస్తారు. లేని పక్షంలో రథం ముందుకు కదలదని నానుడి.

ఇక కాళధ్వజ, దేవదళన, నందిఘోష రథాలు ఒకదానివెంట మరొకటి భక్తులు రథాలకి కట్టిన తాళ్ళు పట్టి లాగుతూంటే ముందుకి సాగుతాయి. ముగ్గురుదేవుళ్ళు మూడురథాల్లో మైలున్నరదూరంలో గుండిచమందిరం చేరుకునే దారిని ‘బొడొదాండొ’ అంటారు. గుండిచమందిరానికి మరొకపేరు జనకపురి. అక్కడ దేవుళ్ళు ఏడురోజులు ఉంటారు. వెళ్ళేందుకు ఒకరోజు, తిరిగి వచ్చేందుకు ఒకరోజు మొత్తం తొమ్మిదిరోజులు సాగుతుంది ఈ యాత్ర. ఆషాఢశుద్ధదశమి రోజున మూడురథాలు పెద్దదేవాలయానికి తిరుగుప్రయాణమవుతాయి. ఇంతటితో

రథయాత్ర సమాప్తమవుతుంది. ఈ యాత్ర అంతాకూడా ఎంతో నేత్ర పర్వంగా ఉంటుంది.

పూరీలోని శిల్పాలు జగన్నాథస్వాములకు మానవత్వలక్షణాలు కల్పిస్తాయి. దైవంగా ఆరాధించబడడమేకాకుండా సాటిమానవుడిగాకూడా స్వామి పరిగణింపబడుతున్నారు. ఒరిస్సారాష్ట్రప్రజలు స్వామిని ప్రేమ పూర్వకంగా 'జగకాలియా' అని సంబోధిస్తారు. వారు స్వామిని ప్రజలను సంరక్షించే ప్రభువుగా తలుస్తారు. ఎందుకంటే మాదలపంజి అనబడే స్థల పురాణంలో సవరలని పిలువబడే ఒరిస్సా ఆదిమవాసుల తెగ మొదట స్వామిని అర్చిస్తుండేవారని, కాలక్రమేణా ఆర్యులు, అనార్యులుకూడా అర్చించ మొదలిడినారని చెప్పబడింది.

జగన్నాథుడు అనేకరూపాల్లో అర్చించబడతాడు. దేవతావిగ్రహాలు దారుబ్రహ్మ అనబడే వేపదూలములనుండి చెక్కబడ్డాయి. ఈ విగ్రహాలే మూలవిరాట్టులు. ప్రతి పన్నెండుసంవత్సరాలకు నవకళేబరమని పిలువబడే ఉత్సవంలో మూర్తుల దేహాలు మార్చబడతాయి. అసలు విగ్రహం ఉదరంలో ఉన్న పవిత్రశకలములను కొత్తవిగ్రహాలఉదరంలో అమరుస్తారు. ఈ కార్యాన్ని నిర్వహించడానికి ప్రధానఅర్చకుడు మాత్రమే అర్హుడు. పాతవిగ్రహా లకు సంబంధించిన ఇతర అవశేషాలను ఎవరికీ తెలియనిప్రదేశంలో ఖననం చేస్తారు. ఈ ఖననప్రదేశం ఎక్కడుందో ఇంతవరకు ఎవరికీ తెలియదట. పవిత్రశకలములు మార్పిడిచేసేవ్యక్తి వృద్ధుడై ఉండి ఉత్సవం పూర్తి అయిన తర్వాత తనువు చాలిస్తాడు. పన్నెండుసంవత్సరాలతర్వాత ఈ పవిత్రకార్యం నిర్వహించడం మరొకరివంతు అవుతుంది.

మాదలపంజిలో పేర్కొన్నప్రకారం ప్రస్తుత జగన్నాథదేవాలయ నిర్మాణం అనంతవర్మ చోడంగదేవ అనువారిచే ప్రారంభించబడి అనంతరం అనంగభీమదేవ అను వారిపాలనలో పూర్తైనట్లు తెలుస్తోంది. పరమహంస బాజ్‌పాయ్ అను మంత్రసత్తముని పర్యవేక్షణలో సుమారు యాభైలక్షల రూపాయల వ్యయంతో ఈ నిర్మాణం పూర్తయినట్లు తెలుస్తోంది. దేవాలయం గాలిగోపురం 214అడుగుల 8అంగుళాల ఎత్తు ఉంటుంది.

ఈ దేవాలయం నిర్మాణం శిల్పకళ కళింగులకు సంబంధించినది. ఏడుమీటర్లఎత్తుగల బలమైనప్రాకారమున 665 అడుగుల పొడవు, 640 అడుగుల వెడల్పుగల విస్తీర్ణంలో ఈ దేవాలయం నిర్మించబడింది. ప్రాకార మున నాలుగుదిక్కుల్లోనూ నాలుగుప్రవేశద్వారాలున్నాయి. దేవాలయమున విమానం, జగన్మోహనం, నటమందిరం, భోగమంటపం మొదలైనవి సూర్య వంశరాజైన కపిలేంద్రదేవునిచే నిర్మించబడ్డాయి. దేవాలయప్రాంగణంలో వివిధదేవతల ఆలయాలు ఉన్నాయి.

దేవతలకు మానవసంబంధమైన అలవాట్లు గలవని కాలానుగతంగా వస్తున్న నమ్మకం. ప్రతిరోజు దేవతలకు వివిధవేళల్లో వివిధరకాలైన అలం కారాలు చేస్తారు. ఈ అలంకారాలనే వేషాలంటారు. 38వేషాలుమాత్రం ముఖ్యమైనవి.



స్వామికి ఉదయం 8.30గంటలనుండి రాత్రి 11.00గం॥లవరకు నిత్యము 56భోగములు నివేదన చేస్తారు. ఆ ప్రసాదాలకే 'మహాప్రసాదం' అని పేరు. ఇది ప్రతిరోజూ ఆరుసార్లు నివేదించ బడుతుంది. అవి గోపాలవల్లభ్‌భోగ (ఉ.8.30 గం॥లకు), సకలధూప (ఉ.10.00గం॥లకి), భోగ మంటపభోగ(ఉ.11-00 గం॥లకు), మధ్యాహ్న ధూప(మ.12.30 గం॥లకు), సంధ్యాధూప (రా.7.00గం॥లకు), బాదసింగరభోగ (రా.11.00 గం॥లకు) అనేపేర్లతో నివేదించబడే ప్రసాదాలన్నీ మధురతీపిపదార్థాలతోనే నివేదనలు చేయబడ తాయి. స్వామి భుక్తశేషాన్ని ప్రసాదంక్రింద భక్తులకు



విక్రయిస్తారు. ఈ విక్రయం జరిగే ఆనందబజారు అను ప్రదేశం మిక్కిలి పెద్దదైన బహిరంగ తిను బండారాల విక్రయస్థలం. రాత్రి 11గం॥లకు స్వామికి పవళింపుసేవ జరుగుతుంది.

"మనిషి దేహం ఒక రథం. అందులో ప్రయాణిస్తుంది ఆత్మ. ఈ రథానికి సారథి బుద్ధి. మనస్సే కళ్ళెం. ఇంద్రియాలు గుర్రాలైతే పయనించే మార్గం భోగించాలన్న సమస్తవిషయాలు" అని తెల్పడమే జగన్నాథరథయాత్రసందేశం. ఈ రథ యాత్రలో మనమూ పాల్గొని జగన్నాథునికృపకు పాత్రులమవుదాం.

**జూలై 21, 2024న**
**ఆళవందార్ల వర్ష తిరునక్షత్రం సందర్భంగా...**

# యామునాచార్యులు

– డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి

యామునాచార్యులు 916 ప్రాంతంలో వీరనారాయణ పురం (ఆధునికకాలంలో దక్షిణఆర్కాట్‌జిల్లాలోని మన్నార్ గుడి)లో ధాతృనామసంవత్సరం కర్కాటక, పూర్ణిమ, శుక్రవారం, అనూరాధనక్షత్రంలో జన్మించారు. వీరి తండ్రి ఈశ్వరముని వర్యులు. యామునాచార్యులు వేదాలను, తర్కమీమాంసలను రామమిశ్రుడి (మనక్కాళ్‌నంబి) వద్ద విద్యాభ్యాసం చేశారు. వీరి విద్యాభ్యాసం ఆద్యంతం ఆసక్తిదాయకం.

ఆచార్యులవద్ద విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు ఒక సంఘటన జరిగింది. ఆనాడు రాజ్యాన్ని పరిపాలించే చోళ భూపతిహయాంలో యామునుల గురువులైన మహాభాష్య భట్టరుకు పన్నుకట్టాలని లేఖ పంపారు. కట్టడానికి నాణేలు లేవు. రాజశాసనం మీరినట్లు అవుతుందేమోనని విద్వజ్జన కోలాహలుడు రాజుగారితో ఏమి ఫిర్యాదు చేస్తాడోనని భయ పడ్డారు మహాభాష్యభట్టరు. ఆనాటికి యామునులకు 12సంవత్సరాలవయసు. గురువుగారు భయపడుతూంటే భటులు తీసు కొచ్చినపత్రాన్ని తీసుకొని చింపివేసి మీ అధికారితో చెప్పుకోండన్నారు. ఆ కుర్రవాడు అలా ప్రవర్తించేసరికి ఆశ్చర్యపోయారు.

యామునులను రాజసభకు పిలిపించాలనుకున్నారు సగౌరవంగా. కానీ రాడని భావించి పండితమర్యాదలతో రాజసభకు తీసుకురావడానికి ఏర్పాటుచేశారు. పల్లకిమీద మేళతాళాలతో, పండితమర్యాదలతో ఆ పన్నెండుసంవత్సరాల బాలవిద్వాంసుణ్ణి తీసుకునివచ్చారు. సభలో ఈ క్రిందిశ్లోకాన్ని యామునాచార్యులవారే రచించినదాన్ని అనేకపర్యాయాలు చదివించారు.

ఆశైలాదద్రి కన్యాచరణ కి సలయన్యాస ధన్యోపకంఠాత్
ఆరక్షోనీత సీతాముఖ కమల సముల్లా సముల్లాస హేతోశ్చ సేతోః।
ఆచ ప్రాచ్య ప్రతీచ్య క్షితి ధర యుగళా దర్క సోమావతం సాత్
మీమాంసా శాస్త్రయుగ్మశ్రమ విమల మనాః మృగ్యతాః మాదృశోస్యః॥

ఈ శ్లోకం చెప్పి మీమాంసశాస్త్రం పూర్వమీమాంస, ఉత్తరమీమాంస అని రెండుగా విభజింపబడింది. పూర్వ మీమాంస ఆరాధనస్వరూపాన్ని, ఉత్తరమీమాంస ఆరాధ్య స్వరూపాన్ని తెలుపుతాయి. ఈ రెండు మీమాంసలలోను పరిశ్రమ చేయాలి అంటే తక్కినశాస్త్రాల్లో పాండిత్యం కావాలి. ఈ రెండుశాస్త్రాల్లో పరిశ్రమించి స్వచ్ఛమైన మనసుగల మావంటి పండితులు మరొకడు ఉన్నాడేమో వెతుక్కోండి అని 12 సంవత్సరాల బాలుడైన యామునులవారు సవాలు విసిరారు. రాజసభలో యామునులవారిని చూడగానే రాణిగారు ఆళవన్దారు అని సంబోధించారు. అంటే ఏలుకోవడానికి వచ్చినవారు అని అర్థం.

అక్కడ ఒక విచిత్రమైన సన్నివేశం: చోళరాజు శివ భక్తుడు. రాజపత్ని వైష్ణవురాలు. ఆక్కియాళ్వారుపై విశ్వాసం మెండు రాజుగారికి. రాజపత్నికేమో యామునాచార్యులవారి మీద గౌరవం పెరిగాయి. ఆక్కియాళ్వారు వృద్ధపండితుడు. బాల విద్వాంసులు యామునులు.

రాజుగారు, వారి ధర్మపత్ని పరస్పరం పందెం వేసుకున్నారు. ఆక్కియాళ్వారు జయిస్తారని రాజుగారు, యామునులే జయిస్తారని ధర్మపత్ని, తను ఓడిపోతే మతం మార్చుకుంటానని అర్ధరాజ్యం ధర్మపత్నిద్వారా యామునులకివ్వడానికి రాజుగారు, ధర్మపత్ని ఓడితే దాసీగా రాజుగారిదగ్గర ఉండడానికి ఆమె ఒడంబడిక చేసుకున్నారు. విద్వజ్జన కోలాహలుడు ఆ బాలుణ్ణి చూసి జాలిపడ్డాడు. ఐనా వాదించాలి. జయించాలి అనే చింతన పోలేదు. శాస్త్రంలో ఈ కుర్రవాడికి ఏమి పాండిత్యం ఉంటుందిలే అనుకున్నాడు. లౌకికవాక్యాలతోనే జయించాలి అనుకున్నాడు.

మూడు లౌకికవాక్యాలు నీవంటే నేను కాదని నిరూపిస్తాను. నీవు బాలుడవు కనుక మొదట మాట్లాడే అవకాశం నీకే ఇస్తానన్నారు. నేను నిరూపించలేకపోతే నీవు నిరూపించాలన్నాడు. సరే అన్నారు యామునులు. ఇలా మూడు లౌకికవాక్యాలు పలికారు. ఒకటి ఈ రాజు ధర్మాత్ముడు కాదు. రెండు రాణి పతివ్రత కాదు. మూడు నీ తల్లి గొడ్రాలు. ఈ మూడువాక్యాలు పలికారు యామునులు.



ఏమీ సంపాదించకపోయినా ఫర్వాలేదు కానీ చెడ్డవాడనే పేరుమాత్రం సంపాదించకు

దాంతో పండితుడికి ఏమీ పలకడానికి తోచలేదు. ముఖం కళతప్పింది. నీవే ఈ మాటలని కాదని నిరూపించు అన్నాడు. వెంటనే యామునులు అందుకొని ఈ రాజు ధర్మాత్ముడు కాదు. అహంకారివైన నిన్ను పురోహితుడనే అభిమానంతో పండితసార్వభౌమునిగా చేసి పండితులనుండి కప్పం కట్టించుకోవడానికి అనుమతించడమే ఈయనచేసిన అధర్మం అన్నాడు. రాజుతోసహా తక్కినవారంతా సంతోషించారు. ఈ రాణి పతివ్రత కాదు. ఎంత యోగ్యతఉన్నా భర్తతోపాటు పందెం వేసి తన పత్నీత్వాన్ని వదులుకొని దాసీగా కొన్నాళ్లు ఉంటానని స్వాతంత్ర్యం కనబరచటమే ఈమె పాతివ్రత్యానికి వచ్చిన లోటు అన్నారు. మళ్ళీ సభలో కరతాళధ్వనులు.

మూడు మీ తల్లి కదళి వంధ్య. నీ ఒక్కడివే ఆమెకు పుత్రుడవు. ఒక్క గెలవేసి అరటిచెట్టు ఎలా నశించిపోతుందో మీ తల్లి నిన్నుమాత్రం కని తనువు చాలించింది. అందుచేత శాస్త్రప్రకారం నీ తల్లి గొడ్రాలు అన్నాడు. దీనికి సభ ఆమోదించింది. ఇలా 18రోజులపాటు శాస్త్రాల్లో అనేకరకాలైన చర్చలు జరిగాయి. అన్నింటిలోనూ యామునులవారు జయించడం జరిగింది. వెంటనే రాజు మాటప్రకారం యామునులవారికి అర్ధరాజ్యం సమర్పించారు. రాజకార్యాలతో, రాజభోగాలతో రాజ్యాన్ని పరిపాలించారు.

పుండరీకాక్షులకు నాథమునులు అప్పజెప్పిన కార్యం యామునులకు నిధిని అప్పగించడం. కానీ ఆ పని నెరవేరలేదు. పుండరీకాక్షులు అవసానదశలో శ్రీరామమిశ్రులకు ఆ కార్యాన్ని అప్పగించారు. అవి ఇంతవరకు తీరలేదు. ఈ రాజుగారిని ఎలా తన దృష్టి మరల్చాలి. తన తాతగారి ఆస్తిని ఎలా అప్ప చెప్పాలి అనే చింతన పట్టుకుంది శ్రీరామమిశ్రులవారికి.

అందుకు మెల్లగా రాజుగారి వంటవానితో చెలిమిచేసి, రోజూ అలర్క(అవిసె)పత్రాలను ఆయనకు అందించి, దాని పచ్చడిని రోజూ యామునులవారికి భోజనంలో వడ్డించవలసిందిగా శ్రీరామమిశ్రులు ఆ వంటవాడిని కోరాడు. అతడు అలాగే చేసేవాడు. ఇలా ఆరునెలలు గడిచాక ఆ కూరను ఇవ్వడం ఆపివేశారు.

రోజు వేసే పచ్చడి వేయకపోవడంతో యామునులు పచ్చడి ఎందుకు వేయడంలేదని వంటవారిని ప్రశ్నించారు. అందుకు వంటవాళ్ళు రోజు అలర్కపత్రాలను తెచ్చి ఇచ్చే బ్రాహ్మణుడు ఈమధ్య తీసుకురావడం లేదని చెప్పారు. అందుకు యామునులు ఎలాగైనా సరే ఆ బ్రాహ్మణుని అన్వేషించి అలర్క పత్రాలను తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. వంటవారంతా ఆ బ్రాహ్మణుని అన్వేషించి అలర్కపత్రాన్ని అడిగారు. సరేనని బ్రాహ్మణుడు మర్నాడు తెచ్చి ఇచ్చాడు. ఈ విధంగా రాజుతో శ్రీరామమిశ్రులవారికి స్నేహం ఏర్పడింది. ఘనంగా శ్రీరామ మిశ్రులను సత్కరించాలనుకున్నారు యామునులు. అందుకు శ్రీరామమిశ్రులవారు “నేను అందుకు రాలేదు. మీ తాతగారి నిధి మీకు అందించాలని వచ్చాను” అన్నారు వారి సత్కారాన్ని మృదువుగా తిరస్కరిస్తూ.. తర్వాతరోజున పరిచారకులు అడ్డుకోకుండా రాజు అనుమతి పొంది శ్రీరామమిశ్రులు యామునాచార్యులవారికి గీతగ్రంథాన్ని, చరమశ్లోకఅర్థాన్ని ప్రసాదించారు. అంతేకాక సంప్రదాయరహస్యాలను రహస్య గ్రంథాల్లోనుంచి అందించారు. తాతగారు ఇవ్వమన్న నిధి



గ్రంథసమీక్ష

# మణికింకిణులు

**(సంప్రదాయ, సాంస్కృతిక వ్యాససంపుటి)**

**రచయిత–** మధురకవి ఆచార్య శ్రీవత్స; **సైజు–**1/8 డెమ్మి; **పుటలు–**398; **వెల–**రూ. 234/–; **ప్రతులకు–**వి.జి.ఎస్. బుక్‌లింక్స్, 5–6–59/3, 2వ అంతస్తు, తమ్మినకృష్ణ వీథి; బిహైండ్ సాయిరామ్ థియేటర్, విజయవాడ–520 001; **ఫోన్–** 2510202, 2512222.

ఈ గ్రంథానికి రచయిత 'ఆచార్య' శ్రీవత్స 'మణికింకిణులు' అని పేరుపెట్టడంలోనే ఔచిత్యం కనిపిస్తున్నది. హైందవసంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే వ్యాసాల సమాహారం ఈ గ్రంథం. ఇందులో 53 వ్యాసాలున్నాయి. వాటిలో కొన్ని పండుగలకు సంబంధించినవి, మరికొన్ని భారతమాత వీరగాథను, తెలుగుతల్లి విజయగాథను ప్రస్తుతిస్తున్నవి. ఇంకొన్ని తెలుగుసాహిత్యానికి సంబంధించినవి. ఈ వ్యాసాలలో కొన్ని నేటి సమాజానికి యదార్థాన్ని తెలుపుతూ వైజ్ఞానికదృష్టిలో వ్రాయబడ్డాయి.

యాంత్రికంగా మారిపోయిన నేటి యువతకు పండుగ అంటే కేవలం పిండివంటలు చేసుకొని తినడమే తప్ప, ఏ పండుగ ఎందుకు చేసుకోవాలో, ఎలా చేసుకోవాలో, ఏ సందర్భంలో చేసుకోవాలో చాలావరకు తెలియడంలేదు. అటువంటి అంశాలన్నిటినీ పౌరాణిక, చారిత్రక, వైజ్ఞానికకోణాలలో విశ్లేషిస్తూ రచయిత ఈ గ్రంథంలోని వ్యాసాలను సులభమైనభాషలో అందరికీ అర్థమయ్యేలా వ్రాశారు. ఇవన్నీ అపూర్వమైనవిషయాలతో అమూల్యమైన మణులవంటివి కనుకనే రచయిత ఈ గ్రంథానికి '**మణికింకిణులు**' అని పేరుపెట్టారు. ఏది ఏమైనా పాఠకులు చదివి తెలుసుకొని ముందుతరాలకు అందించ యోగ్యమైన, అపూర్వమైన, హైందవసంస్కృతి సంప్రదాయాల వ్యాసలహరి ఈ '**మణికింకిణులు**'.

*– డా॥ నొస్సం నరసింహాచార్య*

అందించడానికి శ్రీరంగం తీసుకొని వెళ్ళారు. అక్కడ శ్రీరంగనాథుని సేవింపజేశారు. అదే తమ తాతగారు అయినటువంటి శ్రీమత్ నాథమునులవారు ఇవ్వమన్న నిధి అని చెప్పారు. అందుకు యామునాచార్యులవారు ఎంతగానో మురిసిపోయారు.

దేవాలయంలో రంగనాథునిదర్శనం అయినతరువాత, యామునాచార్యులు సన్యాసిగా మారి శరణాగతిని పొందారు. అక్కడే ఆయన చతుఃశ్లోకి, స్తోత్రరత్నాలను ఆశువుగా రచించారు. కొన్నాళ్ళకు తను చేయాల్సిన పనులు పూర్తికావడం లేదని కలతజెంది యామునాచార్యులు, రామానుజులకు కబురు పెట్టారు. దురదృష్టవశాత్తూ, ఆయన రాకముందే యామునాచార్యులవారు పరమపదించారు. అపుడు ఆయన మూడు చేతివేళ్ళు ముడిచి ఉండడం చూసి, రామానుజుడు తను చేయాల్సిన మూడు పనులేవో అర్థం చేసుకొన్నారు.

1) పరాశరుడిపేరు అర్హుడైనవానికిచ్చి, అతని పేరు చిరస్థాయిగా నిలపడం. 2)నమ్మాళ్వార్ రచించిన తిరువాయిమొళికి భాష్యం వ్రాయడం. 3)ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు టీకా వ్రాస్తానని ప్రతిజ్ఞ చేశారు.

శ్రీయామునులు వారి 125సంవత్సరాల జీవితకాలంలో రచించిన అద్భుతగ్రంథాలు– 1)స్తోత్రరత్నం 2)చతుఃశ్లోకి 3)ఆగమప్రామాణ్యం 4)సిద్ధిత్రయం 5)గీతాసంగ్రహం.

యామునాచార్యుని రచనలలో సిద్ధాంతపరంగా, దర్శనపరంగా అతి ముఖ్యమైనది సిద్ధిత్రయం. ఇందులో ఆత్మసిద్ధి, సంవిదసిద్ధి, ఈశ్వరసిద్ధి. ఈ మూడు విశిష్టాద్వైతంలోని ఆత్మకు, ప్రపంచానికి, పరమాత్మకు ఉన్న సంబంధాన్ని విశదీకరించేవి. యామునాచార్యునికి ముందు పాంచరాత్రఆగమాలు క్షుద్రమైనవని, వేదాలకు వ్యతిరేకమని ఇతరశాఖలవారు భావించేవారు.

ఆగమప్రామాణ్యంలో శ్రీవైష్ణవులకు ముఖ్యమైన గ్రంథాలైన పాంచరాత్రసాహిత్యంయొక్క పురాతనతను, పవిత్రతను బలంగా నొక్కిచెప్పే ప్రయత్నం చేశాడు. గీతార్థసంగ్రహంలో మోక్షసాధనలో భక్తిమార్గంయొక్క ప్రాముఖ్యతను ఉల్లేఖించారు.

చతుఃశ్లోకి– లక్ష్మీదేవిస్తోత్రం– స్తోత్రరత్నం– నారాయణునిస్తోత్రం తదనంతరం శ్రీయామునులవారి ఒరవడినే శ్రీభాష్యాదిగ్రంథాలు రచించి శ్రీమద్రామానుజులు విశిష్టాద్వైత ప్రవర్తకులైనారు.

*యామునాయ నమోనమః*



నీ ఎదురుగా నిల్చుని నీ ముఖం చూసి నీ గురించి మాట్లాడేవాడే నీ స్నేహితుడు

## పతంజలి యోగసూత్రములు



# సాధన

–శ్రీ జె.నరసింహారావు, 98857 04685

యోగము ఆధ్యాత్మికమార్గములద్వారా మాత్రమే మానవుడు భగవంతుని చేరగలుగుతున్నాడు. ఐతే మానవుడు తాను తరించడానికి కఠినమైన సాధనలుకూడా చేస్తూంటాడు. మానవజీవితలక్ష్యం పరమపదం చేరడం. ఎన్ని కఠినసాధనలు చేసినా భగవంతునిపైన అనన్యమైన భక్తి కలిగితే చాలా సులభంగా ముక్తి పొందవచ్చు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులైన అన్నమయ్య మరియు తరిగొండ వేంగమాంబలు అనన్యమైన భక్తితోనే భగవంతుని సాక్షాత్కారం పొంది ఆయన సాన్నిధ్యాన్ని పొందారు. మానవునికి త్యాగంతోనే యోగం లభిస్తుంది. నేను అనే అహం వదిలి సర్వం నీవే నాహం త్వమసి నేను కాదు నీవు అనే పరిపూర్ణవిశ్వాసంతో ఎవరు భగవంతుని శరణుకోరుతారో వారు భగవంతుని పరిపూర్ణంగా తెలుసుకొని స్వస్వరూపానందస్థితిని పొంది మోక్షాన్ని పొందుతారు.

ఎవరైతే అహం వదిలి భగవంతుని శరణు వేడుతాడో వాడికి మాయ అంటదు. వాడికి ఈ అశాశ్వత స్వల్పజీవితంపై ఆసక్తి కలుగదు. సుఖాలను అనుభవించాలనే వ్యర్థకోరికలు దూరమవుతాయి. ఎందుకనగా మానవుని పతనానికి కోరికలే ముఖ్యమైనవి. కోరికలకారణంగా మానవుడు దేహాన్ని ఆత్మను అంటిఉండే మాయను కనుగొనలేక పంది ఏ విధంగా బురదను ఇష్టపడుతుందో మానవుడుకూడా కోరికల వలలో చిక్కుకొని శలభంలాగా అందులోపడి తన పతనానికి తానే కారణమవు తున్నాడు.

కనబడే దృశ్యాలన్ని శాశ్వతమని తాను, తన శరీరం మాత్రమే శాశ్వతమని భావించి దేహాభిమానంతో మానవుడు మాయలోనే భ్రమించి మరణిస్తున్నాడు. వస్తువుయొక్క తత్త్వం (సత్యం) బాహ్యాలోకంలో (బహిరంగలోకమున) కానరాదు. అందుకు అంతరవలోకనం (ఆత్మ విచారం) ఆవశ్యకం. ఆత్మను సూచించటానికి ఇక్కడ ఉపయోగించబడిన శబ్దం మిక్కిలి భావపూర్ణమైనది. లోపలికి వెళ్లినవాడు మనలోగల అగాధ సత్యం హృదయకేంద్రం బహిర్గతమైన అన్నిటికి ఉత్పత్తిస్థానమన దగిన మూలగర్భం.

మనోబుద్ధులు, ఇంద్రియాలు మున్నగునవన్నీ దానినుండి వెడలిన కిరణాలవంటివే ఆ మధ్యగత సూర్యమండలం. "అల్పబుద్ధులు, మూఢులు, బాహ్యకామములననుసరిస్తూ మిక్కిలి వ్యాప్తి గల మృత్యుపాశంలో చిక్కుపడిపోతాడు. ఇందు ఆ పై భావమే అనిత్య వస్తుమయమైన ఈ బహ్యాలోకంలో నిత్యుని చూడటం, కనుక్కోవడం అసంభవం అనుభావమే స్పష్టపరచబడింది. నిత్యమైన పదార్థమందే నిత్యుని కోసం అన్వేషించాలి. మనకున్న నిత్యపదార్థం మనలో ఉండే 'ఆత్మ' ఒక్కటే.

శరీరం, మనస్సు, భావాలు, మనచుట్టూ కనిపించే ప్రపంచం ఇవి అన్నీ అనిత్యాలే. భగవంతు డొక్కడే సత్యము, నిత్యము. ఆయనే మానవునిలో మరియు చరాచరజీవులలో ఆత్మ అయి వెలుగొందు తున్నాడు. మానవుడు ఆత్మవిచారణచేసి సాధన (యోగం) ద్వారా భగవంతుని చేరుకోవచ్చు. దీనికి పతంజలిమహర్షియొక్క అష్టాంగయోగమార్గం ఎంతో ఉపకరిస్తుంది.

ధారావాహిక



# మేల్నాడు-రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

## సాలిగ్రామ (మిథిలా సాలగ్రామ) ప్రవేశం

జలక్రీడ ముగించుకుని ఉదయం 4.45 గంటలకు పుష్పకంలో బయలుదేరిన నారద, గంధర్వులు శ్రీక్షేత్రంలో దిగారు. దీన్నే సాలిగ్రామం అని పిలుస్తారు. దీన్ని నేపాళంలోని 108 దివ్యదేశాలలో ఒకటైన సాలగ్రామంగా పొరబడవద్దని మనవి.

అంత ఉదయాన్నే ఆలయభట్టర్ శ్రీ యాదగిరిభట్టర్‌ను, వారి సుపుత్రుడు శ్రీనివాసన్‌ను ఇబ్బందిపెట్టి నిద్రాభంగం చేయకూడదని నారదుడు తన దివ్యయాత్రికులబృందాన్ని ఏకాయెకి తానే సూక్ష్మశరీరాలతో యోగనరసింహసన్నిధిలోకి తోడ్కొనిపోయాడు. స్వామి దివ్యమంగళవిగ్రహానికి కర్పూరహారతి నిచ్చి స్తోత్రం చేశారు.

బయటికి వచ్చి జగన్మాత మహాలక్ష్మీతాయార్‌సన్నిధిలో తల్లినికూడా దర్శించి కర్పూరహారతినిచ్చి సేవించుకున్నారు. ఆ ఎదుటనే మరొక విశిష్టసన్నిధి ఉంది. ఆదిశేషువు మానవ దేహంతో భగవద్రామానుజాచార్యులుగా అవతరించిన గురు సన్నిధి. ఎంతో ఆనందంతో దర్శించుకుని బయటకు వచ్చి అర్ధ కిలోమీటరుదూరం నడిచి ఒక ఆలయానికి చేరుకున్నారు. అక్కడి విశేషాన్ని నారదుడు వివరిస్తూ అక్కడే రామానుజుల పాదచిహ్నమున్నదని, పక్కనే చిన్నఏరులా పారుతున్న ఆచార్యుల శ్రీపాదతీర్థమున్నదని తెలియజేశారు. ఆ దృశ్యం కన్నులకింపుగా ఉంది. గంధర్వుడు హాహాను నారదుడు తనకు ఆ తీర్థప్రాశస్త్యం చెప్పమని కోరగా హాహా తెలియదన్నాడు.

అలాగైతే ఆగుదాం. ఈ సన్నిధి తలుపులు తెరిచి ఉన్నాయి. భక్తజనులుకూడా కన్పిస్తున్నారు. చూడబోతే వీళ్లందరూ శ్రీకరస్వామి శిష్యబృందంలా ఉన్నారే. శ్రీకరస్వామి సుప్రసిద్ధులైన ఉపన్యాసకులు. జ్ఞాని. సత్పురుషులు. భారతదేశం నలుమూలలనుంచి కూడివచ్చిన శిష్యబృందానికి మార్గదర్శనం చేస్తూ 'జగదాచార్యులు రామానుజాచార్యుల మేల్నాడు అను యాత్ర' నిర్వహిస్తున్నారు.

మొదట మేల్కోటే దర్శించి, ఇక్కడ యోగనరసింహ స్వామిని, ఉడయవర్ల (రామానుజుల మరొక బిరుదం ఉడయ వర్) శ్రీపాదాన్ని దర్శించి శ్రీపాదతీర్థం సేవించటానికి వచ్చారు కాబోలు. ఇక్కడే ఒకపక్కగా నిలబడి యాదగిరిభట్టర్ ఈ పుణ్యస్థలిగురించి చెప్పేవిశేషాలు విందాం, రండి' అంటూ తన బృందాన్ని ఒకపక్కగా నిలబెట్టాడు.

'అన్నట్లు యతిరాజవైభవం అనే రామానుజచరిత్ర లిఖించిన మహానుభావుడు ఈ ప్రాంతంవాడే. అతడిగురించి కూడా భట్టర్ చక్కగా వివరిస్తాడు సుమా' అంటూ తమ సూక్ష్మశరీరాలతో అందరూ చుట్టూ పరికిస్తూ అక్కడే వారగా నిలబడ్డారు. అందరూ బయలుదేరగానే తామూ వెనకే నడిచి శ్రీపాదతీర్థసన్నిధికి చేరుకున్నారు.

యాదగిరిభట్టర్ భక్తబృందానికి స్థలపురాణం విపులీ కరిస్తూ అధిష్ఠానదైవమైన యోగనరసింహమూర్తిని గౌతమ మహర్షి ప్రతిష్ఠించాడని ఐతిహ్యం చెప్పుకొచ్చాడు. తరువాతి కాలంలో యోగనరసింహస్వామి రామానుజాచార్యులకు స్వప్న

దర్శనమిచ్చి తనక్షేత్రాన్ని దర్శించవలసిందని ఆదేశించారని చెబుతూ, దుష్టుడైన కుళోత్తుంగ (క్రిమికంఠ) చోళరాజు రామానుజులను తుదముట్టించాలని ప్రయత్నిస్తుంటే ఆయన ప్రియశిష్యుడైన శ్రీ కూరత్తాళ్వాన్ మహోన్నతత్యాగంవల్ల ఆ మహావిపత్తు తప్పిపోయిందని, ఆచార్యసార్వభౌముల ప్రాణాలు నిలపటానికి తన నేత్రాలను కోల్పోయిన అపరిమిత త్యాగధనుడు, ఉత్తమోత్తమశిష్యుడు కూరత్తాళ్వాన్.

'మనలో కొందరు సందేహమనస్కులు రామానుజులు సాక్షాత్ ఆదిశేషుల అవతారం కదా, మానవమాత్రుడైన దుష్టుడు చోళరాజును అంతమొందించవచ్చు కదా, తానుకూడా సామాన్యుడిలాగా ఈతిబాధలు అనుభవించటమెందుకని ప్రశ్నించవచ్చు. మానవమాత్రుని అవతారంలో, మానవమాత్రుని సాధక బాధకాలే అనుభవించి, ఆధ్యాత్మికసాధనతో దైవకార్యాన్ని సానుకూలం చెయ్యటమే ఆచార్యుల అవతారరహస్యం. అలా వారు మానవజన్మక్లేశం అనుభవించబట్టే కదా తరువాతి తరాల వారికి మేల్కోటె తిరునారాయణస్వామి, చెళ్లపిళ్లాయ్ దక్కింది.

క్షేత్రానికి తిరిగి వద్దాం. దీన్ని 'శాల్లపురి' అనికూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడ అతిశ్రేష్ఠమైన వరిధాన్యం పండుతుంది. దీన్ని 'శాల్ల' అంటారు. ఇక్కడి ప్రశాంతతకు ప్రసన్నులైన రామానుజులు మొదట్లో ఇక్కడే నివాసం ఏర్పరచుకుందామనుకుంటే, ఇక్కడ నివసించే కొందరు భేదభావంతో వారిపట్ల నిర్దయగా ప్రవర్తించారు.

\- - - - - - -

ఒకనాడు రామానుజులు తన ప్రధానశిష్యుడు ముదలియాణ్డాన్ చెవిలో మంత్రోపదేశం చేసి అతడిని అక్కడ ప్రవహించే కావేరీస్నానఘట్టంలో కాళ్ళుకడుక్కుని రమ్మని ఆదేశించారు. ఆయన అలా చేసినతరువాత అక్కడ స్నానఘట్టంలో స్నానమాచరించిన గ్రామస్థులు ముదలియాణ్డాన్‌ను ఆదరంగా పలకరించి ఆచార్యవర్యుల యోగక్షేమాలు విచారించారు. వెంటనే అందరూ గుంపుగా రామానుజాచార్యుల సమక్షానికి చేరుకొని ప్రణమిల్లి తమకు సంసారసాగరంనుండి విముక్తి ప్రసాదించుమని ప్రార్థించారు.

అపారకరుణామూర్తి ఆచార్యసార్వభౌములు వచ్చిన వారిని ఆదరించి, వారి మనోరథం అనుసరించి వారికి శాస్త్రోక్తంగా పంచసంస్కారాలు జరిపి శ్రీవైష్ణవులుగా దాసనామాలను ప్రదానం చేశారు. ఈ బృహత్కార్యం స్మృతిలో ఆ ప్రదేశంలో ఆచార్యపాదుకలతో సన్నిధి, ఒక తటాకం వెలిశాయి. ఇదే ఆ పుణ్యస్థలి. ఇక్కడే వెయ్యేళ్ళక్రితం నేను వివరించిన ఉదంతం జరిగింది. రామానుజులరాక, నివాసం, వారిఉనికి గుర్తుగా ఈ పవిత్రసన్నిధి ఏర్పడినవైనం ఇది' అంటూ ముగించాడు యాదగిరిభట్టర్.

## వడుగనంబి

ఇంతవరకు యాదగిరిభట్టర్ చెప్పిన తరువాత శ్రీకరస్వామి అందుకుని తనబృందంలో వచ్చిన పరభాషా శిష్యుల కోసం స్పష్టమైన ఆంగ్లంలో చక్కని, చిన్న ఉపన్యాసం చేశాడు.

'శ్రీ నంబూరి కేశవాచార్యులనే స్థానిక అర్చకుడు యతిరాజు రామానుజాచార్యుల శ్రీచరణాలను ఆశ్రయించాడు. ఆచార్యులు కేశవాచార్యునికి 'ఆంధ్రపూర్ణ' అనే దాసనామం అనుగ్రహించారు. ఎందుకంటే ఇతడి పరంపరవారంతా ఆంధ్రదేశస్థులు. ఆంధ్రాపూర్ణునికి 'వడుగనంబి' అనేది ఆత్మీయనామం.

మధురకవి ఆళ్వారులకు నమ్మాళ్వార్ ఎటువంటివారో వడుగనంబికి రామానుజులు అటువంటివారు. ఒకసారి ఎమ్బెరుమానార్ (రామానుజుల మరొక బిరుదు) శరణుజొచ్చిన వడుగనంబి కడదాకా వారిని విడువలేదు. నంబి ఆచార్యనిష్ఠ అనుపమానం.

*(ఇంకా ఉంది)*

## 2024, ఆగష్టునెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 08 | నాగచతుర్థి |
| 09 | గరుడపంచమి |
| 13 | తరిగొండవెంగమాంబ వర్ధంతి |
| 15-17 | తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం |
| 15 | భారతస్వాతంత్ర్యదినోత్సవం |
| 16 | శ్రీవరలక్ష్మీవ్రతం |
| 19 | శ్రావణపూర్ణిమ, శ్రీహయగ్రీవజయంతి<br>శ్రీవిఖనసమహామునిజయంతి |
| 20 | గాయత్రీజపం |
| 26 | శ్రీకృష్ణాష్టమి |
| 27 | గోకులాష్టమి |

కళలు




# సిద్ధేంద్రయోగి

**- శ్రీ యస్. తులసీరామ్**

తెలుగునాడులో అతి ప్రాచీనమైన ప్రసిద్ధనాట్యం కూచిపూడి. ఈ కూచిపూడినాట్యానికి మూలపురుషుడు సిద్ధేంద్రయోగి. కూచిపూడి బ్రాహ్మణభాగవతులు ఈ నాట్యాన్ని ప్రచారంలోకి తెచ్చారు కాబట్టి ఈ నాట్యానికి కూచిపూడి అనే పేరు ప్రసిద్ధికెక్కింది. దీనికి కారణం సిద్ధేంద్రయోగి కూచిపూడి నివాసి కావడమే. వీరి నాట్యాల్లో భామాకలాపం ప్రసిద్ధికెక్కింది. భామాకలాపాన్ని రచించి, నటింపజేసి ప్రచారంలోనికి తెచ్చిన మహనీయుడు. సంగీత, సాహిత్య, అభినయవేత్త. ఈ కూచిపూడినృత్యం 16వ శతాబ్దంతరువాతనే ప్రసిద్ధిలోనికి వచ్చింది.

కూచిపూడి సమీపంలో కృష్ణానది ఉత్తరపుఒడ్డున ప్రసిద్ధ శ్రీకాకుళమున్నది. ఆంధ్రశాతవాహనచక్రవర్తులకు ఇది పూర్వ రాజధాని. ఇక్కడ శ్రీమహావిష్ణుదేవాలయం ఉన్నది. ఆ ప్రాంతంలో శ్రీకృష్ణభక్తి బహుళప్రచారంలో ఉండేది. అందు అనాథయైన పదిపన్నెండేళ్ళ సిద్ధప్ప అనే బాలుడొకడు ఆశ్రమంలో ఉండేవాడు. ఆ బాలుడు నిత్యమూ 'కృష్ణ' శబ్దాన్నే ఉచ్చరిస్తూండేవాడు. అలా ఒక బీదబ్రాహ్మణుడు దయతలచి ఆ బాలునికి ఉపనయనం గావించి, అలాగే తన కుమార్తెనిచ్చి వివాహంకూడా చేశాడు. ఐనా సిద్ధప్ప తనకు వివాహం జరిగిన సంగతికూడా మరచేవాడు.

కొంతకాలం తరువాత అత్తిల్లువదలి ఉడిపి ఆనంద తీర్థులవారు శ్రీకాకుళంలో నెలకొల్పిన మఠంచేరుకుని చదువు సంధ్యలు నేర్చుకొన్నాడు. ఒకనాటిరాత్రి కృష్ణా కృష్ణా అంటూ తన్మయుడై నృత్యం చేస్తూండగా, మఠాధిపతి అదిచూచి అతని ప్రతిభకు మెచ్చి అతణ్ణి ఉడిపికి పంపించాడు. అలా ఉడిపికి చేరుకున్న సిద్ధప్ప మఠాధిపతుల మన్ననలకు పాత్రుడై, కఠోరమైన ఆశ్రమనియమాలను పాటిస్తూ, గురుశుశ్రూషచేసి సంగీతమూ, నృత్యమూ, శాస్త్రపాండిత్యమూ గడించి నిష్ణాతుడయ్యాడు. దానికి తోడు కమ్మనికంఠమూ, సన్ననిశరీరమూ, అవయవసౌష్ఠవము ఉన్న సిద్ధప్ప అద్భుతంగా నృత్యం చేసేవాడు. అలా సిద్ధప్ప సిద్ధశాస్త్రి అయ్యాడు. ఆ తరువాత అతనిలో మానసికమార్పు కలిగి, గతం గుర్తుకురాగా, గురువుల ఆశీర్వాదం తీసుకొని స్వస్థలమైన శ్రీకాకుళం బయలుదేరాడు. ఆ కోవలో అవతలి ఒడ్డునున్న శ్రీకాకుళం చేరడానికి కృష్ణానది దాటాల్సి వచ్చింది. ఆ సమయంలో కృష్ణానది ఉధృతంగా పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తోంది. ఆ సమయంలో నదిదాటడం కష్టంకాగా ఆప ద్ధర్మంగా సన్యాసం పుచ్చుకున్నాడు. ఆ తరువాత స్పృహ నుంచితేరుకొని అత్తగారిల్లు చేరుకున్నాడు కానీ అతనిభార్య అతనిలో సన్యాసిని చూచింది. అప్పుడతడు నిజంగానే అందరి అనుమతిని పొంది సన్యాసం స్వీకరించాడు. అలా సిద్ధప్ప సిద్ధశాస్త్రి అయి ఆ తరువాత సిద్ధేంద్రయోగిగా మారిపోయాడు. ఆ తరువాత భామాకలాపం రచించి కూచిపూడినృత్యానికి మూల పురుషుడయ్యాడు.

సిద్ధేంద్రయోగి తన పాండిత్యప్రతిభతో భామాకలాపం రచన చేశాడు. కాని దాన్నెలా ప్రయోగించాలా అని పలు మార్గాలు ఆలోచించి, భామాకలాపంలోని పాత్రలైన సత్యభామ, శ్రీకృష్ణుడు, చెలికత్తె మాధవి పాత్రలు ధరించి చక్కగా అభి నయించగల వ్యక్తులకొరకు తీవ్ర అన్వేషణ చేసి ఎట్టకేలకు అందుకు తగినవారు తారసపడగా, వారి తల్లిదండ్రుల అనుమతితో భగవంతుని సన్నిధానంలో కూచిపూడి బాలురకు నృత్యశిక్షణను ప్రారంభించాడు. అదే కూచిపూడినాట్యకళకు నాంది జరిగిన శుభదినం. ఆ విధంగా సిద్ధేంద్రునిప్రేరణలో కూచిపూడివారు నర్తకులైనారు. దాంతో ఈ కూచిపూడినృత్యం తెలుగువారిసొత్తు అని స్పష్టమౌతోంది. అందు నటించిన నర్తకుల బహిష్కరణకు తావుండకూడదనీ, కూచిపూడినాట్యం అభివృద్ధి చెందాలనీ తలచి, శృంగేరిపీఠాధిపతుల ఆదేశం సంపాదించి, కూచిపూడిబ్రాహ్మణులనుంచి వాగ్దానంకూడా పొందాడు. అందు కూచిపూడిలో పుట్టిన ప్రతి మగపిల్లవానికి సిద్ధేంద్రునిపేరుచెప్పి, ముక్కుకుట్టి, కాలికి గజ్జె కట్టించాలనీ, ఆ పిల్లవాడు పెద్దవాడ య్యాక ఏ వృత్తిని అవలంబించినా స్వామిసన్నిధిలో భామవేషం ధరించి తీరాలనీ, స్త్రీలకు ఈ కళలో ప్రవేశం ఉండరాదనీ సిద్ధేంద్రుడు శాసించాడు. ఆ ప్రకారంగానే ఈనాటికీ కూచిపూడివారు ఈ నియమాన్ని విధిగా భక్తిశ్రద్ధలతో పాటిస్తు

న్నారు. సిద్ధేంద్రుడు బ్రాహ్మణబాలురకే కూచిపూడినాట్యము పరిమితమని శాసించినా, నేడు ఎందరో స్త్రీలుకూడా ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కానీ వీరి ప్రదర్శనలో తేడా ఉన్నదని విజ్ఞులభావన.

సిద్ధేంద్రయోగి అపూర్వసృష్టి భామాకలాపం. భామా కలాపంలో నృత్యము, సంగీతము ప్రాధాన్యం వహిస్తాయి. ఇందులో ప్రధానంగా నాయిక సత్యభామ, నాయకుడు కృష్ణుడు, చెలికత్తె మాధవి అనే మూడు ముఖ్యపాత్రలుంటాయి. ఇంత తక్కువపాత్రలతో భామాకలాపరచన సిద్ధేంద్రుడు చేయడానికి జయదేవుని గీతగోవిందమే ఆదర్శమై ఉండొచ్చు. కలాపమంటే కలత, కలహము అని అర్థం. సొద వెళ్ళబోసుకోవడమని అర్థం. ఈ భామాకలాపంలో పై మూడర్థాలు సమన్వయిస్తాయి. సిద్ధేంద్రుని భామాకలాపం 'విఘ్నేశ్వరస్తుతి'. శ్రీవిఘ్నేశ్వర పాద పద్మములనే సేవించి నాయాత్మలో అని ప్రారంభమౌతుంది. ఆ వెనుక సరస్వతీప్రార్థన ఉంటుంది. వెన్నెలపదం పాడుతూ సత్య భామ ప్రవేశించడంతో కథ ప్రారంభమౌతుంది. నీవెవరివని చెలికత్తె అడుగుతుంది. అప్పుడు సత్యభామ "భామనే సత్యభామనే భామలో శృంగార జగదభిరామనే ముఖవిజిత హేమా ధీరునే ద్వారకాపురాధ్యురామనే వయ్యారిసత్యా"– అనే దరువును పాడుతుంది.





ఆ వెనుక అత్తమామల ప్రశస్తి చెప్పి సత్యభామ హరిఏడే అని దరువు పాడిన తరువాత భూదేవిని స్తుతిస్తుంది. తరువాత దరువు, వెన్నెలపదము, మరికొన్ని దరువులు శ్రీకృష్ణునితో కలసి పాడుతుంది. ఈ సందర్భంలోనే దశావతార పదము వర్ణన సంవాదాత్మకంగా కొనసాగుతుంది. ఈ భామా కలాపం "నారాయణాచ్యుతానంద కృష్ణముకుందా కందర్పజనక మంగళము నీకు" అనే మంగళహారతితో ముగుస్తుంది.

సిద్ధేంద్రుడు తన భామాకలాపంలో కృష్ణుని ఎడబాటుకై సత్యభామ పొందే విరహము, సత్యభామ, కృష్ణుల కలయిక ప్రముఖంగా రచించి సంగీత, సాహిత్య, అభినయాలు సమ్మేళన పరిచినాడు. ప్రజాసముదాయంకోసం మానవస్వభావాన్ని చిత్రిస్తూ మధురోక్తులతో సత్యభామకు శ్రీకృష్ణపరమాత్మపై మధురభక్తిని చిత్రించి తరించాడు. ప్రసిద్ధయోగి, సిద్ధుడు, వాగ్గేయకారుడు, అభినయవేత్తయైన సిద్ధేంద్రుడు కూచిపూడి భాగవతసంప్రదాయాన్ని ప్రతిష్ఠాపించిన మహనీయుడు.

ఆ విధంగా సిద్ధేంద్రయోగి రచించిన భామాకలాపము మనదేశంలోనేకాక అంతర్జాతీయంగాకూడా అన్ని నృత్య సంప్ర దాయాలకు చెందిన కళాకారులచే ఆరాధించబడుతున్నది. సుమారు నాలుగైదువందలసంవత్సరాలక్రితం ఆరంభమైన ఈ కలాపకేళిక ప్రస్తుతం మూడురీతులుగా ప్రవర్తిల్లుతూంది. కానీ కాలక్రమేణా సిద్ధేంద్రయోగి భామాకలాపం మానవ స్వభావాన్ననుసరించి తరువాతకాలంలో వెర్రితలలు వేసిందనే చెప్పొచ్చు.

సిద్ధేంద్రయోగి జీవితంలో సన్యసించినా నృత్యవిద్యా సన్యాసం చెయ్యలేదు. కూచిపూడిభాగవతులకు కూచిపూడి నాట్యాన్ని వరంగా ప్రసాదించి వెళ్ళాడు. ఆ మహానుభావుని పాండిత్యప్రతిభలమూలంగానే కూచిపూడినాట్యం ఈనాటికీ బతికిబట్టకట్టి ఉన్నది. సిద్ధేంద్రయోగి ప్రారంభించిన కూచిపూడి నాట్యంమీది గౌరవాన్ని పురస్కరించుకొని ఆంధ్రులసొత్తయిన కూచిపూడినాట్యాన్ని బ్రతికించుకోవడంకోసం కూచిపూడి గ్రామంలో 'సిద్ధేంద్ర కళాక్షేతము' అనే నృత్యకళాశాలను 1963వ సం॥లో స్థాపించి సిద్ధేంద్రయోగిపైగల భక్తిప్రపత్తులను చాటు కున్నారు.

ఆ విధంగా 'సిద్ధేంద్రయోగి–కూచిపూడినాట్యభోగి'గా ఆంధ్రులందరికీ చిరస్మరణీయుడుగా నిలిచిపోయాడు.

## శ్రీవేంకటేశ్వరలీలలు



# బంగారుస్వామి

– శ్రీమతి పి.పద్మజా రామకృష్ణ

పొన్నూరులో మాబావగారు హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్న రోజులవి. అక్క, బావగారు, వారి అమ్మాయి దివ్యతో సహా తిరుమల వెళుతూ నన్నుకూడా రమ్మన్నారు. దివ్య బంగారువాచీ ఒక చిన్న స్టీల్‌మగ్గులోకి సర్ది, ఆ మగ్గుని బ్యాగులో బట్టలక్రింద పెట్టింది అక్క. ఆనందంగా తిరుమల చేరుకుని భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుని, రూముకి వెళ్ళాం. "త్వరగా బ్యాగులు సర్దుకోండి మనకు రైలు టైము అవుతుంది" అన్నారు బావగారు. బ్యాగులో బట్టలు సర్దుతూ, బంగారువాచీ ఉన్న మగ్గుని తీసింది అక్క, వాచీ కనిపించలేదు. ఒక్కసారిగా అక్కముఖంలో భయం స్పష్టంగా కనిపించింది నాకు. "పద్దూ! దివ్య వాచీ ఈ మగ్గులోనే పెట్టాను, ఏమైందో?"అంటూ, కంగారుపడుతూ బ్యాగులో సర్దిన బట్టలన్నీ బయటకి తీసి మరలా ఒక్కొక్కటిగా దులుపుతూ, "రైలు టైము అవుతుంది నువ్వుకూడా వెతుకు పద్దూ" అంది అక్క. నేనుకూడా ఒక్కొక్కటిగా బట్టలు మడతలు విప్పి మరీ చూశాను. రూములో మంచాలక్రింద వెతికినా.. ఒకటికి రెండు సార్లు సర్దినా వాచీ మాత్రం కనిపించలేదు. వాచీపోయిందని నిర్ధారణ చేసుకుని ఉసూరుమంటూ రైల్వేస్టేషన్‌కి బయలుదేరాం.

తిరుమల వెళ్ళే కొన్నినెలలముందు, అక్క మాఇంటికి రావడానికి బస్టాండులో బస్ ఎక్కే క్రమంలో అక్క హ్యాండ్ బ్యాగులో ఉన్న దివ్య బంగారువస్తువులు పెట్టిన బాక్సు ఎవరో అపహరించారు. అప్పుడుకూడా చాలా భయపడింది అక్క. పుట్టింటికి వెళుతుంటే బంగారంపోయిందని చెబితే, అత్తగారి తరపువారు ఎవరైనా నమ్ముతారా? అత్తింటివారు పుట్టింటిపై లేనిపోని నిందలు వేస్తారేమో? అని చాలా బాధపడింది అక్క.

వస్తువులు పోయాయని అందరం బాధపడుతుంటే, బావగారు మాతో ఒకమాట అన్నారు. "మన వస్తువులు అయితే తిరిగి మనకు దక్కుతాయి, లేదంటే ఆ వస్తువులు మనవి కాదని అర్థం" అన్నారు. బావగారి మంచితనంతో అక్కకూ, మాకుకూడా కాస్తంత అప్పటికి ఉపశమనం కలిగినా, పోయిన బంగారం కళ్ళలో మెదులుతూ గుర్తుకు వచ్చిన ప్రతిసారీ చెప్ప లేనంత బాధ మెలిపెడుతూనే ఉంది అప్పటికింకా!

మరలా ఇప్పుడు దివ్యవాచీ పోయిందని బావగారికి ఎలా చెప్పాలో మాకు అర్థం కాలేదు. ఇంటికి వెళ్ళాక బావ గారికి నిదానంగా చెప్పాలి అనుకున్నాం. ఎంతో సంతోషంగా తిరుమల వెళ్ళిన మేము, నిరాశగా ఇల్లు చేరాం. మా భోజనాలు అయ్యాక బ్యాగులో బట్టలు తీస్తూ, మగ్గు బయటకు తీసింది అక్క.. అంతే ఒక్కసారిగా "పద్దూ...!" అని అరిచింది. సంబరమాశ్చర్యాలతో మా ఇద్దరికళ్ళు మెరిసిపోయాయి. మగ్గు తలక్రిందులు చేసి దులిపినా కనిపించని వాచీ, ఇంటికి వచ్చి చూసేసరికి వాచీ మగ్గులోనే భద్రంగా ఉంది. ఇదంతా శ్రీనివాసునిమాహాత్మ్యమని మాకు అర్థమయ్యింది! ఆ స్వామిని నమ్మినవారి నమ్మకాన్ని, ఎన్నడూ వమ్ము చేయడనే నిదర్శనం మాకు ఇలా చూపించాడు. స్వామి నామాన్ని స్మరిస్తూ మా మనసులు భక్తిభావంతో నిండిపోయాయి.

### గురుగ్రహస్తోత్రం

**దేవానాం చ ఋషీణాం చ।**
**గురు కాంచనసన్నిభం।**
**బుద్ధిమంతం త్రిలోకేశం।**
**తం నమామి బృహస్పతిం॥**



బాలనీతి

# బుద్ధి వచ్చింది

– శ్రీమతి ఆసూరి ఉషారాణి,
94416 46016

అప్పుడే రెక్కలు వచ్చిన పక్షి గింగిరాలు తిరుగుతూ గెంతుతోంది. “అమ్మా! ఇలా చూడు నేనెలా ఎగురుతున్నానో అః అః” అంటూ వాళ్ళఅమ్మవెనుకే తిరుగుతోంది. అందుకు “ఇక చాల్లే ఆపు, ఊరికే తిరగొద్దు. దిష్టి తగిలేను. పక్షులు ఎలా నీవైపే చూస్తున్నాయో చూడు అంది తల్లిపక్షి”. “దిష్టి అంటే ఏమిటే అమ్మా?” అంది అమాయకంగా. “దిష్టి అంటే.. అబ్బో ఎంత బాగా ఎగురుతోందో అని కళ్ళు పెద్దవిగా చేసి అందరూ నీవైపు చూడడం.” అంది. “చూస్తే చూడని అః అః” అంది పిల్లపక్షి. గుంపులుగుంపులుగా పక్షులుపోతూంటే దానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంది. తానుకూడా అలా వారితో వెళ్ళాలని తనకు అనిపించింది. దానికి తల్లిని అడిగింది. ‘వారితో పోవద్దు’ అంది తల్లిపక్షి.

“పోతే ఏం?” అంది కోపంగా. ఆ గుంపులో పక్షులన్నీ ఇండ్లపైకి వాలడం, సెల్‌ఫోన్‌టవర్లపైకి ఎక్కి కూర్చుంటాయి. పనికిమాలినకబుర్లు ఆడుతుంటాయి. ఆహారంకోసం ఆలోచించవు” అంది తల్లిపక్షి.

“సెల్‌ఫోన్‌టవర్ అంటే” అడిగింది పిల్లపక్షి “అదే మానవులు ఎప్పుడు చెవిముందర పెట్టుకొని మాట్లాడుతుంటారే దానినే ఇప్పుడు ఫోన్ అంటారు. అ ఫోన్‌మాటలు వినపడాలంటే అల్యూమినియం, రాగి తదితరలోహాలతో పొడవుగా నిలబెట్టి



ఉంచుతారు. వాటినుండివచ్చే వేడి మనం భరించలేక బలహీను లవుతాం. అదే పచ్చటిచెట్లపైన వాలి మనం కూర్చుంటే మన ఆరోగ్యానికి ఎంతో మంచిది తెలుసా? చెట్లనుంచి వచ్చే గాలి మనకు జీవం. చెప్పేది విను. అటువైపుకు వెళ్ళకు” అంది. సరేనంది పిల్లపక్షి.

ఓ రోజు అమ్మ ఆహారానికి వెళ్లింది. అలా తల పైకెత్తి చూసింది. పక్షులగుంపు అ సెల్‌ఫోన్‌టవర్‌వైపుకు వెళ్తున్నాయి. ఎప్పుడు ఆ చెట్లపైనేనా? ఇలా మాలా పైకి ఇంకా పైకి అలా ఆకాశంలో వెళుతుంటే ఎంత బాగుంటుందో తెలుసా! మీ అమ్మ లేదుగా. ఒక్కసారి ఇలారా ఏం కాదు అని పిలిచాయి కొన్ని పక్షులు. ఒక్కసారి వెళితే ఏమ్ పోయింది అంటూ వాటితోపాటు వెళ్ళింది పిల్లపక్షి.. అలా గాలిలో ఎగురుతుంటే తేలిపోయి నట్టుంది. అందరితో చక్కగా కబుర్లాడుకుంటూ నవ్వుకుంటూ పోతుంటే ఎంతో సంతోషంగా ఉంది. ఇంత హాయిగా ఉంటే అమ్మ ఎందుకు అలా అంది. పైగా కబుర్లాడుతుంటే ఎన్నో విషయాలు తెలిశాయి తనకు. ఆ టవర్‌పై కూర్చొని అలా పట్టణసోయగం చూస్తుంటే ప్రపంచాన్ని జయించినట్టుంది తనకి. కాని తాను కూర్చున్నచోట ఏదో వేడిగా ఉంది. ఆ నొప్పితో ఎగరలేకపోయింది. ఏడుస్తూ కూర్చుంది. అమ్మ పిల్లపక్షిని గదమాయించి అడిగేసరికి అంతా చెప్పింది పిల్లపక్షి తల్లిపక్షితో.

హాయిగా చక్కటిగాలి ఇస్తున్న ఈ చెట్టును వదలి అలా ఎండకి ఎండి, వానకి తడిచి... ఇదంతా అవసరమా? అని తల్లి చెప్పే మాటలు విని ‘బుద్ధి వచ్చింది’ అమ్మా ఇంకెప్పుడు అలా వెళ్ళను అని తల్లితో అనేసరికి తన పిల్లకి తన ముక్కుతో ముద్దులు పెట్టింది తల్లిపక్షి. ఆ నొప్పి అంతామాయం అయ్యింది పిల్లపక్షికి.

***నీతి: ‘తల్లి’ యే కదా పిల్లలకు తొలిగురువు. కాబట్టి, తల్లి ఏం చెబితే అది వినాలి. దానినే ఆచరించాలి. అదే మనం తల్లికిచ్చే గౌరవం.***

భాస్కరశతకం

# నిదానమే ప్రధానం

– శ్రీ అనంతాత్మకుల రంగారావు, 79894 62679

**తాలిమి తోడుతం దగవు తప్పక నేర్వరి యొప్పుదవ్వలం**
**బాలన సేయుగాకటం నుపాయహీనుడు సేయనేర్చునే!**
**పాలను నీరు వేరు పరుపంగ మరాళ మెరుంగు గాక మా**
**ర్జాల మెరుంగునే తదురుచారు రసజ్ఞత బూన భాస్కరా !!**

అంటే వివేకవంతుడు పనిచేసే ముందు ఓర్పుతో, మంచి చెడ్డలు గ్రహించి, నిర్ణయం తీసుకుని వెడతాడు. ఎలాగంటే పాలను, నీరును వేరుచేసే శక్తి హంసకు మాత్రమే ఉంది. పిల్లికి అటువంటి శక్తిలేదు కదా. అందుకే వివేకవంతుడు ఆలోచిస్తాడు. అవివేకుడు ఆలోచనారహితంగా ముందుకు వెడతాడు అని. అలాంటి ఒక ఉపాఖ్యానం మహాభారతంలో ఉంది. అది:

మేధాతిథి అనే మహర్షికి ఒక పుత్రుడు ఉన్నాడు. అతను ఎవరు ఏ పనిచెప్పినా తొందరపడి చేయడు. చక్కగా, ధర్మబద్ధంగా వివేకంతో ఆలోచించిన పిమ్మటే ఆ పని నెరవేరుస్తాడు. అందువల్ల ప్రజలందరూ అతణ్ణి "చిరకారి" అని పిలుస్తారు. చిరకారి తండ్రి మేధాతిథి ఒకకారణాన భార్యపై కోపగించి, కొడుకును పిలిచి, "నేను తిరిగివచ్చేలోగా మీ అమ్మను సంహరించుమని ఆజ్ఞ చేసి వెళ్ళిపోయాడు. మహర్షి కుమారుడు చిరకారి తాను చేసే పనులు అన్నీ నిదానంగా ఆలోచించి చేసేవాడు కదా! అందువల్ల తను ఇలా ఆలోచించాడు. మా తండ్రి ఆజ్ఞను పాటించకుండా ఉండటానికి వీలుకాదు. అలాగని, తల్లిని చంపడం కూడా యుక్తం కాదు. కన్నతల్లిని ఏవిధంగానైనా కాపాడాలి. ఒకవిధంగాచూస్తే తల్లిదండ్రులమధ్య ఈ పుత్రత్వం అనేది స్వేచ్ఛ లేకుండా ఉంది.

ఈ క్లిష్టపరిస్థితుల్లో ఈ ఇరువురిలో ఎవరిని వదిలిపెట్టాలి? తపస్సు, ధర్మం, దైవం ఇవన్నీ తండ్రియే. అందువల్ల తండ్రికి ప్రీతి కలిగించేటట్లు నెరవేరిస్తే దేవతలు అందరూ ప్రీతి పొందుతారు. చేతులు, కాళ్ళు, కళ్ళు మొదలైన అంగాలతో కూడిన ఈ శరీరం తల్లినుండే జనిస్తుంది. తన బాగోగులు చూసుకోకుండా గర్భధారణక్లేశం భరిస్తూ, బిడ్డకై తల్లిపడే కష్టాలు వర్ణనాతీతం. ధర్మశాస్త్రాలుకూడా తండ్రికంటే తల్లి గొప్పది అని చెప్తున్నాయి. "తల్లి" అనబడే రూపమే లోకానికంతటికీ మూలకారణం. ఎవడికి తల్లితో ఎప్పుడు వియోగం కలుగుతుందో వాడు అప్పుడే అన్నివిధాలా అశక్తుడౌతాడు. చిరకారి ఇలా బహువిధాలుగ ఆలోచించి చింతనలో ఉండగా...

చిరకారి తండ్రి మేధాతిథి మనసు బాధపడి, నేను అజ్ఞానంతో, క్రోధంతో క్రూరుడనై భార్యను చంపమని పుత్రుణ్ణి ఆజ్ఞాపించి వచ్చాను. వాడు ఏంచేశాడో? అయినా వాడు బాగా ఆలోచించే నిర్ణయం తీసుకొంటాడు అని దుఃఖిస్తూ వడివడిగా ఇంటికి తిరిగి వచ్చాడు. కుమారునితో– "కుమారా! నీవు చాలా కాలం నీ తల్లిగర్భంలో ఉన్నావు. నీ ఆలనా పాలనా అంతా నీ తల్లే చూసింది. నిన్ను మంచిమార్గంలో నడిపించింది. నేను కోపావేశంతో అధర్మకార్యానికి నిన్ను ఆజ్ఞాపించాను. నీవు నీ తల్లి చేసిన సేవలు తలచుకొన్నావంటే "చిరకారి" అనే పేరు సార్థకమవుతుంది. బాబూ! నేను ఇంతకాలం చేసిన తపస్సుకు నింద కలగకుండా, నా పుత్రుడవైనందుకు తల్లిని సంహరించకుండా, నాకు పాపభీతి అంటకుండా ధర్మాన్ని ప్రీతితో నెరవేర్చావు అని పలుకగానే కొడుకు, తల్లికూడా మేధాతిథి పాదాలకు నమస్కరించారు. అందుకే అంటారు ఒక కార్యం చేయవలసిన సందర్భంలో బాగా ఆలోచించి పనులు చేసేవాడిని "ఆర్యుడు" అని తొందరపడి చేసేవాడిని "అనార్యుడు" అని అంటారు. మనం ఆర్యులమవుదామా? అనార్యులమవుదామా? నిర్ణయం మన చేతుల్లోనే ఉంది సుమా!



# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** బంధుమిత్రులతో సత్సంబంధాలు. విద్యా విషయాలకు ప్రభుత్వసహాయం లభిస్తుంది. విద్యా సముపార్జన చేసి ముందంజ వేస్తారు. ఉద్యోగ వృత్తివ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.



**వృషభం–** ఇతరులతో సమస్యలను కొని తెచ్చుకొంటారు. కాంతిసంబంధచికిత్సలు చేయించుకోవాల్సి వస్తుంది. తండ్రితో సత్సంబంధాలుంటాయి. ప్రయాణాలు కలిసివస్తాయి.



**మిథునం–**ఆరోగ్యవిషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. గుండె, రక్తపోటు, తలనొప్పి మరియు కళ్లకు సంబంధించిన సమస్యలొస్తాయి.కోపాన్ని మరియు చికాకును అదుపులో ఉంచుకోవాలి. ఆర్థికఅడ్డంకులు ఎదురవుతాయి.



**కర్కాటకం–** సీనియర్లతో సమస్యలను ఎదుర్కొనుటకు సహనంగా ఉండాలి. ఆరోగ్యంపట్లకూడా శ్రద్ధ అవసరం.



**సింహం–**అన్నిరకాల వృత్తులవారికి అధికాదాయం. యత్నకార్యసిద్ధి. ఆరోగ్యం మెరుగవుతుంది. మనసు ఉల్లాసంగా ఉంటుంది. భూమి గృహ స్థిరాస్తులను కూడబెట్టే అవకాశముంటుంది.



**కన్య–**సంపద మరియు కీర్తి పెరుగుతుంది. ఆర్థిక సమస్యలనుండి బయటపడతారు. ఇది సామాజిక జీవితానికి సంబంధించిన ప్రకాశవంతమైన కాలం. మెరుగైనస్థానం మరియు స్థితిని పొందేకాలం. ఇది మీ సర్కిల్లో మీ ఇమేజ్ని పెంచుతుంది. ఈ కాలంలో మీ స్నేహితులు కూడా మీకు సహకరిస్తారు. వివాహితులుకూడా ఆనందకరమైన సమయాన్ని గడుపుతారు.



**తుల–** యత్నకార్యసిద్ధి, విద్య, వృత్తిపరంగా ముందంజ. లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి అందరిమన్ననలను పొందుతారు. కొత్త ఉద్యోగంలో చేరు అవకాశం ఉంటుంది. ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధిస్తారు.



**వృశ్చికం–** వాహనం, సంపద మరియు విలాసవంతమైన జీవితంవంటి సాధారణ సౌకర్యాలతో మీ జీవనశైలి సంపన్నంగా ఉంటుంది. మీ ప్రయత్నాలకు అనుగుణంగా ఆదాయంకూడా తగినంతగా ఉంటుంది.



**ధనుస్సు–**ఉద్యోగపరంగా గుర్తింపు. సంతృప్తికరమైన జీవనం సాగిస్తారు. ధనానికి లోటుండదు. అప్పుడప్పుడు మానసిక ఇబ్బందులు పడుతూంటారు. అదృష్టం మిమ్ములను వరిస్తుంది.



**మకరం–**ఉత్తమఫలితాలను ఆశించలేరు. మానసిక శారీరక ఒత్తిడితో ఉంటారు. స్త్రీలతో సంభాషణ సమయంలో జాగురూకతతో ఉండాలి. నోటిని అదుపులో ఉంచడం మంచిది. ఆర్థికవిషయాలు సామాన్యం.



**కుంభం–** చదువుల్లో ప్రతిభాపాటవాలతో రాణిస్తారు. క్రొత్తవిషయాలను నేర్చుకునే ఆసక్తితో కృషిచేసి కొత్తనైపుణ్యాలను నేర్చుకుంటారు. పోటీ పరీక్షల్లో ఖచ్చితంగా విజయం సాధిస్తారు. మీ ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు.



**మీనం–** గృహమును విడిచి ఇతరచోట్ల నివసించవలసివస్తుంది. చర్మవ్యాధులకు గురౌతారు. స్థిరాస్తి సంబంధక్రయవిక్రయాలు వాయిదా వేయటం మంచిది.

గెలవగలననే ఆశలేనివాడు ఆటకు ముందే ఓడిపోతాడు

ఆయుర్వేదం

# మర్రిసిరి

– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

మోరేసి అను వృక్షకుటుంబానికి చెందిన ఈ వృక్ష శాస్త్రీయనామం ఫైకస్ బెగలెన్సిస్.

మనదేశ జాతీయవృక్షం ఈ మర్రి.

దైనందినజీవితంలో మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలకు మర్రిచెట్టుతో ఎన్నో పరిష్కారాలున్నాయి. అవి:

**నడుమునొప్పికి:** రోజూ పలుచటి నూలుబట్టను మర్రిపాలతో తడిపి నడుముపై అంటించి మరురోజు తొలగిస్తుంటే చాలా త్వరగా నడుమునొప్పిసమస్య తగ్గుతుంది.

**పేనుకొరుకుడు:** రోజూ ఒకసారి తగినన్ని లేత మర్రివూడలు, ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో లభ్యమయ్యే జటామాంసి చూర్ణం, ఉసిరికచూర్ణములను తగినంత కలిపి నూరి సమస్య ఉన్నభాగంలో పట్టించి సున్నితంగా మర్దన చేస్తుంటే ఆ సమస్య తగ్గి మరల కేశోత్పత్తి జరుగుతుంది.

**శిరోజాలు బాగా పెరిగేందుకు:** వారంలో 2, 3 సార్లు రాత్రి పూట తగినంత నిమ్మరసంలో ఒకటీస్పూన్ మర్రివూడలచూర్ణం, ఒకటీస్పూన్ ఉసిరికపొడి కలిపి నానించి ఉదయం మెత్తగా నూరి తలకి పట్టించి రెండుగంటలాగి తలస్నానం చేస్తుంటే శిరోజాలు బాగా పెరుగుతాయి. కోమలంగా మృదువుగా ఆకర్షణీయంగా తయారవుతాయి. చుండ్రులాంటి సమస్యలు దరిచేరవు.

**అధికవేడికి:** ఎండిన మర్రిపళ్ళు, ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో లభ్యమయ్యే అతిమధురం, పటికబెల్లంచూర్ణాలను సమానంగా కలిపి నిల్వఉంచుకుని మూడుపూటలా పూటకు 1–2 గ్రా. చూర్ణాన్ని 50మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే శరీరంలో పైత్య దోషం తగ్గి అమిత వేడి శాంతిస్తుంది. ఈ ఔషధాన్ని ఇదే పద్ధతిలో వాడుకుంటుంటే కడుపులో మంట, నోటిపూత తగ్గు తాయి. మధుమేహవ్యాధిగ్రస్తులు మినహా మిగిలినవారందరూ ఈ ఔషధం సేవించవచ్చు.

**గాయాలు, వ్రణాలకు:** చర్మం తెగినపుడు చర్మం అంచులను ఒకటిగా చేర్చి మర్రిఆకులను కాస్త వెచ్చజేసి కట్టడం, పుళ్ళపై కూడా ఆకులను ఇలా కట్టడంవల్ల చాలా త్వరగా ఆ సమస్యలు తగ్గుతాయని గిరిజన అనుభవవైద్యం చెబుతోంది.

**సంతానావకాశాలు మెరుగయ్యేందుకు:** మర్రిపాలు, తాటి బెల్లం సమానంగా కలిపి నూరి ఉంచుకుని రోజూ రెండు పూటలా పూటకు అరటీస్పూన్ ప్రమాణం సేవించి 100మి.లీ. పాలు సేవిస్తుంటే పురుషుల్లో సంతానం కల్గే అవకాశం కలుగుతుంది.

**కొలెస్ట్రాల్‌సమస్యకు:** రోజూ ఉదయం 3–5గ్రాముల మర్రి ఆకులచూర్ణాన్ని 100మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే యల్.డి. యల్.గా పిలువబడే శరీరానికి హానిచేసే చెడుకొలెస్ట్రాల్ తగ్గడమేకాక మనకు మేలుచేసే హెచ్.డి.యల్. అనే మంచికొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండెజబ్బులు, రక్త నాళాలజబ్బులుకూడా నివారింపబడతాయి.





**మర్రిచెట్టుకే వటవృక్షమని పేరు. జగమంతా జలమయమైనపుడు శ్రీమహావిష్ణువు బాలునిరూపంలో వటపత్రంపైనే తేలియాడుతూ ప్రత్యక్షమయ్యాడు.**



వ్యక్తిగతంగా ఎన్నికష్టాలున్నా పక్కవారికి సహాయం చేసేవారే శక్తిమంతులు

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-32

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| | | | | | |
|---|---|---|---|---|---|
| तस्मै | = వానికొరకు - కై | चलितुम् | = కదలన్, కదలుటకు | उषित्वा | = ఉండి |
| तस्मात् | = వానివలన - నుండి | कारयति | = చేయించుచున్నాడు | वस्तुम् | = ఉండన్ - ఉండుటకు |
| तेभ्यः | = వారికొరకు వారివలన | भूत्वा | = అయి | अस्तु नाम | = కానిమ్ములే |
| त्वत् | = నీవలన - కంటె | भवितुम् | = కాన్ (అగుటకు) | यच्छति | = ఇచ్చుచున్నాడు |
| मत् | = నావలన - కంటె | चलित्वा | = కదిలి | दास्यति | = ఈయగలడు |
| भवतु नाम | = కానిమ్ములే | | | | |

**అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి.**

01) अहं मर्कटाय अन्नं यच्छामि।

02) त्वं तस्मै पानीयं दास्यसि किम्?

03) क्षीरं कुत्रास्ति वा?

04) बालकेभ्यः अद्य प्रातः क्षीरं कः दास्यति?

05) त्वं शीघ्रं गत्वा मम जनकं स्नानं कारय।

06) त्वं न चेत् कः कारयिष्यति?

07) गृहात् बहिः अनेके ब्राह्मणाः सन्ति।

08) तेभ्यः सर्वेभ्यः भोजनं यच्छत।

09) तव जनकाय एषः फलं यच्छतु।

10) अस्तु नाम कः यच्छति चेत्किम्?

11) तथैव भवतु।

12) अहम् अद्यैव खलु फलम् अयच्छम्।

**అ) జవాబులు**

01) నేను కోతికొరకు అన్నం ఇస్తున్నాను.

02) నీవు వానికై పానీయమును ఇస్తావా?

03) పాలు ఎక్కడున్నవి?

04) బాలకులకొరకు ఈ రోజు ఉదయం పాలు ఎవడు ఇస్తాడు?

05) నీవు వెంటనే వెళ్లి నా తండ్రికి స్నానం చేయించు.

06) నీవు కాకపోతే ఎవడు చేయిస్తాడు?

07) ఇంటి బయట అనేకమంది బ్రాహ్మణులు ఉన్నారు.

08) వారందరికొరకు భోజనం ఇవ్వండి.

09) నీ తండ్రికొరకు ఈ పండును ఇవ్వు.

10) కానిమ్ములే ఎవడు ఇస్తేనేమి?

11) అలాగే కానిమ్ము.

12) నేను ఈ రోజే కదా పండు ఇచ్చాను.

**ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి.**

01) కోతులు కొండలందు నడుచుచున్నవి.

02) చాలా కోతులు చెట్లనుండి పడినవి.

03) మీరు మాతో ఎందుకు యుద్ధము చేయుదురు?

04) మేము మీతో ఎప్పుడు యుద్ధము చేయము.

05) మీరే మాతో యుద్ధము చేయుటకు వచ్చుచున్నారు.

06) వారెవరును ఇక్కడ లేరు.

07) ఆ కొండయందెన్ని కోతులున్నవి?

08) ఏమో ఎవడు చూచినాడు.

09) అయ్యో! ఆ పిల్లికొరకు కొంచెము పాలనివ్వండి.

10) ఇవ్వేళ నేను ఊరికి పోవలయును.
కాబట్టి త్వరగా వంటను చేయించుడు.

11) మీరు మొదట నీరును తీసుకొని వచ్చిన యెడల నేను
వంటను చేయించగలను.

12) ఆ బ్రాహ్మణులను మంచి నీరు తెండని చెప్పుడు.

**ఆ) జవాబులు**

01) मर्कटाः पर्वतेषु गच्छन्ति।

02) बहवः मर्कटाः वृक्षेभ्यः अपतन्

03) यूयं अस्माभिः किमर्थं युद्धं कुरुथ?

04) वयं युष्माभिः कदापि युद्धं न कुर्मः।

05) यूयमेव अस्माभिः युद्धं कर्तुम् आगच्छथ।

06) ते केपि अत्र न सन्ति।

07) तस्मिन् पर्वते कति मर्कटाः सन्ति।

08) कः दृष्टवान्?

09) अहो! तस्मै मार्जालाय क्षीरं ददतु।

10) अद्य मया ग्रामं गन्तव्यं शीघ्रं पाकं कारयतु।

11) यूयं प्रथमं जलं आनयथ चेत् अहं पाकं
कारयिष्यामि।

12) तान् ब्राह्मणान् जलम् आनयन्तु इति वदत।

చిత్ర కథ

# దైవదూషణ మహాపాపం

కథ- శ్రీమతి వావిలాల నాగవల్లి
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

శిశుపాలుడు దమఘోషుడు, సాత్వతిల కుమారుడు. ఇతనికి శ్రీకృష్ణునితో వైరం కల్గింది. ఆ తర్వాత కృష్ణుడు ఇతణ్ణి తన చక్రాయుధంతో సంహరించాడు. ఆ కథేంటో చూద్దాం.






**నీతి:** ఎలాంటి పరిస్థితుల్లోనైనా దైవాన్ని దూషించరాదు. అలా చేస్తే ఎవరికైనా, ఎలాంటివారికైనా దుర్గతులు తప్పవు.

## ఏమండీ.. ఏమండి!!

### గేయం పాడుదాం!!



అదిగోనండి మా బడి
నేర్పును మాకు చక్కని నడవడి
శ్రద్ధగ చదువులు చదివెదమండి
చక్కగ కలిసి ఉంటామండి!

పాఠాలెన్నో చదివామండి
పంచతంత్రం విన్నామండి
అందులో నీతి తెలిసిందండి
ఎప్పుడు తప్పులు చేయం లెండి!

చక్కగ బుద్ధిగ ఉంటామండి
మంచిపనులు చేస్తామండి
కలసి అందరం ఉంటామండి
ఆనందంగా జీవిస్తామండి!

తగవులు ఎప్పుడు పడమింకండి
కలసికట్టుగా ఉంటామండి
కలసిమెలసి పనిచేస్తామండి
కంచుకోట నిర్మిస్తామండి!

భారతంకథలు విన్నామండి
ధర్మంగానే ఉంటామండి
అందరం చల్లగ ఉంటామండి
గోవిందనామస్మరణతోనేనండి!

---



పిల్లలూ...
ప్రక్కన చూపిన చిత్రాలలో...
వివిధ రాష్ట్రాలకు చెందిన
నాట్యరీతులున్నాయి.

అవేంటో కనుక్కొని సరియైన
నాట్యంపేరు, రాష్ట్రంపేరు
క్రింద ఉన్న ఖాళీల్లో వ్రాయండి!

**సమాధానాలు ఇక్కడ వ్రాయండి**

01) ..............................
02) ..............................
03) ..............................
04) ..............................
05) ..............................
06) ..............................



జవాబులు:
1)కూచిపూడి - ఆంధ్రప్రదేశ్
2)భరతనాట్యం - తమిళనాడు
3)కథాకళి - కేరళ
4)యక్షగానం - కర్ణాటక
5)మోహినీఆట్టం - కేరళ
6)మణిపురి - మణిపురి



## దశావతారాలు

క్రింది గేయంలో దశావతారాల చిత్రాలున్నాయి.
ఆ పేరు కనుక్కొని గేయం పాడుదామా!

01) మా పాప మామల్ల 

02) కూర్చున్న తాతల్లు 

03) వరసైన బావల్లు 

04) నట్టింట నా అత్త 

05) వాసిగల బొట్టెల్లు 

06) పరమగురుదేవ 

07) రక్షించురామయ్య 

08) బంట్లైన బంధువులు 

09) కలివిడితో మా అన్న 

10) వర్ధిల్లు పసిపాప వర్ధిల్లు
నా తండ్రి చిట్టి నా కన్నోడ 

జవాబులు: 01)మత్స్యావతారం 02)కూర్మావతారం 03)వరాహావతారం 04)నరసింహావతారం 05)వామనావతారం 06)పరశురామావతారం 07)రామావతారం 08)బలభద్రావతారం 09)కల్క్యావతారం 10)శ్రీకృష్ణావతారం

చిత్రాలు: కె.ద్వారకనాథ్

## ఎలా ఉంటారంట..? ఇలా ఉంటారట..!!

1) ఆదివారం పుట్టినవారంట?
2) సోమవారం పుట్టినవారంట?
3) మంగళవారం పుట్టినవారంట?
4) బుధవారం పుట్టినవారంట?
5) గురువారం పుట్టినవారంట?
6) శుక్రవారం పుట్టినవారంట?
7) శనివారం పుట్టినవారంట?



సమాధానాలు
1) అద్భుతంగా చదువుతారట!!
2) సత్యమే పలుకుతారట!!
3) మంచిపనులే చేస్తారట!!
4) బుద్ధిమంతులై ఉంటారట!!
5) పరోపకారమే చేస్తారట!!
6) సహనం కలిగి ఉంటారట!!
7) శాంతముగ ఉంటారట!!

సేకరణ: మద్దిబాల శ్రీ

## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి



## విశ్వదాభిరామం — వేమన పద్యసూక్తి



# నీతిగా బతకాలి

కోతి బట్టి తెచ్చి, కొత్తపుట్టము గట్టి,
కొండముచ్చు లెల్ల గొలిచినట్లు,
నీతిహీనునొద్ద నిర్భాగ్యు లుందురు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** పుట్టము= వస్త్రం; కొండముచ్చులు= కోతులలో ఒకరకం. వీనిని గోలాంగూలము లంటారు ఇవి అడవుల్లో ఉంటాయి; నీతిహీనుడు= నీతి తప్పిన వాడు; నిర్భాగ్యులు= దరిద్రులు.

**భావం:** కోతిని పట్టుకొని తెచ్చి కొత్తబట్టలు చుట్టి, కొండ ముచ్చులు సేవించినట్లు నీతిమాలినవాడిదగ్గర దరిద్రులే కొలువుంటారు..

**వివరణ:** కోతి అల్పజంతువు. దానిని ఎవరూ గౌరవిం చరు. కాని, దానిని చక్కగా అలంకరించి, సింహాసనంపై కూర్చుండబెట్టి సేవించాయి కొండముచ్చులు. అల్పులను అల్పులే గౌరవి స్తారు. నీచులదగ్గరకు నీచులే చేరతారు. విజ్ఞులు ఆదరించరు కదా.

అలాగే నీతితక్కువవాళ్లదగ్గరకు నీతి లేని దుర్మార్గులే చేరతారు. వాళ్లు చుట్టూ చేరి, సేవిస్తూ పొగుడుతుంటే ఇంకా ఇంకా పతన మైపోతాడు. అలా దుష్టుడై సాధుజనులచేత నిందలపాలు కావడం తగదు. అందుచేత మానవుడు నీతిమంతంగా జీవించాలి. నీతి మంతులతో కలిసిఉండాలి అని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## శ్రీకృష్ణామృతం — శ్రీకృష్ణసంకీర్తనం



తులసీవనమాలీ
దేవదేవహరి ముకుందమురారీ
పాహిపాహి హరిపాలనహరే
దేవదేవహరి సర్వమునీవే
పాహిపాహి హరిపాలనసేయవే

మాధవా నిను అర్చనచేయుదు
పూజలుచేయగా మనసునకోరితి
బిరబిరరావయా పూజలుగైకొన
చిరుచిరునగవులు మోమునమెరయగ
ధిమిధిమిధిమికిట నాట్యముచేయుచు
మృదుమృదురవళుల మురళినిమ్రోయుచు

ఘుమఘుమ
చందనగంధముతేలగ
రాలగజాజులు హారపు జలజలవనమాలీ తులసీ..
కరమున కంకణకాంతులు మెరయగ
గళమున ఘనమగు హారములాడగా
మువ్వలసవ్వడి ఇంపుగాతోచగా
మణిమయమకుటము ధగధగలాడగ

పింఛపుసొగసులు ప్రీతినికూర్చగా
నీలపునుదిటిపై ముంగురులాడగా
బంగరుచేలము రెపరెపలాడగ
చల్లనిచూపులు మాపైనిలువగా
సుదతీరుక్మిణి కరమునుపట్టీ
అడుగునఅడుగై అంతటనీవై
చింతలువిడచీ చింతనచేయుదు
చెంతననిలచీ చరణము(ల) చేర్చుము

–'అనంత'
కృష్ణసుందరి
సత్తిరాజు,
99103 10594

## మే నెల క్విజ్-22 సమాధానాలు

| | |
|---|---|
| 01) ఉత్తరఫల్గుణీ | 11) వాసుకి |
| 02) ఉత్తరఫల్గుణీ | 12) చంద్రవంశం |
| 03) మోక్షం | 13) కర్దముడు |
| 04) అన్నదానం చేసిన వారికి | 14) ఆది శంకరులు |
| 05) శ్రీకందాడైరామానుజఅయ్యంగార్ | 15) అక్కారాం |
| 06) జూన్ 21 వ తేదీ | 16) దాసస్సఖా |
| 07) 1300 కిలోమీటర్లు | 17) తానీషా |
| 08) మాఘశుక్ల సప్తమి రోజున | 18) ఆకునూరు నరసన్నపంతులు |
| 09) మెరటక్ | 19) స్వతంత్ర నిర్ణయం |
| 10) తాళ్లపాక అన్నమాచార్యులు | 20) వరుణలోక వృత్తాంతం వినేవారికి |

సరైన సమాధానాలు వ్రాసినవారు–

01)జాహ్నవ్, ఖమ్మం 02)కె.శాంతిప్రియ, కరీంనగర్ 03)కె.రుత్విక్ సాయి, ఖమ్మం 04)వి.బి.రోషిణి, కుప్పం 05)యసస్విని, ఖమ్మం

# క్విజ్ 24

01) దమఘోషుని కుమారుడు? జ)........................................
02) మానవునికి మనశ్శాంతినిచ్చే గ్రంథం? జ)........................................
03) యామునాచార్యుల తండ్రి? జ)........................................
04) 'కూచిపూడి' నాట్యానికి ఆద్యుడు? జ)........................................
05) 'పూరీక్షేత్రంలో' కొలువైన స్వామి? జ)........................................
06) పరమశివునికి ప్రణవోపదేశం చేసినవారు ? జ)........................................
07) 'పెరియాళ్వారు'కు మరోపేరు? జ)........................................
08) గురువులకు గురువు? జ)........................................
09) తిరుమలస్వామి పుష్పార్చనకు ఆద్యులు? జ)........................................
10) మానవుని పతనానికి ముఖ్యకారకాలు? జ)........................................
11) వ్యాసమహర్షి గురువు? జ)........................................
12) మానవులు పుట్టుకతోపాటు దీనినికూడా వెంటబెట్టుకొస్తారు? జ)........................................
13) మనుష్యజన్మం పరిమితకాలం? జ)........................................
14) మోక్షానికి సులభమార్గం? జ)........................................
15) తమిళనాడు నాట్యరీతి? జ)........................................
16) మోక్షాన్ని ప్రసాదించే వేదమంత్రం? జ)........................................
17) ఆణివరఆస్థానం ఏ తేదీన వస్తుంది? జ)........................................
18) చిరకారి తండ్రి? జ)........................................
19) తొలిఏకాదశికి మరోపేరు? జ)........................................
20) మానవులకు జ్ఞానాన్ని ప్రసాదించేవారు? జ)........................................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-07-2024.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................................... వయస్సు: ....................
పాఠశాల: .................................... తరగతి: ....................
పేరు: ................................................................
చిరునామా: ................................................................
................................................................
................................................................
.................................... పిన్‌కోడ్: ....................
ఫోన్ సంఖ్య: ................................................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................................ తేది : ...................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 102



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)రాక్షసులు, దేవతలు దీన్ని కవ్వంగా చేసుకుని పాలసంద్రాన్ని చిలికారు(4); 3)శ్రీరామచంద్రునితమ్ముడు(4); 6)'మండోదరి'- ఈ పదంలో దాగిన 'ఒడ్డు' అనేఅర్థం వచ్చేపదం(2); 7)చేతికఱ్ఱ(3); 8)'గోదావరి'-ఈ పదంలో మనం భుజించే ధాన్యం(2); 12)బలం లేనిది. ఆడది(3); 13)వాయుదేవునికుమారుడు(3); 17)భక్తుల హృదయాలను ఆకర్షించువాడు. విష్ణువు(2); 18)వ్యాసమహర్షికుమారుడు. ఇతనిశిరస్సు చిలుకశిరస్సు(3); 19)వనవాసకాలంలో సీతారాములు ఈ బట్టల్ని ధరించారు (2) 22)ఏడుకొండలస్వామి ఉన్న చోటు(2) 23)శ్రీరామచంద్రునికి ఆదిత్యహృదయాన్ని ఉపదేశించిన మహర్షి (4)

### నిలువు

1)రావణునిభార్య(4); 2)మన్మథునిభార్య(2); 4)ఈ వంశంలో రాముడు జన్మించటంవల్ల రఘువీరుడయ్యాడు(2); 5)సంగీతసాధన చేయాలంటే ఇది స్వచ్ఛత కల్గిఉండాలి(3); 9)శత్రువు(2); 10)ఈమె పండ్లను కొరికి రుచిచూసి రామునికర్పించిన భక్తురాలు(3); 11)దొంగలు(3); 14)దేవతలగురువు(4); 15)వేగుజాము(3); 16)బ్రహ్మమానసపుత్రుడు(4); 20)భ్రాంతి, భిన్నంగా గ్రహించటం(2); 21)త్రాచుపాము జోలికివెడితే మానవునిపై ఇది పడుతుంది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.








13-06-2024 న శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థమై తిరుచానూరుకు సకుటుంబ సమేతంగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర నూతన ముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ **నారా చంద్రబాబునాయుడు** దంపతులు, వారి కుమారుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రివర్యులు (హెచ్.ఆర్.(విద్యాశాఖ), ఐ.టి. ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, ఆర్‌టిజి) గౌ॥ శ్రీ **నారా లోకేష్** దంపతులు వారి కుమారుడు, ఇతర ప్రముఖులు మరియు అధికారులు. అనంతరం ఆశీర్వాదమండపంలో గౌ॥ ముఖ్యమంత్రి దంపతులకు శేషవస్త్రంతో వేదాశీర్వచనంచేస్తున్న అర్చకులు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలు అందిస్తున్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-06-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః॥

# వ్యాసపూర్ణిమ

(21-07-2024)

